RNI NO.TELTEL / 2013 /50370

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 27.11.2024 | సంపుటి : 11 సంచిక : 136 | పేజీలు : 12 వెల: రూ. 4/-

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698






## నాలుగు రాష్ట్రాల్లో త్వరలో రాజ్యసభ ఉప ఎన్నికలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఆంధ్రప్రదేశ్ సహా నాలుగు రాష్ట్రాల్లో త్వరలో రాజ్యసభ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఏపీ, ఒడిశా, పశ్చిమ బెంగాల్, హర్యాణా రాష్ట్రాల్లో ఖాళీ అయిన ఆరు స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. ఈసీ రిలీజ్ చేసిన షెడ్యూల్ ప్రకారం.. డిసెంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. డిసెంబర్

మిగతా 10లో..

## పరిశీలనలో రాహుల్ పౌరసత్వం



కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పౌరసత్వం అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, ఈ నేపథ్యంలో

మిగతా 2లో..

## ఢిల్లీలో కేంద్రమంత్రులతో సీఎం రేవంత్

# వరుస భేటీలు

### రాహుల్ హామీ మేరకు తెలంగాణలో కులగణన



పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేశాం

ఎఐసిసి సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణలో ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేపడుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సంవిధాన్ రక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు, దళితులకు, ఆదివాసులకు భూ చట్టాలు తీసుకొచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. భారత్ జోడో యాత్ర పేరిట రాహుల్ గాంధీ అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ వారి ఇబ్బందులు తెలుసుకున్నారని అన్నారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో రిజర్వేషన్లు అమలు చేసేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు గాంధీ పరివార్ ఉందని.. రాహుల్ గాంధీకి అండగా తాము ఉన్నామని వ్యాఖ్యానించారు.

మిగతా 2లో..

## తెలంగాణలో మరిన్ని విమానాశ్రయాలు

- త్వరలో మూడింటిని అభివృద్ధి చేస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్‌తో భేటిలో కేంద్రమంత్రి రామ్మోహన్
- వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సీఎం విజ్ఞప్తి

వార్త 2లో





# సజీవ, ప్రగతిశీల పత్రం మన రాజ్యాంగం

### సమాజానికి మూలస్తంభం వంటిది..

- ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రూపకల్పన
- దేశ ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు
- పాత పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం

న్యూఢిల్లీ(జనంసాక్షి):మన దేశ రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పాత పార్లమెంట్ ప్రాంగణంలోని సెంట్రల్ హాల్‌లో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు.రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సహా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులంతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ప్రసంగించారు. సమాజానికి రాజ్యాంగం మూలస్తంభం వంటిదని కొనియాడారు."దేశ ప్రజలందరికీ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు. 75 ఏళ్ల క్రితం ఇదేరోజున రాజ్యాంగం ఆమోదం పొందింది. ఇది మన పవిత్ర గ్రంథం. ప్రజాస్వామ్య, గణతంత్ర సూత్రాల ఆధారంగా రాజ్యాంగ రూపకల్పన జరిగింది. రాజ్యాంగానికి రాజేంద్రప్రసాద్, అంబేద్కర్ మార్గనిర్దేశం చేశారు. ప్రగతిశీల సూత్రాల గురించి రాజ్యాంగంలో పొందుపర్చారు. రాజ్యాంగ రచనలో భాగస్వాములను స్మరించుకోవాలి. మన రాజ్యాంగం

మిగతా 2లో..

## భారత రాజ్యాంగం కాల పరీక్షకు నిలిచింది

2లో

ఉగ్రవాదానికి భారత్ దీటుగా బదులిస్తాం

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ

## ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా చదవలేదు:రాహుల్

వార్త 2లో

# ప్రపంచానికి ఔషధఫ్యాక్టరీగా తెలంగాణ



- 33శాతం వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు రాష్ట్రం నుంచే సరఫరా
- లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందడుగు వేస్తున్నాం :శ్రీధర్‌బాబు

హైదరాబాద్(జనంసాక్షి): టీకాలు, జనరిక్ ఔషధాలు, క్యాన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల నివారణకు అవసరమైన బయోసిమిలర్స్ ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం ప్రపంచ గమ్యస్థానంగా వృద్ధి చెందిందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో మరింత ముందడుగు వేసే దిశగా ప్రస్థానం కొనసాగిస్తోందన్నారు. మాదాపూర్‌లో ఏర్పాటు చేసిన ఇండో-బెల్జియన్ లైఫ్ సైన్సెస్ సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 33శాతం వ్యాక్సిన్లు, జనరిక్ ఔషధాలు తెలంగాణ నుంచే సరఫరా అవుతాయని గుర్తు చేశారు.కొత్త అవకాశాలు, అనుకూల వాతావరణంతో బెల్జియం లైఫ్ సైన్సెస్ కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్నామన్నారు. ఇక్కడ నైపుణ్యం కలిగిన మానవ వనరులు, మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. యూరోపియన్ యూనియన్‌లో రెండో అతిపెద్ద ఔషధ ఎగుమతిదారుగా ఉన్న బెల్జియం.. ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన ఆవిష్కరణలతో ముందంజలో ఉందని శ్రీధర్ బాబు వెల్లడించారు. బలమైన భాగస్వామ్యం ద్వారా రెండు దేశాలు పరస్పర ప్రయోజనం పొందగలవన్న విశ్వాసం తనకుందని పేర్కొన్నారు.



### ఇథనాల్ ఫ్యాక్టరీపై

# పెల్లుబుకిన ప్రజాగ్రహం

- నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ బంద్.. భారీ రాస్తారోకో
- స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాదిమంది.. స్తంభించిన హైవే
- పిల్లాపాపలతో ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు రోడ్డుపైనే..
- కంపెనీ అనుమతులన్నీ రద్దుకు పట్టుబట్టిన మహిళలు, రైతులు



ఎముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా చంటిపిల్లలతో జాతీయ రహదారిపైనే బైటాయించి నిరసన తెలుపుతున్న ప్రజలు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును రద్దు చేసేవరకు తమ ఆందోళనలను ఆపేదిలేదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

వివరాలు 12లో..





# మాగనూరు.. మళ్లీ అదే తీరు..

- మళ్లీ మధ్యాహ్న భోజనం వికటించి 21 మంది విద్యార్థులకు అస్వస్థత
- ఒకరి పరిస్థితి విషమం.. మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలింపు
- వారంక్రితం ఇదే పాఠశాలలో 50 మంది విద్యార్థులకు అస్వస్థత
- సీఎం రేవంత్ హెచ్చరించినా మారని పరిస్థితి.. ఆందోళనలో తల్లిదండ్రులు

మాగనూర్ నవంబర్ 26 (జనంసాక్షి): నారాయణపేట జిల్లా మాగనూర్ పాఠశాలలో అంతర్జాతీయ బాలల దినోత్సవం రోజే వంద మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం తిని ఫుడ్ పాయిజన్‌తో ఆస్పత్రి పాలైన సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించన సంగతి తెలిసిందే.. ఈ ఘటనను సీఎం సీరియస్‌గా తీసుకుని డీఈవోతో సహా పలువురిని సస్పెండ్ చేశారు.అప్పటి నుంచి ఇప్పటి వరకు ఉన్నతాధికారుల పర్యవేక్షణలోనే మధ్యాహ్న భోజనం కొనసాగుతోంది.. అయినా పాఠశాల తీరు ఏమాత్రం మారలేదు.. తాజాగా మంగళవారం పాఠశాలలో

మిగతా 2లో..

# ముఖ్యమంత్రివి పచ్చి అబద్ధాలు

ఆనాడు అదానీ ఇచ్చిన ప్రతిపాదనలను కేసీఆర్ తిరస్కరించారు .. కేటీఆర్ వివరణ



2లో

# ఈవీఎంలు వద్దు..బ్యాలెటే మేలు



దేశంలో ఐక్యత కావాలంటే విద్వేషాలను విస్తరించడం మానుకోవాలి: మల్లికార్జున ఖర్గే

న్యూఢిల్లీ(జనంసాక్షి):కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల నిర్వహణకు ఈవీఎంలు వద్దని.. బ్యాలెట్ పేపర్లే తాము కోరుకుంటున్నామన్నారు. మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు

మిగతా 2లో..

# డ్రోన్లదాడులతో ఉక్రెయిన్ ఉక్కిరిబిక్కిరి

మొత్తం 17 ప్రాంతాల్లో 188 డ్రోన్లతో విరుచుకుపడ్డ రష్యా



## ఇజ్రాయెల్‌పై బాంబుల మోత

250 రాకెట్స్ ప్రయోగించిన హెజ్బొల్లా..

మరోవైపు బీరూట్‌పై ఐడీఎఫ్ భీకర దాడులు

వార్త 2లో

కీవ్(జనంసాక్షి):రష్యా మరోసారి రెచ్చిపోయింది. ఉక్రెయిన్‌పై 188 డ్రోన్లతో విరుచుకుపడింది. రాత్రి వేళ మొత్తం 17 ప్రాంతాల్లో ఈ దాడులు జరిగినట్టు ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకటించింది. ఇప్పటివరకు జరిగిన దాడులతో పోలిస్తే ఈ సారి రికార్డు స్థాయిలో డ్రోన్లను ప్రయోగించిందని పేర్కొంది.వీటిలో చాలా డ్రోన్లను అడ్డుకున్నట్లు అధికారులు తెలిపారు. అయితే.. ఈ దాడి కారణంగా భవనాలు, జాతీయ పవర్‌గ్రిడ్‌తో సహా కీలక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 17 ప్రాంతాల్లో జరిగిన ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని అధికారులు వెల్లడించారు. మరోవైపు.. సరిహద్దు ప్రాంతంలో ఉక్రెయిన్ ఉంచిన 39 డ్రోన్లను తమ సైన్యం ధ్వంసం చేసినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.కాగా.. ఇటీవల వందలకొద్దీ గ్లైడ్

మిగతా 10లో..



## గెలిస్తే సంబరాలు.. ఓడితే ట్యాంపరింగా?

కెఎ పాల్ పిటిషన్‌పై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ(జనంసాక్షి): గెలిస్తే ఇవిఎంలు మంచివి. .లేకుంటే చెడ్డవా అంటూ సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎంలను రద్దుచేసి దేశవ్యాప్తంగా ఎన్నికల్లో మళ్లీ బ్యాలెట్ విధానాన్ని తీసుకుని

మిగతా 2లో..

# డిజైన్ లేకుండానే

## సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాకు నిర్మాణం

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్ల వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):సుందిళ్ల బ్యారేజీలోని 2ఏ బ్లాకును డిజైన్ లేకుండానే నిర్మాణం ప్రారంభించినట్లు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు ఇంజినీర్లు తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ముందు మంగళవారం 16 మంది క్షేత్రస్థాయి ఇంజినీర్లు విచారణకు హాజరయ్యారు. గతంలో వారు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా కమిషన్ వారిని ప్రశ్నించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన

మిగతా 2లో..



# ముఖ్యమంత్రివి పచ్చి అబద్ధాలు

**ఆనాడు అదానీ ప్రతిపాదనలను కేసీఆర్ తిరస్కరించారు: కేటీఆర్**

**హైదరాబాద్(జనంసాక్షి):**సీఎం రేవంత్‌రెడ్డిలో నిస్పృహ, అసహనం కనిపిస్తున్నాయని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. భారాస హయాంలో అదానీ(ఉజీబీబిజీఎ ంటజీనితి)కి ఇచ్చిన పనులు అంటూ ఆయన ఓ తప్పుడు నివేదిక విడుదల చేశారని ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. సీఎం సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "సీఎం అవగాహనా రాహిత్యంతో మాట్లాడితే ఎలా?అదానీ కలిసి కొన్ని ప్రతిపాదనలు ఇస్తే అప్పటి సీఎం కేసీఆర్ తిరస్కరించారు. అదానీకి.. మేము రెడ్ సిగ్నల్ వేస్తే.. మీరు రెడ్ కార్పెట్ వేస్తున్నారు" అని సీఎం రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాగా తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి ఇంట్లో ఈడీ దాడులు జరిగి రెండు నెలలైనా ఎలాంటి సమాచారం లేదంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఆ దాడుల గురించి ఏమైనా అప్‌డేట్స్ ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. దాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, కనీసం ఈడీ అధికారుల స్టేట్‌మెంట్లు కూడా ఇప్పటికీ బయటకు రాలేదన్నారు. ఆ రోజు నోట్ల లెక్కింపు కోసం వాడిన రెండు కౌంటింగ్ మెషిన్లు ఏమయ్యాయని నిలదీశారు. ఆ దాడులపై ఎందుకు ఈ నిశ్శబ్దం అంటూ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. ఈ ఏడాది సెప్టెంబర్ 27న హైదరాబాద్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నివాసంతోపాటు ఆఫీసుల్లో ఈడీ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. విదేశీ మారక నిల్వల వ్యవహారంలో మిసెస్ జెడ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కార్యాలయల్లో ఈ నెల 22న ఈడీ దాడులు నిర్వహించింది. ఒడిశా, ఢిల్లీ, గురుగ్రామ్‌తోపాటు 9 చోట్ల ఏకకాలంలో అధికారులు సోదాలు చేశారు. ఈ క్రమంలో రూ.1.39 కోట్లు, రహస్య పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సోమవారం ఈడీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఇంట్లో ఐటీ దాడులు జరిగి 2 నెలలైనా ఇప్పటికీ ఎలాంటి సమాచారం లేకపోవడంపై కేటీఆర్ ప్రశ్నించారు.

# మాగనూరు.. మళ్లీ అదే తీరు..

మధ్యాహ్నం భోజనం తిని 21 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. భోజనం చేసి విద్యార్థులు ఒక్కొక్కరు వాంతులు, కడుపునొప్పి చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. తహశీల్దార్ సురేష్, ఎంపీడీవో రహ్మతుద్దీన్ స్థానిక కాంగ్రెస్ , అఖిలపక్ష నాయకులు అస్వస్థతకు గురైన విద్యార్థులను మాగనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రాథమిక చికిత్స అంది మెరుగైన వైద్యం కోసం మక్తల్ ఆస్పత్రికి తరలించారు. వారిలో నేత్ర అనే అమ్మాయి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రి తరలించారు. చికిత్స పొందుతున్న విద్యార్థులను మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మధ్యాహ్న భోజనమును కొత్త ఏజెన్సీ వారే వండారని అదే ఆహారాన్ని అధికారులు ఉపాధ్యాయులు స్వయంగా పర్యవేక్షించే స్వయంగా తిన్నామని అన్నారు. బియ్యం స్టాక్ ను మార్చి మధ్యాహ్న భోజనానికి కొత్త స్టాక్ ను వినియోగించామని బయట ఏజెన్సీ నుంచి కొనుగోలు చేసిన శుద్ధి చేసిన నీటిని వంటకు ఉపయోగించమని ఏజెన్సీ నిర్వాహకులు అన్నారు పాఠశాలలో మొత్తం 597 మంది విద్యార్థులలో 400 మంది విద్యార్థులు హాజరయ్యారని 400 మంది భోజనం చేశారని ఉపాధ్యాయులు తెలిపారు. వారిలో 28 మంది విద్యార్థులు అస్వస్థకు గురయ్యారు. వారంలో మూడు సార్లు ఇలా జరగడం ఏంటని మండల ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రుల ఆశ్చర్యానికి, ఆందోళనకు గురవుతున్నారు. ఏజెన్సీపై చర్య తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు.

# గెలిస్తే సంబరాలు.. ఓడితే ట్యాంపరింగా?

రావాలంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈవీఎం విధానాన్ని రద్దు చేసి తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికల నిర్వహించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ కేఏ పాల్ పిటిషన్ దాఖలు చేశారు. విదేశాల్లో ఇప్పటికీ బ్యాలెట్ విధానాన్నే అనుసరిస్తున్నారని, భారత్ కూడా దాన్నే కొనసాగిస్తే బాగుంటుందని అన్నారు. అంతేకాకుండా.. ఎన్నికల సందర్భంగా దేశంలో రూ.వేల కోట్లలో అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై సుప్రీం ధర్మాసనం ఒకింత అసహనం వ్యక్తం చేసింది. 'ఇక్కడ ఏం జరుగుతోంది. మీరు గెలిస్తే ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయలేదు అంటారు. ఓడిపోతే మాత్రం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ట్యాంపరింగ్ జరిగిందంటారు. బ్యాలెట్ విధానాన్ని అనుసరించిన మాత్రాన అవినీతి ఆగిపోతుందని మీరు చెప్పగలరా?' అని ప్రశ్నించింది. అనంతరం ఈ పిటిషన్‌ను కొట్టివేసింది.

# పరిశీలనలో రాహుల్ పౌరసత్వం

ఆయన భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌పై స్పందన తెలియజేయాలంటూ అలహాబాద్ హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. న్యాయవాది, భాజపా నేత విఘ్నేశ్ శిశిర్ ఈ పిటిషన్ వేశారు. అలాగే కాంగ్రెస్ నేత పౌరసత్వం అంశంపై సీబీఐ విచారణ కూడా జరిపించాలని కోరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని భాజపా సీనియర్ నేత సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. ఆ దేశంలో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. ఇదే విషయమై 2019లో కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఆయన లేఖ రాశారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందని తన లేఖలో ప్రస్తావించారు. అలా కలిగి ఉంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ డిసెంబర్ 19న జరగనుంది

# పాకిస్థాన్‌లో హింసాత్మకంగా నిరసనలు

**కాల్పుల్లో ఆరుగురు భద్రతా సిబ్బంది మృతి**

**ఇస్లామాబాద్(జనంసాక్షి):**పాకిస్థాన్ మాజీ ప్రధాని, తెహ్రీక్ -ఏ- ఇన్సాఫ్ (పీటీఐ) అధినేత ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలంటూ ఆ పార్టీ మద్దతుదారులు చేపట్టిన భారీ నిరసన హింసాత్మకంగా మారింది. ఈ ఘటనలో నలుగురు పారామిలిటరీ సిబ్బంది, ఇద్దరు పోలీసులు మృతి చెందారు. దాదాపు 100మంది సెక్యూరిటీ సిబ్బంది గాయపడ్డారు. నిరసనలు హింసాత్మకంగా మారడం వల్ల, రాజధాని ఇస్లామాబాద్ ప్రాంతంలో ప్రభుత్వం భద్రతా చర్యలు కట్టుదిట్టం చేసింది. కనిపిస్తే కాల్చేయమని ఆర్మీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ముందు జాగ్రత్తగా రాజధాని ఇస్లామాబాద్?లోని విద్యాసంస్థలకు మంగళవారం సెలవు ప్రకటించారు. మంగళవారం కూడా పీటీఐ మద్దతుదారుల నిరసనలు కొనసాగుతున్నాయి. ఇస్లామాబాద్, రావల్పిండికి వెళ్లే ప్రధాన రహదారులను మూసివేసిన ప్రభుత్వం, పెద్దఎత్తున భద్రతబలగాలను మోహరించింది. ఆయా నగరాలకు వెళ్లే రైళ్లు, మెట్రో బస్సుల సర్వీసులను కూడా నిలిపివేసింది. ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించకుండా అడ్డుకున్న పోలీసులపై ఆందోళనకారులు దాడి చేశారు. ఈ ఘనటలో ఐదుగురు భద్రతాసిబ్బంది మృతి చెందారు. మరోవైపు పంజాబ్ ప్రావిన్స్‌లో ఒక పోలీసు అధికారి మరణించగా, మరో 119మంది తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. 22 పోలీసు వాహనాలకు నిప్పంటించారని చెప్పారు. ఆందోళనకారుల్లో నలుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. ఇమ్రాన్ భార్య బుష్రాబీబీ నేతృత్వంలో ఆదివారం మొదలైన నిరసన ప్రదర్శన ఇస్లామాబాద్ చేరింది. ఇమ్రాన్ జైలు నుంచి విడుదలయ్యాకే తాము ఇంటికి వెళ్తామంటూ ఆయన భార్య బుష్రాబీబీ పేర్కొనటం వల్ల పీటీఐ శ్రేణులు బ్యారికేడ్లను దాటుకొని ఇస్లామాబాద్‌లోకి ప్రవేశించారు. ఆందోళనకారులను అడ్డుకున్న పోలీసులపై హింసాత్మక దాడులకు పాల్పడుతున్నారు. దీంతో ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే భద్రతా సమస్యలు ఉన్న ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపివేసింది. అయితే ఇది ఎంతకాలం ఉంటుందని స్పష్టం చేయలేదు.





# ఢిల్లీలో సీఎం రేవంత్ కేంద్రమంత్రులతో వరుసభేటీలు

రైతుల తరఫున నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ అందోళన చేశారని.. అందుకే కేంద్రం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని వివరించారు. తెలంగాణ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా కులగణన చేపట్టింది. కొన్ని చోట్ల ఇప్పటికే ప్రజల నుండి వివరాలు నమోదు చేసుకుంది. మంత్రులు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సర్వేను పర్యవేక్షిస్తూ సర్వే సిబ్బందికి మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్వేలో మొత్తం 85 వేల మంది ఎన్యుమరేటర్లు, 8,500 మంది సూపర్‌వైజర్లు పాల్గొంటున్నారు. ఇంటి నంబరు, యజమాని పేరు నమోదు చేసే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు పాల్గొంటున్నారు. ప్రతి కుటుంబంలో సభ్యులందరి ఫోన్, ఆధార్ నంబర్లు సహా సమస్త వివరాలతో కూడిన 75 ప్రశ్నలను అడిగి నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మొత్తం 1,17,44,954 కుటుంబాలున్నాయని.. ఇళ్లను 87,092 ఎన్యూమరేషన్ బ్లాక్‌లుగా విభజించి కులగణన చేపట్టినట్లు రాష్ట్ర ప్రణాళిక శాఖ తెలిపారు. అన్ని వర్గాలకు సామాజిక న్యాయం కాంగ్రెస్?తోనే సాధ్యమని, రాహుల్ గాంధీ నాయకత్వంలో అందరికి సామాజిక న్యాయం జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, లోక్ సభ పక్ష నేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తదితర కీలక నేతలు హాజరయ్యారు. దేశంలో రాజ్యాంగ పవిత్రతను కాపాడింది కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. గాంధీ పరివార్ రాజ్యాంగాన్ని కాపాడే ప్రయత్నం చేస్తుంటే.. మోడీ పరివార్ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేస్తోందని ÷ర్ అయ్యారు. రాజ్యాంగ పరిరక్షణలో రాహుల్ గాంధీ వెంట దేశ ప్రజలంతా ఉన్నారన్నారు. ప్రతి ఒక్క వర్గానికి కాంగ్రెస్ పార్టీ న్యాయం చేసిందని.. ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు కాపాడింది కాంగ్రెస్సేనని వ్యాఖ్యానించారు. కుల గణనతోనే ప్రజల సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని.. ఇందుకోసమే దేశవ్యాప్తంగా కుల గుణన కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని తెలిపారు. దేశంలో సామాజిక న్యాయాన్ని అందించింది ఒక్క కాంగ్రెస్ పార్టీనేనని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట ప్రకారమే తెలంగాణలో కుల గణన చేపట్టామని.. కుల గణన సర్వే ఇప్పటి వరకు 92 శాతం పూర్తి అయ్యిందని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణన సర్వేలోనూ కులాల లెక్కలు తీయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.

## తెలంగాణలో మరిన్ని విమానాశ్రయాలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**
రాష్ట్రంలో విమానాశ్రయాల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతాల గురించి కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు.. ముఖ్యంగా వరంగల్ ఎయిర్ పోర్టు పనులు వీలైనంత త్వరగా పూర్తి చే యాలని విజ్ఞప్తి చేశారు. భూ సేకరణ ఎంత తొందరగా పూర్తయితే.. అంత త్వరగా ఎయిర్ పోర్టు నిర్మాణ పనులు చేపడతామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. తెలంగాణ లోని భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, ఆదిలా బాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టు నిర్మాణాలు చేపట్టాలని సీఎం ప్రతిపాదించారు. దిల్లీ పర్య టనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడితో సమావేశమయ్యారు. ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు ఉన్నారు. ఆయా ప్రాంతాల్లో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వ హయాంలోనే వరంగల్ విమానాశ్రయాన్ని నూటికి నూరుపాళ్లు పూర్తి చేస్తామని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. వరంగల్‌తోపాటు మరో మూడు.. పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తమను కోరారన్నారు. అయితే పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం విషయంలో ఫీజిబిలిటీ స్టడీ చేయాల్సి ఉందన్నారు. అందుకు సంబంధించిన నివేదిక సానుకూలంగా వస్తే.. అనంతరం భూసేకరణకు వెళ్ల వచ్చని ఆయన చెప్పారు. ఇక ఆదిలాబాద్ విమానాశ్రయం మాత్రం రక్షణ శాఖ పరిధిలో ఉందని గుర్తు చేశారు. ఆ శాఖ నుంచి అనుమతి వస్తే.. ఆదిలాబాద్‌లో విమానాశ్రయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. అదీకాక ఆదిలాబాద్‌కు ఓ వైపు ఛత్తీస్‌గఢ్, మరోవైపు మహారాష్ట్రలు సరిహద్దులు ఉన్నాయన్నారు. దీంతో ఆ దరిదాపుల్లో విమానాశ్రయం లేదని గుర్తు చేశారు. అక్కడ విమానాశ్రయం ఏర్పాటు చేస్తే చాలా మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కె. రామ్మోహన్ నాయుడు అభిప్రాయ పడ్డారు. మరోవైపు వరంగల్ విమానాశ్రయం విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రో యాక్టివ్‌గా వ్యవహరిస్తూ.. భూసేకరణకు ఇప్పటికే సర్క్యులర్ సైతం జారీ చేసిందని ఆయన వివరించారు. ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా వరంగల్‌లో విమానాశ్రయాన్ని నిర్మిస్తామని ఆయన ప్రకటించారు. మంగళవారం ఉదయం కేంద్ర పౌర విమానాయానశాఖ మంత్రి కె. రామ్మో హన్ నాయుడుతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. అంతకుముందు పౌర విమానయాన శాఖ మంత్రి కార్యాలయానికి సీఎం రేవంత్ రెడ్డి విచ్చేయడంతో.. ఆయనకు ఎదురేగి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇద్దరు ఆలింగనం చేసుకున్నారు.

# సజీవ, ప్రగతిశీల పత్రం మన రాజ్యాంగం

సజీవ, ప్రగతిశీల పత్రం. దీన్ని ఆధారంగా చేసుకొని సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి లక్ష్యాలను సాధించగలిగాం" అని ముర్ము ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళా రిజర్వేషన్లపై చట్టం గురించి రాష్ట్రపతి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో ప్రజాస్వామ్యంలో మహిళా సాధికారిత నవ శకాన్ని ప్రారంభించుకున్నామని అన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించి 15 మంది నారీమణుల సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రసంగం అనంతరం సభ్యులందరితో కలిసి రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం చేశారు. అంతకుముందు రాజ్యాంగానికి సంబంధించిన రెండు పుస్తకాలు, 75 వసంతాలకు గుర్తుగా స్మారక పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ప్రసంగిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశం కంటే వ్యక్తిగత విశ్వాసాలకు ప్రాధాన్యం ఇస్తే.. మనం సాధించుకున్న స్వాతంత్ర్యం ప్రమాదంలో పడుతుందని వ్యాఖ్యానించారు. గందరగోళం సృష్టించడాన్ని ఒక వ్యూహంగా అమలు చేస్తే.. ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. నిర్మాణాత్మక చర్చలు ప్రజాస్వామ్య దేవాలయాల పవిత్రతను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. అంతకుముందు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రారంభోపన్యాసం చేశారు. నాడు రాజ్యాంగ సభలో సభ్యులు గౌరవంగా అభిప్రాయాలు పంచుకున్నారని, అదే సంప్రదాయాన్ని మనమంతా కొనసాగించాలని బిర్లా సూచించారు.

రాజ్యాంగ దినోత్సవం.. మోదీ, అమిత్ షా శుభాకాంక్షలు

రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం పాత పార్లమెంటు ప్రాంగణంలోని సెంట్రల్ హాల్‌లో రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ హోం మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. పటిష్ఠ భారత్ నిర్మాణానికి కృషి చేస్తామని దేశ ప్రజలంతా ప్రతిజ్ఞ చేయాలని వారు పిలుపునిచ్చారు. భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాలకు రాజ్యంగమే బలమని అమిత్ షా పేర్కొన్నారు. ప్రతి వ్యక్తికి సమాన హక్కులు కల్పిస్తూ జాతీయ ఐక్యత, సమగ్రతకు పెద్దపీట వేస్తోందన్నారు. దేశ అభివృద్ధిలో రాజ్యాంగ నిర్మాతల సహకారాన్ని స్మరించుకుంటూ ఈ వేడుకలను జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాజ్యాంగం అంటే కేవలం వేదికలపై ప్రదర్శించే పుస్తకం కాదని.. అందులోని విషయాలను పూర్తి భక్తితో పాటించడం అత్యంత కీలకమని షా పేర్కొన్నారు. 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న రాజ్యాంగ దినోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతితో పాటు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ప్రసంగిస్తారని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాట్లాడే అవకాశమివ్వాలంటూ ఇండియా కూటమి పార్టీల నేతలు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. దీనిపై కిరణ్ రిజిజు స్పందిస్తూ.. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్ మాత్రమే ప్రసంగిస్తారని.. ప్రధాని మోదీ కూడా ఇందులో ప్రసంగించరని వెల్లడించారు. వేడుకల అనంతరం జరిగే మరో కార్యక్రమంలో ప్రధాని ప్రసంగించనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

## డిజైన్ లేకుండానే సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాకు నిర్మాణం

డిజైన్లు, నాణ్యతకు సంబంధించిన అంశాలపై డీఈ, ఏఈఈలను జస్టిస్ పీసీ ఘోష్ ప్రశ్నించారు. రెండో బ్లాక్‌ను పరిగణనలోకి తీసుకొని సుందిళ్ల బ్యారేజీ 2ఏ బ్లాక్ నిర్మాణాన్ని డిజైన్ లేకుండానే ప్రారంభించినట్టు ఇంజినీర్లు తెలిపారు. అప్పటి చీఫ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్టు పేర్కొన్నారు. డిజైన్లు లేకుండా పనులు ఎలా చేపడతారని జస్టిస్ పీసీ ఘోష్ ఆక్షేపించారు. కొందరు ఇంజినీర్ల సమాధానాలపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్ ఛైర్మన్.. తప్పుదోవ పట్టించవద్దని స్పష్టం చేశారు. అఫిడవిట్‌లో ఒక సమాచారం, విచారణలో మరొక సమాచారం ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగ విచారణలో ప్రమాణం చేసి అబద్ధం ఎలా చెబుతారని మండిపడ్డారు. అలా చేస్తే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పనులకు సంబంధించిన ప్లేస్మెంట్ రిజిస్టర్లు, మెజర్మెంట్ బుక్స్ పై ఇంజనీర్ల సంతకాలు తీసుకొన్న కమిషన్ వాటిని స్వాధీనం చేసుకొంది. బుధవారం మరో 18 మంది ఇంజనీర్లను కమిషన్ విచారించనుంది.

## ఈవీఎంలు వద్దు ..బ్యాలెటే మేలు

వెలువడిన నేపథ్యంలో ఆయన ఈ తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దేశంలో ఐక్యత కావాలంటే విద్వేషాలను విస్తరించడం మానుకోవాలని భాజపాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దిల్లీలోని తల్కటోరా స్టేడియంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షక్ అభియాన్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

## భారత రాజ్యాంగం కాల పరీక్షకు నిలిచింది

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఉగ్రవాదానికి భారత్ దీటుగా బదులిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సుప్రీంకోర్టు లో నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "రాజ్యాంగమే మనకు మార్గదర్శి. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లయింది. భారత రాజ్యాంగం కాల పరీక్షకు నిలిచింది. రాజ్యాంగం అంటే కేవలం పత్రం కాదు.. ప్రజాస్వామ్య దీపిక. రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాతలకు శిరస్సువంచి నమస్కరిస్తున్నా" అన్నారు. "జమ్మూకశ్మీర్‌లో ఇప్పుడు రాజ్యాంగం పూర్తిగా అమలులోకి వచ్చింది. తొలిసారి అక్కడ రాజ్యాంగ దినోత్సవాన్ని చేసుకుంటున్నాం. దేశం ముందు అనే భావన అనేక శతాబ్దాల పాటు రాజ్యాంగాన్ని సజీవంగా ఉంచుతుంది. ముంబయి మారణ హోమం దుర్ఘటన ఇదే రోజు జరిగింది.. ఆ విషాద ఘటనలో మృతిచెందిన వారికి నివాళులర్పిస్తున్నా" అని అన్నారు.

## ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని పూర్తిగా చదవలేదు

న్యూఢిల్లీ(జనంసాక్షి):ప్రధాని నరేంద్ర మోదీ కచ్చితంగా రాజ్యాంగాన్ని చదవలేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంవిధాన్ రక్షక్ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ రాజ్యాంగాన్ని చదవలేదన్న గ్యారెంటీ ఇవ్వగలనని అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్లకు ముఖ్యమంత్రి ఆదేశం**



**హైదరాబాద్(జనంసాక్షి):**రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని, రైతులకు ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను, అధికారులను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. హైదరాబాద్ నుండి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కోమటి రెడ్డి వెంకట రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, అన్ని అంశాల్లో తెలంగాణ నంబర్ వన్ గా ఉంది. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం కొనుగోలు, చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయన్నారు. సన్న, దొడ్డు రకాలను వేరువేరుగా సేకరించాలని, ధాన్యం విక్రయించిన రైతుకు చెల్లింపులు వెంటనే పూర్తి చేయాలని, సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సి.ఎం ఆదేశించారు. ఉమ్మడి జిల్లాలకు కేటాయించిన ఇన్చార్జి మంత్రులు, ఇన్చార్జి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, ధాన్యం కొనుగోళ్ల తీరును పర్యవేక్షించాలని అన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన నివేదికను ప్రతిరోజు సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా, మిల్లులకు ధాన్యం కోసం లారీల ఇబ్బంది లేకుండా చూడాలి. సన్నరకం పండించిన రైతులకు బోనస్ గా 500 రూపాయలు ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు..కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసే విధంగా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని, గిట్టుబాటుధర కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న ప్రతి సందర్భంలో ఈ ప్రజా ప్రభుత్వం అన్ని పంటలను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా భరోసా కల్పించాలని స్పష్టం చేశారు. 'రాష్ట్రంలో 66లక్షల ఎకరాల్లో ధాన్యం పండించారు. ఇంకా 20 లక్షల ఎకరాల్లో పంట కోయాల్సి ఉంది. సరిహద్దు జిల్లాల్లో నుంచి బోనస్ కోసం ధాన్యం రాష్ట్రంలోకి వస్తుంది. ఆ ధాన్యం పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలి' అని హెచ్చరించారు. .ఈనెల 30వ తేదీన మహబూబ్ నగర్ లో రైతు పండగను జరుపబోతున్నాం. దానిని పురస్కరించుకొని 28, 29, 30 తేదీల్లో మహబూబ్ నగర్ లో వ్యవసాయ అనుబంధ రంగాల ఎగ్జిబిషన్ ఏర్పాటు, వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులు, యాంత్రీకరణ, ఆదర్శ రైతులతో రైతు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 30న జరిగే రైతు పండుగను కలెక్టర్లు అందరు సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అక్రమాలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రైతులకు అందిస్తున్న సౌకర్యాల గురించి ప్రజలకు చేరే విధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు,

# ఇజ్రాయెల్‌పై బాంబుల మోత

## 250 రాకెట్స్ ప్రయోగించిన హెజ్బొల్లా..

**గాజా(జనంసాక్షి):**ఇజ్రాయెల్, హెూజ్బొల్లా మధ్య యుద్ధం తారాస్థాయికి చేరింది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఇజ్రాయెల్, గాజా మధ్య బాంబుల మోత మోగుతోంది. తాజాగా హెూజ్బొల్లా మిలిటెంట్ సంస్థ ఇజ్రాయెల్‌పై రాకెట్స్ వర్షం కురిపించింది. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా 250 రాకెట్స్‌ను ఇజ్రాయెల్‌పైకి ఎక్కుపెట్టింది. హెజ్బొల్లా మిలిటెంట్ సంస్థ చరిత్రలో ఇదొక అతిపెద్ద దాడిగా ఆ సంస్థ ప్రకటించింది. ఇప్పటికే లెబనాన్ భూభాగంలోకి చొచ్చుకుపోయిన ఇజ్రాయెల్.. అక్కడ వరుస దాడులతో హమాస్‌ను కోలుకోలేని దెబ్బ కొట్టింది. హమాస్ అనుబంధ సంస్థ అయిన హెజ్బొల్లాను కూడా అంతమొందించేందుకు ఇజ్రాయెల్ కంకణం కట్టుకున్నట్లు యుద్ధం చేస్తోంది. అందులో భాగంగానే హెజ్బొల్లా మిలిటెంట్స్‌కు గట్టి పట్టున్న దక్షిణ బేరూట్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడిలో దజన్ల కొద్ది పౌరులు చనిపోయారు. భారీ అంతస్తుల భవనాలు నేలకూలాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారి సంఖ్య ఎంతో కూడా కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.

**మరోవైపు బీరూట్‌పై ఐడీఎఫ్ భీకర దాడులు**

మరికొన్ని గంటల్లో కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయెల్ ఆమోదం తెలుపనున్న సమయంలోనే బీరుట్‌పై భీకర దాడులు మొదలుపెట్టింది. దీంతోపాటు దాడులు మొదలుకాకముందే ఖాళీ చేసి వెళ్లిపోవాలని అనేక భవనాలకు హెచ్చరికలు జారీ చేసింది. అయితే, తాజా వైమానిక దాడుల్లో ఎంతమంది మరణించారనే విషయం తెలియనప్పటికీ.. హెజ్‌బొల్లా స్థావరాలే లక్ష్యంగా దాడులు చేస్తున్నామని ఐడీఎఫ్ వెల్లడించింది. హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణకు సూత్రప్రాయ ఆమోదం తెలిపిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు భద్రతా కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సమావేశంలోనే సంధికి ఆమోదం తెలపనున్నట్లు సమాచారం. ఈ ఒప్పందానికి హెజ్‌బొల్లా కూడా అంగీకరించినట్లు లెబనాన్ అధికారులు వెల్లడించారు. ఒకవేళ ఇది ఇరువైపులా ఆమోదం పొందితే మాత్రం.. ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కొనసాగుతోన్న యుద్ధం ముగింపునకు కీలక అడుగు పడినట్లేనని భావిస్తున్నారు.

# బంగ్లాదేశ్‌లో హిందూ నాయకుడు అరెస్ట్

**తీవ్రంగా ఖండించిన భారత్**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బంగ్లాదేశ్‌లోని హిందూ నాయకుడు చిన్మోయ్ కృష్ణదాస్‌ను అరెస్ట్ చేయడం, ఆయనకు బెయిల్ నిరాకరించడంపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, మైనార్టీలకు భద్రత కల్పించాలని అధికారులను కోరింది. చిన్మోయ్ కృష్ణదాస్ అరెస్టుకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్‌లో శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న మైనార్టీలపై దాడులు ఆందోళనకరమని వ్యాఖ్యానించింది. "బంగ్లాదేశ్ సమ్మిలిత్ సనాతన్ జాగ్రన్ జోటే ప్రతినిధి, హిందూ నాయకుడు చిన్మోయ్ కృష్ణదాస్‌ను అరెస్టు చేయడం, బెయిల్ నిరాకరించడం పట్ల తీవ్ర ఆందోళనతో ఉన్నాం. బంగ్లాదేశ్‌లో మైనార్టీల ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడులు జరిగాయి. అలాగే చోరీలు, దేవతా విగ్రహాలు, దేవాలయాలు ధ్వంసం జరిగాయి. వాటికి సంబంధించి అనేక కేసులు నమోదయ్యాయి. అలాంటి సంఘటనలకు పాల్పడినవారు పరారీలో ఉన్నారు. శాంతియుతంగా న్యాయబద్ధమైన డిమాండ్లను కోరే హిందూ నాయకుడిపై ఆరోపణలు చేయడం దురదృష్టకరం" అని భారత విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. బంగ్లాదేశ్‌లో చిన్మోయ్ కృష్ణదాస్‌ను అరెస్ట్ చేయడంపై ఇశా ఫౌండేషన్ అధినేత జగ్గీ వాసుదేవ్ స్పందించారు. "ప్రజాస్వామ్యయుత దేశం మతతత్వ, నిరంకుశ దేశంగా మారడం వల్ల ఎలా విచ్ఛిన్నమవుతుందో చూస్తున్నాం. ప్రజాస్వామ్యం విలువలను అర్థం చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత. మతం, జనాభా ఆధారంగా హింసించడం ప్రజాస్వామ్య దేశాల మార్గం కాదు. దురదృష్టవశాత్తు మన పొరుగు దేశం ప్రజాస్వామ్య సూత్రాలను వదిలేసింది. పౌరులందరికీ వారి అవసరాలు, నమ్మకాల ప్రకారం జీవించే హక్కు ఉంది. అలాంటి ప్రజాస్వామ్య దేశాన్ని తిరిగి నిర్మించడం బంగ్లాదేశ్?లోని ప్రతి పౌరుడి బాధ్యత" అని జగ్గీ వాసుదేవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూ నాయకుడు చిన్మయ్ కృష్ణదాస్ అక్టోబరు 30న బంగ్లాదేశ్‌లోని ఢాకాలో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ క్రమంలో బంగ్లాదేశ్ జెండాను అగౌరవపరచారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో చిన్మయ్ కృష్ణదాస్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు, ఢాకాలోని హజ్రత్ షాజలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌లో సోమవారం అరెస్టు చేశారు. దాస్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు డిటెక్టివ్ బ్రాంచ్ ప్రతినిధి రెజాల్ కరీం తెలిపారు.

# డీసీప కృషి ఫలితం

- ఎస్‌జీడీసీ నుంచి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల అప్‌గ్రేడ్‌కు ఆమోదం
- సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన డీసీప అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** రెవెన్యూ శాఖలో దశాబ్దాలుగా పలు స్థాయిలలో పెండింగ్‌లో ఉన్న పోస్టుల అప్‌గ్రేడ్ ప్రజా ప్రభుత్వంలో ఆమోదం లభిస్తుందని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్(డీసీప) కృషి ఫలితంగానే స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ నుంచి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల అప్‌గ్రేడ్ అయినట్టుగా చెప్పారు. డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ విన్నపాల మేరకు సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి 33 ఎస్‌జీడీసీ నుంచి సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల అప్‌గ్రేడ్‌కు సంబంధించిన ఫైల్‌పై సంతకం చేసి ఆమోదించారని తెలిపారు. దశాబ్దాలుగా నోచుకోని పోస్టుల అప్‌గ్రేడ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఆమోదం తెలిపినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో చిన్నాభిన్నమైన రెవెన్యూ వ్యవస్థను ఈ ప్రభుత్వం బలోపేతం చేస్తుందన్నారు. అందులో భాగంగానే ఎస్‌జీడీసీ నుంచి 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను అప్‌గ్రేడ్ చేశారన్నారు. వీటికి సంబంధించిన మిగతా ప్రక్రియను సైతం ప్రభుత్వం వెంటనే చేపట్టి సర్వీసు రూల్స్‌ను రూపొందించి పదోన్నతుల వేగవంతం చేయాలని కోరారు. పోస్టుల అప్‌గ్రేడ్‌తో రాష్ట్రంలోని స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభిస్తుందన్నారు. ఇదే కాకుండా పోస్టుల అప్‌గ్రేడ్‌తో అదనపు డైరెక్టర్ గ్రేడ్‌లో నేరుగా జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్లుగా పని చేసే అవకాశం ఏర్పడిందన్నారు. పెరిగిన జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగులపై భారం తగ్గించేందుకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు కూడా కృషి చేస్తున్నట్టుగా చెప్పారు. ఇదే కాకుండా అన్ని స్థాయిలలో క్యాడర్ స్ట్రెంత్ పెంచేందుకు కూడా ప్రయత్నం చేస్తున్నట్టుగా తెలిపారు. దీంతో పాటు అన్ని క్యాడర్‌లలో పదోన్నతులను కల్పించేందుకు కూడా కృషి చేస్తున్నామన్నారు. తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులను ఇప్పించి ఘనత కూడా తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్‌కే దక్కుతుందన్నారు.



# అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలి

- టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి డిమాండ్



**నిజామాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** న్యాయాన్ని కాపాడేలా తీర్పులు చెప్పే న్యాయమూర్తులకు, కేసులను వాదించే న్యాయవాదులకు రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను అమలులోకి తీసుకురావాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది మహమ్మద్ ఖాసింపై సోమవారంనాడు బెదిరించి దాడి చేయడం హేయమైన చర్య అని, న్యాయవాదిపై గుండాగిరి చేసి దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని శేర్ నర్సారెడ్డి డిమాండ్ చేశారు. న్యాయమూర్తులపై, న్యాయవాదులపై ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న దాడులు, హత్య ఉదంతాలను దృష్టిలో ఉంచుకొని న్యాయవాదుల పరిరక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ను వెంటనే అమలులోకి తీసుకురావాలని టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

# భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శం

- రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు వెళదాం!
- సింగరేణి జనరల్ మేనేజర్ (కో-ఆర్డినేషన్) ఎస్‌డి ఎం.సుభాని

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)




సర్వశక్తివంతమైన భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శమని, రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందుతూ బాధ్యతలను కూడా సక్రమంగా నిర్వహించాలని, ఆత్మగౌరవంతో జీవించాలని సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ కో-ఆర్డినేషన్ ఎస్ డి ఎం.సుభాని పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో మంగళవారం ఉదయం జరిగిన రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. మహనీయుడు బిఆర్ అంబేద్కర్ సారథ్యంలో గణతంత్ర, లౌకిక, సమ సమాజ సూత్రాలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగం సర్వజనులకు సమాన హక్కులను కల్పించిందని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగమని పేర్కొన్నారు. ప్రపంచంలో అనేక దేశాలలో ప్రజాస్వామ్యం కుంటుబడి అంతర్ యుద్ధాలు, తిరుగుబాట్లతో సతమతమవుతుండగా భారతదేశం మాత్రం రాజ్యాంగ స్ఫూర్తితో, చెక్కుచెదరని ప్రజాస్వామ్యంవిశ్వాసాలతో, ఆచరణతో ముందుకు పోతుందన్నారు. ఇటువంటి రాజ్యాంగాన్ని గౌరవిస్తూ రాజ్యాంగ సూత్రాలు పాటిస్తూ ప్రజలందరూ ఆత్మగౌరవంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జనరల్ మేనేజర్ మార్కెటింగ్ రవి ప్రసాద్ ఇంకా వివిధ విభాగాల ఉన్నతాధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడుదాం

- రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకుల పిలుపు
- ఇందిరా పార్క్ దగ్గర జరిగిన ధర్నా



**హైదరాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** మోడీ ప్రభుత్వ రైతు , కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడేందుకు సన్నద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా (యస్ కె యం) రాష్ట్ర కన్వీనర్లు టీ సాగర్, పశ్య పద్మ,వి ప్రభాకర్, బి వెంకట్,విస్సాకిరణ్,కోటేశ్వరరావు ,ఆర్ వెంకట్ రాములు,వి కృష్ణ, భాస్కర్, కార్మిక సంఘాల నాయకులు యూసుఫ్ పాలడుగు భాస్కర్ బాలరాజు జనక్ ప్రసాద్ నాగన్న గౌడ్ ఎం శ్రీనివాస్ జనార్ధన్ సూర్యం లు పిలుపునిచ్చారు. మంగళవారం సంయుక్త కిసాన్ మార్చా, కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఉందిరా పార్క్ దగ్గర జరిగిన ధర్నాలో వారు మాట్లాడారు. కనీస మద్ధతు ధరలకు చట్టబద్ధత, విద్యుత్ బిల్లు రద్దు లాంటి ముఖ్యమైన సమస్యలపై మనం పోరాడాలని, కేంద్ర ప్రభుత్వం రైతులు కార్మికులు వ్యవసాయ కూలీల డిమాండ్లను పెడచెవిన పెట్టిందని, పంజాబ్ లో వివిధ రూపాలలో జరిగిన పోరాటాలు కూడా ప్రాధాన్యతలు కలిగి ఉన్నాయని, జియో బహిష్కరణ, టోల్ గెట్ ల రాద్దు, రైలరోకో లాంటి కార్యక్రమాలు పెద్ద ఎత్తున సమీకరణతో జరిగాయని, మనం సమస్య ప్రాతిపదికగా ఒక దగ్గరకు వచ్చామని తెలిపారు. రాష్ట్ర స్థాయి ఉన్న డిమాండ్ లను ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ, బోనస్ అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు బొంతల చంద్రారెడ్డి, పి జంగారెడ్డి, సిఐటియు నాయకులు జె వెంకటేష్, భూపాల్ ఎఐటియుసి నాయకులు నరసింహ,ఐఎఫ్ టియు నాయకులు అనురాధ,టియుసిటి నాయకులు ఎస్ ఎల్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలను కాల్చొద్దు

- మామునూర్ కేవీసీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న



**వరంగల్, నవంబర్ 26 (జనంసాక్షి) :** పంట అవశేషాలను కాల్చొద్దని మామునూర్ కేవీసీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న సూచించారు. అవగాహన లేమితో రైతులు చేపట్టే పలు చర్యలు పర్యావరణానికి ముప్పును కలిగిస్తున్నాయని, పంట కాలం పూర్తయిన తర్వాత పంట అవశేషాలు, వ్యర్థాలను కాల్చి వేస్తూ పర్యావరణానికి విఘాతం కల్గిస్తున్నాయని, ఏటా వరి, పత్తి, కంది, మొక్కజొన్న, లాంటి పంటలను సాగు చేస్తూ వాటి వ్యర్థాలను కాల్చి వేస్తున్నారని, దీంతో నేల సారం దెబ్బతినడంతో పాటు పర్యావరణానికి హానీ కలుగుతున్నదని, వేల ఎకరాల్లో ఇలా చేయడం వల్ల పర్యా వరణంపై తీవ్ర ప్రభావం ఉంటుందని తెలిపారు. కొన్ని సార్లు పక్క పంట పొలాలకు హాని కలుగుతుందని, రైతులు కూడా ప్రమాదాలకు గురివుతున్నారని, తెలంగాణ రాష్ట్రంలో సాగు చేసే ప్రధాన పంటల ద్వారా ఏటా సుమారుగా 293.5లక్షల టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవు తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారని, వరి, పత్తి, మొక్కజొన్న పంటల్లో 91.6శాతం వ్యర్థాలు ఏర్పడుతాయని, వరిలో 30 నుంచి 40 శాతం, పత్తిలో 90 నుంచి 95శాతం వ్య ర్థాలను ఏటా రైతులు కాల్చి బూడిద చేస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారని, పొలాలు, చేన్లలోని కాల్చివేసిన పంట అవశేషాలు, వ్యర్థాలు బూడిదవుతాయని, ఈ సమయంలో నేలతో పాటు పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుందని, వ్యర్థాలను కాల్చితే కార్బన్ మోనాక్సైడ్, కార్బన్ డై ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, అమ్మోనియం వంటి విషవాయు వులు గాలిలో కలిసి కలుషితం చేస్తాయని తెలిపారు. సాధారణంగా ఒక ఎకరంలో వ్యర్థాలను కాల్చితే 60కిలోల కార్బన్ మోనాక్సైడ్, 1400కిలోల కార్బన్ డై ఆక్సైడ్, 3కిలోల సూక్ష్మదూళి కణాలు, బూడిద, సల్ఫర్ డై ఆక్సైడ్లు గాలిలో కలిసిపోతాయని తెలిపారు.

వరి, పత్తి పంటల వ్యర్థాలతో అనేక ప్రయోజనాలుంటాయని, వరి కోత తర్వాత గడ్డిని పొలంలో వదిలేసి సింగిల్ సూపర్ పాస్పేట్ లేదా వేస్ట్ డీ కంపోజర్ లేదా పూసా డీ కంపోజర్ ను చల్లితే 15-20 రోజుల్లో కుళ్లిపోతుందని తెలిపారు. ఆ తర్వాత ఎలాంటి దుక్కి దున్నకుండానే ఆరుతడి పద్ధతిలో విత్తనాలు విత్తుకుంటే మంచి ఫలితాలుంటాయని, పత్తి కట్టెను రోటావేటర్, స్లాషర్ లేక మల్టీ క్రాప్ షెడ్డర్ తో కలియదున్నితే 12.4.నుండి 20 కిలోల నత్రజని, 1.6 కిలోల ఫాస్పరస్, 12.2-13.6 కిలోలు పొటాష్ ఒక హెక్టారుకు అందుతుంది. ఇలాచేయడం ద్వారా ఎరువుల వాడకం కూడా తగ్గి భూమి సారవంతంగా ఉండి పంట దిగుబడికి దోహపడుతుంది. వరి గడ్డి ని బేలర్స్ ద్వారా కట్టలు కట్టి పశువులకు మేతగా వేయవచ్చునని, పత్తి, కంది కట్టెలను పశువుల సమీకృత సంపూర్ణ దాన గా కూడా తయారు చేసుకోవచ్చు అని తెలియజేశారు.



# ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

- మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి
- రూ.20 లక్షలతో రాఘవపూర్ పంచాయతీ భవనానికి భూమిపూజ

**కరీంనగర్ బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి) :** మానకొండూర్ మండలం రాఘవపూర్ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద 20 లక్షల నిధులతో గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు మానకొండూర్ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, మహిళల సాధికారత, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ పాలన ఏడాది పూర్తవుతున్న తరుణంలో ప్రభుత్వం చేసిన కార్యక్రమాల గురించి ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఓదెలు యాదవ్, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్, మాజీ ఎంపీపీ ముద్దసాని సులోచన - శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్ గౌడ్, గసికంటి సంపత్, మీస సత్యనారాయణ, కోంద్ర సురేష్, కనుకం అశోక్, కొత్తకొండ శంకర్, ఇర్ఫాన్, రామిడి తిరుపతి, బందెల మహేందర్, చలిగంటి సంపత్, కనుకం కుమార్, రామగిరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# చొప్పదండిని అభివృద్ధి చేస్తాం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం
- చాకుంటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన



**కరీంనగర్ బ్యూరో, నవంబర్ 26 (జనం సాక్షి) :** చొప్పదండి నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని, ఎడ్యుకేషన్, ఇరిగేషన్ హబ్ గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలు, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చొప్పదండి మండలంలోని చాకుంట గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... చాకుంట గ్రామంలో అన్ని అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తామని అన్నారు. చొప్పదండిని మోడల్ నియోజకవర్గంగా మారుస్తామని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన ప్రతి గ్యారెంటీనీ తమ ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. రైతులకు మేలు చేసే అన్ని చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ చాకుంట గ్రామంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.40 లక్షలు విలువైన పనులను ప్రారంభించామని అన్నారు. గ్రామంలో సిసి రోడ్లు, నాలాల నిర్మాణం వంటి అవసరాలు ఇంకా ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, మంజూరుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా చాకుంట గ్రామ రైతు పొలం వద్ద షెడ్డు నిర్మాణాన్ని ఎమ్మెల్యే , కలెక్టర్ ప్రారంభించారు. ఉత్తమ రైతు సత్యనారాయణ రెడ్డిని, ఉపాధి హామీ కూలీని సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ , పురం రాజేశం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ఉద్యమిద్దాం



**హైదరాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** నవంబర్ 26 రాజ్యాంగ దినం సందర్భంగా ఆదివాసీ హక్కులను పరిరక్షించి, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని నినదిద్దామని ఆదివాసి సంఘి భావ వేదిక కో కన్వీనర్ అన్వర్‌ఖాన్ పీవోడబ్ల్యూ నాయకురాలు ఝాన్సీ అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్‌హాల్‌లో నిర్వహించిన ఆదివాసీ హక్కుల ఉల్లంఘనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాకెట్ లాంచర్లతో భద్రతా దళాల దాడులు, ఆదివాసీ యువతీ యువకుల అరెస్టులు, కిడ్నాపులకు వ్యతిరేకంగా పోరాడుదామని, మూలవాసీ బచావోమంచ్ మీద రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా విధించిన నిషేధాన్ని ఎత్తేయాలని ఉద్యమిద్దామని తెలిపారు. రాజ్యాంగ విలువలకు, ఆదర్శాలకు, ఆదేశాలకు విరుద్ధంగా పాలకులు ప్రవర్తిస్తున్నారని, ప్రతి ఏటా నవంబర్ 26న రాజ్యాంగ దినాన్ని జరుపుకుంటున్న దేశంలో ఆదివాసీ హక్కులకు రక్షణ లేకుండా పోయింది. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ దినాన్ని కేవలం లాంఛనంగా ప్రభుత్వాలు మార్చేశాయని, ప్రజాస్వామ్యాన్ని ప్రహసంగా తయారు చేశాయని తెలిపారు. చత్తీస్‌ఘడ్ జిల్లాలోని సుక్మా జిల్లా కొండపల్లి దగ్గర నవంబర్ 7న ఆదివాసులు తమ ప్రాంతంలోని నీరు, భూమి, అడవిని కాపాడుకోడానికి శాంతియుత పద్ధతిలో నిరసన చేపట్టారని, అక్కడికి బీజాపూర్ పోలీసులు వెళ్లి 29 మంది ఆదివాసీ యువతీ యువకులను అరెస్టు చేసి స్టేషనుకు తీసుకపోయారని, ఆ తర్వాత ఆదివాసులు ఆందోళన చేస్తే ఇద్దరు ఆదివాసీ బాలికలు తప్ప మిగతా వాళ్లను వదిలేశారని, ఆ ఇద్దరి బాలికల సంగతి ఇప్పటికీ తెలియదని, పోలీసులు సమాచారం ఇవ్వడం లేదని గుర్తు చేశారు. నవంబరు 13వ తేదీ తెల్లవారుజామున 2:00 గంటలకు ఉసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో వందలాది మంది సైనికులను తీసుకొచ్చి నూతన సైనిక శిబిరాన్ని ప్రారంభించారని, క్యాంపును ప్రారంభించిన వెంటనే, సైనికులు రాకెట్ లాంచర్లతో బాంబులు వేశారు. ఈ విషయం నవంబర్ 18న ప్రజాస్వామికవాదులకు తెలిసిందని, ఈ చర్య రాజ్యాంగంలోని భావ ప్రకటనా స్వేచ్ఛకు, సంఘం పెట్టుకొనే హక్కుకు పూర్తి విరుద్ధమని తెలిపారు. బస్తర్ అడవుల్లోని సిలింగేర్ అనే ఆదివాసీ గ్రామంలో మే 13, 2021న ప్రభుత్వం ఏర్పాటు చేసిన సైనిక క్యాంపును ఎత్తివేయాలని కోరుతూ మొదలైన పోరాటంలోంచి మూలవాసీ బచావో మంచ్ ఏర్పడిందని తెలిపారు. వాళ్ల సంఘటిత శక్తిని దెబ్బతీయడానికి ఇప్పుడు ఆ సంస్థను నిషేధించారు. చట్ట విరుద్ధంగా ఆదివాసీ ప్రాంతాల్లో గనుల తవ్వకానికి అనుమతులు ఇస్తున్న ప్రభుత్వం మూలవాసీ బచావో మంచ్ను చట్ట విరుద్ధ సంస్థ అనడం అన్యాయం. సంఘాలను, రాజకీయాలను నిషేధించడం ప్రజాస్వామ్య వ్యవస్థలో తగని పని. ఛత్తీస్‌ఘడ్లో సహజ వనరుల దోపిడీ కోసం ప్రభుత్వం కార్పొరేట్లతో చేసుకున్న ఒప్పందాలు తమ జీవితాన్ని విధ్వంసం చేస్తాయని, తమను విస్థాపనకు గురి చేస్తాయని, పర్యావరణాన్ని నాశనం చేస్తాయని ఆదివాసులు పోరాడుతున్నారు. వాళ్ల ఉద్యమాలను దెబ్బతీయడానికి భారీ ఎత్తున సైన్యాన్ని దించిన ప్రభుత్వం అక్కడ శాశ్వతంగా అణచివేత చర్యలు చేపట్టడానికి క్యాంపులు ఏర్పాటు చేసింది. దీని వల్ల ఛత్తీస్గడ్ అడవుల్లో యుద్ధ వాతావరణం ఏర్పడిందిదని తెలిపారు. ఆదివాసుల మీద జరుగుతున్న హింసను మూలవాసీ బచావో మంచ్ బయటి ప్రపంచానికి తెలియజేస్తోందని, ఈ అవకాశం లేకుండా ప్రభుత్వం ఆ సంస్థ శాంతియుత పోరాటాలను చట్ట వ్యతిరేక కార్యకలాపాలుగా ఆరోపించి నిషేధించిందని, తద్వారా ఆదివాసులకు గొంతు లేకుండా చేయాలనుకుంటోందని, ఈ నిషేధానికి వ్యతిరేకంగా రాజ్యాంగ స్ఫూర్తితో పోరాడాలని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక పిలుపు ఇస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో గడ్డం లక్ష్మణ్,నారాయణరావు, పీకేఎం జాన్, సీఎంఎస్ జ్యోతీ ,విరసం రాము, ఫేత్ లిబరేషన్ ఫ్రంట్ మార్వాడి సుదర్శన్, డేవిడ్,తెలంగాణ అంబేద్కర్ సంఘం శ్రీహరి,ఆదివాసీ విద్యార్థి సంఘం భట్టు పాల్గొన్నారు.

# 521.544 కిలోల గంజాయి దహనం

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

(ప్రత్యేక ప్రతినిధి / జనం సాక్షి)



పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా 2021 సంవత్సరం నుండి వివిధ పోలీసు స్టేషన్ లలో నమోదైన 64 కేసుల్లో నిందితుల నుండి సీజ్ చేసిన ప్రభుత్వ నిషేధిత గంజాయి 521.544 కిలోలను కరీంనగర్ జిల్లా మానకొండూర్ వెంకటరమణ ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేశామని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ తెలిపారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారు 1,30,38,600/- రూపాయలు ఉంటుందని తెలిపారు.. కమీషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ సీపీ, కమిటీ సభ్యులైన సి . రాజు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామగుండం, గోదావరిఖని ఎసిపి ఎం .రమేష్, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, టాస్క్ ఫోర్స్ ఎసిపి మల్లారెడ్డి, సిసిఆర్బీ ఇన్స్పెక్టర్ జి. సతీష్ , మల్లేష్ అడ్మిన్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఎన్డిపిఎస్ యాక్ట్‌లోని నియమనిబంధనల ప్రకారం రామగుండం పోలీస్ కమీషనరేట్ పలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేయనడిన కేసులలో నిల్వ ఉన్న గంజాయిని ఈ రోజు దహనం చేయడం జరిగిందని తెలియజేసారు. కొందరు దురుద్దేశ్యంతో అక్రమార్జనలో భాగంగా అక్రమ గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం స్థానిక, స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్య కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై మత్తుకు బానిసలై గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించే వారిపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేసి పిడి యాక్ట్ కు కూడా అమలు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్.డిసిపి అడ్మిన్ సి.రాజు స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, జైపూర్ ఎసిపి ఎ.వెంకటేశ్వర్లు, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, ఏ.ఆర్ ఏసిపి సుందర్రావు, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ సతీష్, ఆర్ ఐ లు దామోదర్ మల్లేశం లు పాల్గొన్నారు

# కల్తీ పాలతో ఆరోగ్యము బేజారు

**పాలను అక్రమ మార్గంలో కల్తీ చేసే అవకతవకలను అరికట్టేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పాల కల్తీ పెద్ద సమస్యగా మారింది. పాలకు డిమాండ్ పెరగడం, సరఫరా అంతరం,పాలు పాడైపోయే స్వభావం వల్ల పాలు,పాల ఉత్పత్తుల ద్వారా నష్టం జరుగుతుంది.**



పాలు ఆరోగ్యానికి పోషకాహారం.చిన్న, పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరు పాలు, టీ, కాఫీ తాగుతుంటారు.ఎముకల బలం కోసం చిన్న పిల్లలకు ఆ పాలును మరగించి ఇస్తాం.దీంతో, పాలకు మార్కెట్లో సూపర్ డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను ఆసరా చేసుకుని కల్తీ రాయుళ్లు రెచ్చిపోతున్నారు. రకరకాల బ్రాండ్ల పేరుతో తక్కువ ధరకే అమ్ముతున్నారు. పాలు తక్కువై, వాటిని వినియోగించు వారు ఎక్కువైనారు.దీన్ని అధిగమించడానికి వర్గీస్ కురియన్ అనేక సంస్కరణలు చేసి ఎన్నో అద్భుత విజయాలు సాధించారు.వర్గీస్ కురియన్ ఒక భారతీయ డెయిరీ ఇంజనీర్ మరియు సామాజిక వ్యవస్థాపకుడు.శ్వేత విప్లవం అని పిలవబడే భారతదేశంలో పాల ఉత్పత్తిలో విస్తృతమైన పెరుగుదలకు దోహదపడే కార్యక్రమాలకు ఆయన నాయకత్వం వహించారు.ఆయన 30 విశిష్ట సంస్థలను ముఖ్యంగా అమూల్ , జీసీఎమ్ఎమ్ఎఫ్,ఐ ఆర్ ఎమ్ ఏ, ఎన్ డి డి బి వంటివి స్థాపించి వాటిని రైతుల ద్వారా నిర్వహింపజేస్తూ అనేక మంది నిపుణులచే నడిపాడు.ఆయన గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ కు వ్యవస్థాపక చైర్మన్ గా యున్నపుడు అమూల్ బ్రాండ్ ఉత్పత్తిని సృష్టించి విజయం సాధించాడు.బర్రె పాలతో అమూల్ పాలపొడి తయారీ ఆవిష్కరణ విజయంతో ఆవు పాలతో కూడా పాలపొడి తయారీతో పాటు అనేక పాలఉత్పత్తులు తయారుచేయడం జరిగింది.భారతదేశ శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 26 వ తేదిని జాతీయ పాల దినోత్సవంగా జరుపుకుంటాం.శ్రేష్ఠమయిన,బలవర్ధక ఆహారము పాలు.ఇందులో అన్ని రకాలైన పోషక విలువలు ఉన్నాయి.కొద్దిగా విటమిన్ సి, ఇనుము తక్కువ.అన్ని వయసులవారు తీసుకోదగ్గ ఉత్తమ ఆహార పదార్థము.ఆవులు,గేదెలు, మేకలు,గొర్రెల నుండి పాలను పొందవచ్చు.హిందువులు పవిత్రంగా పూజించే ఆవు యొక్క పాలు అన్ని రకాల పూజా కార్యక్రమాలలోను వాడతారు.ఆవు పాలలో 69 కిలో కేలరీలు, గేదె పాలలో 100 కిలో కేలరీలు, మేక పాలలో 66 కిలో కేలరీలు శక్తి ఉంటుంది.గతంలో గ్రామాల్లో ఏ ఇంట చూసినా పాడిగేదెల పోషణ ఉండేది.గ్రామీణ ప్రాంతాల్లో అప్పట్లో కొనేవారు తక్కువగా ఉండేవారు.ప్రతి ఇంటికి గేదె లేదా ఆవు ఉండేది.ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా గేదెల పెంపకం తగ్గిపోవడంతో పాలకు కొరత ఏర్పడుతోంది.ఈ కొరత వల్ల పాల వ్యాపారం చేసేవారు కల్తీ పాలను తయారు చేసి బయట విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.మనమందరం తీసుకునే పాలు స్వచ్ఛమైనవా, కావా లేదా ప్రమాదకర రసాయనాలు లేనివని మనం ఖచ్చితంగా చెప్పలేనటువంటి పరిస్థితి.దేశం నలుమూలల నుండి ఎప్పటికప్పుడు పాల కల్తీకి సంబంధించిన అనేక వార్తలను మనం వింటున్నాము.కల్తీ పాల వల్ల ప్రజల ఆరోగ్యం మరియు పాలు మరియు దాని ఉత్పత్తుల యొక్క ప్రామాణికతను ప్రభావితం చూపుతుంది.పాలలోని డిటర్జెంట్లు, సింథటిక్ భాగాలు, యూరియా,కాస్టిక్ సోడా,ఫార్మాలిన్ వంటి కల్తీ పదార్థాలు ఎక్కువ కాలం తీసుకుంటే ఆరోగ్యంపై విపత్కర ప్రభావాలకు దారి తీస్తుంది,ఎందుకంటే ఇది ఫుడ్ పాయిజనింగ్, జీర్ణకోశ సమస్యలు, బలహీనతలు,గుండె సమస్యలు, క్యాన్సర్ లేదా వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తుంది.మరి ముఖ్యంగా యూరియా, ఫార్మాలిన్, డిటర్జెంట్లు, అమ్మోనియం సల్ఫేట్, బోరిక్ యాసిడ్,కాస్టిక్ సోడా, బెంజోయిక్ యాసిడ్, సాలిసిలిక్ యాసిడ్,హైడ్రోజన్ పెరాక్సైడ్, చక్కెరలు మరియు మెలమైన్ వంటి వాటితో కల్తీ పాలు తయారు చేసి ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు కల్తీ వ్యాపారులు.ఎస్ ఏన్ ఎఫ్ యొక్క అధిక సూచి ద్వారా,స్టార్చ్, అయోడిన్ పరీక్ష ద్వారా,పోటాషియం క్రోమేట్ మరియు సిల్వర్ నైట్రేట్ మిశ్రమాన్ని ఉపయోగించి,షుగర్ ఉనికిని పరీక్షించడానికి ఒక డయాసెట్రిక్ స్ట్రిప్ ను ఉపయోగించడం ద్వారా,మూలకాలు,విటమిన్ పరీక్షల ద్వారా పాలల్లో కల్తీ ని గుర్తించవచ్చు.ఇంట్లో ఫ్లాట్ బండపై రెండు చుక్కల పాలను వేయండి.అది ఏదో ఓవైపు పారుతుంది.పాలు పారిన వైపు తెల్లగా కనిపిస్తే అవి స్వచ్ఛమైనవి అని నిర్ధారించుకోవాలి.కల్తీ పాలు అయితే తెల్లగా కనిపించవు.మార్కెట్ లో దొరికే పీహెచ్ స్ట్రిప్‌తోనూ పాల కల్తీని కనిపెట్టవచ్చు.స్ట్రిప్ పై చుక్క పాలను వేయండి.పిహెచ్ రేషియో 6.4 - 6.6 మధ్యలో ఉంటే స్వచ్ఛమైన పాలని గుర్తించుకోవాలి.అంతకన్నా తక్కువ కానీ,ఎక్కువ ఉంటే పాలు కల్తీ పాలు జరుగుతుందని అర్థం.అయోడిన్ ద్రావణాన్ని కలపండి.ఇది బాగా మిక్స్ చేయండి.స్వచ్ఛమైన పాలు అయితే దాని రంగు లేత గోధుమ రంగులోకి మారిపోతుంది.అదే, కల్తీ పాలు అయితే దాని రంగు లైట్ చాక్లెట్ కలర్‌లోకి మారుతుంది.పాలలో గంజి లేదా ఏదైనా పిండి పదార్థం కలిపితే ఆ రంగు మాత్రం నీలంలో ఉంటుందని గుర్తించుకోవాలి.పాలను కల్తీ చేసేందుకు 100 లీటర్ల నీటిలో 5 కిలోల యూరియాను బాగా కలుపుతారు.దీంతో ఆ మిశ్రమం పాలలా తెల్లగా మారిపోతుంది.పాల వాసన వచ్చేందుకు కొన్ని కెమికల్స్ కూడా మిక్స్ చేస్తారు.ఇక,పాలలో యూరియా అవశేషాలు గుర్తించడానికి మార్కెట్‌లో యూరియాసే స్ట్రిప్స్ దొరుకుతాయి. వాటి మీద కొంచెం పాలు పోయాలి.అందులో గీతలు కనిపించాయంటే పాలు యూరియాతో తయారు చేశారని అర్థం.ఈ పాలు ఆరోగ్యానికి చాలా డేంజర్.ఇలా రకరకాల పరీక్షల ద్వారా కల్తీ పాలను గుర్తించవచ్చు.ఏది ఏమైనా కల్తీ పాలను అరికట్టాలి.అప్పుడే మన ఆరోగ్యాన్ని మనం కాపాడుకోగలుగుతాం.



డాక్టర్ మోటె చిరంజీవి,
సామాజికవేత్త,విశ్లేషకులు
సెల్ : 9949194327

# అవినీతి విద్యుత్ ఒప్పందాల్లో అదానీతో జగన్ కుమ్మక్కు?



మన దేశంలో అతిపెద్ద సంపన్నులైన వారిలో గౌతమ్ అదానీ రెండవ స్థానంలో ఉన్నారు.ఇప్పుడు మరో సారి అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్.బీ.ఐ. చేసిన పరిశోధనలో భారీ అవినీతి ఆరోపణల సంక్షోభంలో చిక్కుకున్నారు.

వివరాలలోకి వెళితే.. అదానీ కేంద్ర ప్రభుత్వ సంస్థను వాడుకొని రాష్ట్ర ప్రభుత్వాల విద్యుత్ సంస్థలకు లంచాలు ఇచ్చారనీ,తద్వారా సౌర శక్తిని అమ్మే కాంట్రాక్టులను దక్కించుకోన్నారని అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్.బీ.ఐ వెల్లడించింది. ముఖ్యంగా 2021-24 మధ్యకాలంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంతో సహా ఐదు రాష్ట్ర ప్రభుత్వాల్లోని కీలక వ్యక్తులను అదానీ గ్రూపు కలిసి, ఏకంగా రూ.2,029 కోట్లు లంచంగా చెల్లించారని అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ బయటపెట్టింది. ఇప్పుడు ఈ వార్త సంచలనం సృష్టించింది. ఆ లంచంలో రూ.1,750 కోట్లు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలకమైన వ్యక్తికి చెల్లించారని స్పష్టంగా ప్రకటించింది.

భారత సౌర విద్యుత్తు సంస్థ(సెకీ) రాష్ట్రాలకు సోలార్ పవర్ సరఫరా చేసేందుకు ఆహ్వానించిన టెండర్ ను అప్పట్లో అదాన్ని గ్రూపు దక్కించుకుంది. దీని ప్రకారం... రాష్ట్రాల డిస్కమ్ లు ‘సెకీ’ తో ఒప్పందం చేసుకుంటే, అదానీ ప్లాంట్ల ద్వారా సౌర విద్యుత్ ను సరఫరా చేస్తారు.అయితే...అదానీ కోట్ చేసిన అధిక ధరలను చూసి కొనలేమని ఆయా రాష్ట్రాల డిస్కమ్ లు వెనక్కు తగ్గాయి. ఒక్క ప్రభుత్వం కూడా ‘సెకీ ‘ తో ఒప్పందానికి ముందుకు రాలేదు. అవి కుదిరితే తప్ప అదానీ ప్లాంట్లు ఏర్పాటు చేయలేరు.అధిక పెట్టుబడులను సంపాదించ లేరు.ఈ ప్లాంట్ల ఏర్పాటు పేరుతో అప్పటికే అదానీ గ్రూప్ భారీగా అప్పులు తెచ్చి, పెట్టుబడులను సమీకరించినందున అదా నీ గ్రూప్ పై ఒత్తిడి బాగా పెరిగింది. ఈ నేపథ్యంలో అదానీ గ్రూపు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలలోని కీలక వ్యక్తులను కలిసి, లంచాలు ఆఫర్ చేసినట్లు అమెరికా దర్యాప్తు సంస్థలు నిర్ధారించాయి.

“ ఈ విషయంలో జగన్ ను అధానీ పలుమార్లు స్వయంగా కలిశారు. 2021లో ఆగస్టు 7న జగన్ తో అదానీ భేటీ అయ్యారు. విద్యుత్ కనుగోలు ఒప్పందాలు కుదరక పోవడంపై చర్చించారు. లంచాలు ఆఫర్ చేశారు. ఆ తర్వాత సెప్టెంబర్ 12, నవంబర్ 20 తేదీల్లో నూ మీరు సమావేశం అయ్యారు” అని అమెరికా దర్యాప్తు సంస్థలు తెలిపాయి.ఆ తర్వాత ఈ ఒప్పందాలు ఖాయమైనట్లు అదానీ గ్రూప్ కంపెనీల్లో అంతర్గత సందేశాలు షేర్ చేసుకున్నారని అమెరికా స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్.ఈ.సీ) కూడా తన దర్యాప్తులో ధ్రువీకరించింది. అయితే ఎఫ్.బీ.ఐ. నేరుగా జగన్ పేరును గానీ, చీఫ్ మినిస్టర్ అనే పదాలను గానీ వాడలేదు. కేవలం ఒక ‘భారతీయ పౌరుడు’ అని మాత్రమే తెలిపింది. ప్రభుత్వంలోని ఆ కీలక వ్యక్తి, అదానీ తరచూ ఫోన్లో మాట్లాడుకున్నట్లు తన దగ్గర ఆధారాలు ఉన్నాయని కూడా పేర్కొంది. ఎస్ఈసీ మాత్రం అదానీని కలిసింది ముఖ్యమంత్రేనని,ఆ తర్వాతే కీలక నిర్ణయాలు ముందుకు వెళ్లినట్టు ఆధారాలు ఉన్నాయని పేర్కొంది.



డాక్టర్.కోలాహలం
రామ్ కిశోర్
9849328496

# ఆవాజ్ దో సకల జనులు ఏక్ హై



**కులం కులం అంటూ కుచ్చితాలు పెంచుకోకు, ఓ కూటికి లేని వాడా! మతం మతం అంటూ... అనే దశాబ్దాల క్రితం సిపిఐ నేత పుల్లారెడ్డి సతీమణి విజయలక్ష్మి రాసిన పాట నాకు తరచూ ఇటీవల గుర్తుకు వస్తున్నది. గత పది ఏండ్లలో ఈ కులం, మతం జాడ్యం మనుషుల మనస్సులో విషపు బీజాలను నాటేసి భారతదేశం సకల జనులను చీల్చి, చెండాడు తున్నది. యువత ప్రధానంగా ఈ కుల, మత రాజకీయాల ఉచ్చులో పడిపోతున్నారు. కుల,మతాలకు అతీతంగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్నికలప్పుడు, అందరూ మావారే అనుడు, ఆ తర్వాత, కులం, మతం అంటూ సంఘాల వెంట, వారి కులంకే అన్యాయం జరిగింది అంటూ, పేర్కొనడం దేశ రాజకీయాల్లో సహజ ప్రక్రియ అయిపోయింది. ఎవరిని చూసినా ఏముంది గర్వకారణం అనే పరిస్థితి ఎక్కడ చూసినా కనిపిస్తా ఉంది. ఎన్నికలప్పుడు, ఓట్ల కోసం అన్ని కులాలు, మతాలు కావాలి, అయిపోయాక మా కులం మాది, మా మతం మాది అంటున్నారు.**

**ఎమ్మెల్యేలకు, మంత్రులకు తగునా**

ఎమ్మెల్యే లు, ఎంపీలు, మంత్రులు ప్రతీ ఒక్కరు రాష్ట్రాల్లో, దేశంలో ఇలాగే తయారు అయ్యారు. ఇలాంటి విధానాల వల్ల ఇతర కులాల, మతాల వారు నొచ్చుకునే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నది. ఎవరి కులం వాళ్ళు, ఎవరి మతం వాళ్ళు, వాళ్ళకే ఓటు వేయాలని, కూడ భవిష్యత్తులో వీరు అనరు కదా? అనే ప్రశ్నలు, కులమతాలకు అతీతంగా జీవించే బుద్ధి జీవులు ఆలోచించే పరిస్థితి వస్తున్నది. అణగారిన వర్గాలు, బలహీన, బడుగు వర్గాలు, దళితులు, ఆదివాసీలు,గిరిజనులు, మైనారిటీ లు గా తరతరా లుగా అన్యాయం జరుగుతున్న వర్గాలు ఉన్నారు.బహుజనుల ఐక్యత అనేది ఉండాలి,అది అవసరమే!దానిని ప్రజాప్రతినిధులు లీడ్ చేయాలి కాని, కులం పేరిట ప్రత్యేకంగా ఒక ప్రజా ప్రతినిధి కులంకు చెందిన వారు,వారి వారి కుల సంఘాల సమావేశాలు పెట్టడం ఎంతవరకు సమంజసం?ప్రజా ప్రతినిధులు ఇలాంటి కార్యకలాపాల్లోకి వెళ్లడం దాకా సరే, అయితే వాటిని లీడ్ చేయడం, సమస్త కుల,మతాల ప్రజలకు ఏమాత్రం నచ్చడం లేదు!ప్రస్తుతం దేశం లో ఇది ఒక చర్చ అయ్యింది.కులమతాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు ఉండాలి. సమాజంలో అసలే సామాజిక వర్గాల మధ్యన చిచ్చు పెట్టే విద్వేష రాజకీయాలు రాజుకుంటున్న వేళ ఇలాంటి వ్యవహారాలు మంచివి కావు!ఓటర్లు మీకు, మీ కులం చూసి, మతం చూసి ఓటు వేయలేదు.

**ప్రజాప్రతినిధుల అందరివారు**

అలాంటపుడు మీరు మీ కులం కు మాత్రమే నాయకుల్లా వ్యవహరించడం సరికాదు.రాజ్యాధికారం ఎవరి చేతుల్లో ఉంటే, వారి కులందే అధికారం కాకూడదు, కాదు కూడ, కాని పరిస్థితి అలా లేదు, రెడ్డి సీఎం కాబట్టి, రెడ్లదే రాజ్యం, వెలుమ సీఎం,కాబట్టి వెలమలదే రాజ్యం, కమ్మ సీఎం కాబట్టి వాళ్లదే రాజ్యం అంటే ఎట్లా? మనం రాజ్యాంగం ను గౌరవించే వాళ్ళం, రాజ్యాంగం ద్వారా రిజర్వేషన్ లు సంక్రమించిన నేపథ్యం ఉన్నది. కుల గణన జరుగుతున్నది. బీహార్ లాంటి రాష్ట్రం లో కుల గణన జరిగింది. తెలంగాణ లో జరుగుతున్నది. ఎవరు ఎంత శాతం ఉంటే అధికారం లో కూడ భాగస్వామ్యం అంత అనేది, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చెబుతున్నారు. దాని ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో అంటే ప్రభుత్వం లో పదవులు ఇవ్వాల్సిందే!ఉద్యోగాలు ఇతర విషయాలలోనూ రిజర్వేషన్ లు ఇవ్వాలి!రేపు కులగణన తర్వాత సీఎం పదవి బిసి, ఎస్సి కి ఎవరికైనా ఇవ్వాల్సి వస్తే ఇవ్వాల్సిందే!ఇవన్నీ దాచినా దాగని నిజాలు!నిజం ను అంగీకరిస్తారా?అలా జరుగుతుందా.. కులగణనకు బీజేపీ వ్యతిరేకంగా ఉంది కాబట్టి ఆ విషయంలో ఎక్కువ మాట్లాడడం కాని,ఎత్తడం కాని లేదు.

**హిందూ, ముస్లిం రాజకీయాలు ఎందుకు..**

ఏమైనా హిందూ, ముస్లిం రాజకీయాలు తప్ప మరోటి కనిపించడం లేదు, ఎన్నికల్లో ఎప్పుడు కూడ ఇవే మాటలు!మొత్తం ముస్లింల మీద అయితే ఈ సారి మహారాష్ట్ర, ఝార?ండ్ ఎన్నికల్లో చాలా ఓపెన్ గా విషం కక్కడం మొదలుపెట్టారు.మొత్తం దేశం ఆశ్చర్య పోయేవిధంగా మాటలు, ట్రోలింగ్ లు,అబద్దాలు ఎందుకు? ఇదంతా దేనికోసం? కేవలం అధికారం కోసమే కదా!అధికారం కోసం కలిసి, మెలసి బతుకుతున్న,కులమతాలకు అతీతంగా హిందూ, ముస్లిం, సిక్కు, ఈసాయి హంసబ్ ఏక్ హై అంటూ, తర తరాలు గా ఉంటున్న మనుషుల మనసులలో విషం నింపే కుట్రలు చేస్తున్న వారికి, కులం పేరిట సమీకరణలు చేస్తున్న వారికి తేడా ఉండదు! అందుకే ప్రజా ప్రతినిదుల్లారా కులం కులం అంటూ కుచ్చితాలు పెంచుకునే వ్యవహారాలు వద్దు! మిమ్మల్ని ఓటర్లు కులం చూసి గెలిపించలేదనే విషయం ను గుర్తుంచుకోండి. మీరు అందరి వారు, అందరి వారిలా ఉండండి, అని విజ్ఞప్తి! ( ఎవరికి వర్తిస్తే వారికే )మీరు మొత్తంగా అందరి వాళ్ళు, అందరి వాళ్ళలాగే ఉండాలి! మీది, ఏ కులం అయినా, ఏ మతం అయినా, మీ మీద మీ సామాజిక వర్గం ముద్ర పడకుండా ఉండాలి!అందుకే ఈ వ్యాసం రాయడం జరిగింది!ఒక కులానికి, మతానికి, రాజ్యం అన్యాయం చేసినపుడు, రాజ్యాంగం ప్రకారం రావాల్సిన హక్కులు ఇవ్వకుండా హరించబడినపుడు సకల జనులు కలిసి ప్రశ్నించే పరిస్థితి ఉండాలి! ఆ దిశన ప్రజాప్రతినిధులు వ్యవహరించాలి! నిలబడాలి! నిలదొక్కుకోవాలి!ఆచరణ ఉండాలి! ఆవాజ్ దో ఆద్మీ సబ్ ఏక్ హై!సకల జనులు ఏక్ హై! బహుజనులు ఏక్ హై! మనుషుల ఐక్యత వర్ధిల్లాలి.



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
9951865223

# లింగవేతన వ్యత్యాసం తగ్గేదెప్పుడు?



1981లో ఎయిర్ ఇండియా వర్సెస్ నర్గేష్ మీర్జా కేసులో భారత సుప్రీం కోర్ట్ ఇచ్చిన కీలకమైన తీర్పు కార్యాలయాల్లో లింగ ఆధారిత వివక్షతను గుర్తించి సరిదిద్దడానికి తొలి అడుగని చెప్పవచ్చు.

**ఏంటీ కేసు ? :** ఎయిర్ ఇండియా మహిళా క్యాబిన్ సిబ్బంది ఉద్యోగులలో ఎవరైనా గర్భం దాల్చినచో వారు తప్పనిసరిగా పదవీ విరమణ చేయాలనే నిబంధనను సవాల్ చేస్తూ నెర్గేస్ మీర్జా సుప్రీంకోర్టు తలుపు తట్టారు. సుప్రీం తన తీర్పులో నిబంధన రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 ప్రకారం ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా భావించి నిబంధనను కోర్టు కొట్టివేసింది. ఇది మన దేశంలో ఉపాధి చట్టం, లింగ సమానత్వం, రాజ్యాంగ సూత్రాల అన్వయంపై చర్చలకు ఈ కేసు కీలకమైన సూచనగా మిగిలిపోయింది.

**లింగ వేతన వ్యత్యాసం:**

ప్రపంచంలో అన్ని ప్రాంతాలలో మహిళలు పురుషుల కంటే తక్కువ వేతనం పొందుతున్నారు. లింగపరంగా సమాన పనికి సమాన వేతనం పొందలేకపోవడాన్ని లింగవేతన వ్యత్యాసం అంటారు. సరళంగా చెప్పాలంటే ఒకే ఉద్యోగాలు చేసే స్త్రీ పురుషుల మధ్య సంపాదనలో సగటు వ్యత్యాసం. ఒకే రకమైన ఉద్యోగానికి పురుషుల కంటే మహిళలు తక్కువ సంపాదించడం వల్ల మాత్రమే లింగవేతన వ్యత్యాసం ఏర్పడదు. ఒక్కోసారి మహిళలు తక్కువ సంఖ్యలో సీనియర్ ఉద్యోగాల్లో ఉండడం వలన లింగవేతన వ్యత్యాసం ఉండొచ్చు. లింగవేతన వ్యత్యాసం సుమారు 20 శాతంగా ఉంటుందని అంతర్జాతీయ అధ్యయనాల అంచనాలు తెలుపుతున్నాయి. పూర్తి సమయం పనిచేసే మహిళలు ఇప్పటికీ పురుషుల కంటే 15% తక్కువ సంపాదిస్తున్నారు. స్త్రీ, పురుషులకు సమాన వేతనం విస్తృతంగా ఆమోదించబడినప్పటికీ ఆచరణీయం కావడం లేదు. లింగవేతన వ్యత్యాసంపై లింగ అసమానతల ప్రభావం ఉంటుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరం జెండర్ గ్యాప్ ఇండెక్స్ రిపోర్ట్ 2024 ప్రకారం, లింగ అంతరం 68.5 శాతానికి తగ్గింది. మనుగడలో లింగ వ్యత్యాసం 96 శాతం, ఆర్థిక ప్రమేయం అంతరం 60.5 శాతం తగ్గింది. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగం చేస్తున్న మహిళల్లో కేవలం 28 శాతం మంది మాత్రమే వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను అనుభవిస్తున్నారని అంచనా. పురుషుల కంటే మహిళలు కనీసం రెండున్నర రెట్లు ఎక్కువ వేతనం లేని గృహ, సంరక్షణ పనులను నిర్వహిస్తారు. వేతన వ్యత్యాసం మొత్తం ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తుంది. మహిళలక సమానమైన వేతనం ఇచ్చినప్పుడు, వారి పెరిగిన ఆర్థిక భద్రత అధిక ఖర్చు శక్తికి దారితీసి స్థానిక ఆర్థిక వ్యవస్థలను పెంచి జాతీయ వృద్ధికి దోహదం చేస్తుంది. వేతన సమానత్వం ప్రతి ఒక్కరికీ ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ అంతరాన్ని తగ్గించే దిశగా పురోగతి మందకొడిగా సాగుతోంది.

**లింగవేతన వ్యత్యాసం ఎందుకు కొనసాగుతుంది?**

లింగవేతన వ్యత్యాసానికి లింగ అసమానతలు ఒక కారణం. అసంఘటిత రంగంలో వలస మహిళలు వారికుండే పరిస్థితుల వల్ల తక్కువ వేతనానికే పనిచేస్తున్నారు. గృహ బాధ్యతలు ఎక్కువగా ఉండే మహిళలు పార్ట్ టైమ్ ఉపాధికే పరిమితం కావడం వలన తక్కువ వేతనం పొందుతున్నారు. పిల్లలు ఉన్న మహిళలు ఈ అసమానతలకు ఎక్కువగా గురవుతారు. దీనిని మాతృత్వ శిక్ష అని కూడా పిలుస్తారు. సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో పిల్లలు ఉన్న మహిళలకు లింగ వేతన వ్యత్యాసం వరుసగా 31 శాతం, 35 శాతంగా ఉండగా పిల్లలు లేని మహిళలకు 4 శాతం, 14 శాతంగా ఉంది. జెండర్ స్టీరియోటైప్స్ ( అనాదిగా వస్తున్న ఆచారాలు ), వివక్షతో కూడిన నియామక పద్ధతులు, ప్రమోషన్ నిర్ణయాలు కూడా వేతన అసమానతలకు దోహదం చేస్తున్నాయి.

మనదేశంలో లింగ వేతన వ్యత్యాసం:

ప్రపంచ లింగ అసమానత నివేదిక 2022 అంచనాల ప్రకారం, మన దేశంలో శ్రామిక ఆదాయంలో పురుషులు 82% సంపాదిస్తుండగా మహిళలు 18% సంపాదిస్తున్నారు. 2024 లో లింగఅంతరంలో 64.1% మాత్రమే మూసివేసి 129 వ స్థానంలో మనదేశం ఉంది. ఇది 2023లో 127 వ స్థానంలో ఉండేది. గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ 2022 నివేదిక మొత్తం 146 దేశాలలో మనదేశం 135 వ స్థానంలో ఉంది. 2023 - 24 లో యుఎన్డిపి విడుదల చేసిన లింగ అసమానత సూచిక (జిఐఐ) 2022 లో 193 దేశాల్లో భారత్ 0.437 స్కోరుతో 108వ స్థానంలో ఉంది. జూలై 2022 నుండి జూన్ 2023 మధ్య సంవత్సరంలో ఒక నెలలో భారతీయ పురుషుడు సగటు జీతం రూ. 20,666 ఉండగా మహిళకు రూ.15,722.25 ఉంది. ఐఐఎం అహ్మదాబాద్ అధ్యయనం ప్రకారం ఒకే విధమైన పనిలో మహిళలు, పురుషుల కంటే 2.2% తక్కువ సంపాదిస్తున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం నివేదిక ప్రకారం భారతీయ పురుషులు రూ.100 సంపాదిస్తే మహిళలు కేవలం రూ.40 మాత్రమే సంపాదిస్తున్నారు. ఇది గణనీయమైన లింగ వేతన వ్యత్యాసాన్ని ప్రతిబింబిస్తుంది. దేశంలో మహిళలు తరచుగా ఇంటి పనులు, శిశు సంరక్షణ, వృద్ధుల సంరక్షణ వంటి కంటికి కనిపించని శ్రమ వలన పేదరికానికి దోహదం చేస్తుంది.

**వేతన వ్యత్యాసాన్ని తగ్గించడం ఎలా ?**

సమాన వేతనం సాధించడం అనేది మానవ హక్కులు, లింగ సమానత్వానికి ఒక ముఖ్యమైన మైలురాయి లాంటిది. లింగ వేతన అంతరాన్ని తొలగించడానికి, శ్రామిక శక్తిలో మహిళలు పూర్తిగా, సమానంగా పాల్గొనకుండా నిరోధించే అడ్డంకులను తొలగించే సాంస్కృతిక మార్పులు చేయాలి. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మికసంస్థతో సహా, సభ్య దేశాలు, పౌర సమాజం, మహిళా కమ్యూనిటీ ఆధారిత సంస్థలు, స్త్రీవాద సమూహాలు, వ్యాపార సంస్థల యాజమాన్యాలు సహకరించాలి. సమాన పని విధానాలకు సమాన వేతనాన్ని అమలు చేయడం, నాయకత్వ స్థానాల్లో లింగ వైవిధ్యాన్ని ప్రోత్సహించడం, వేధింపులు వివక్ష లేని పని జీవిత సమతుల్యత, సురక్షితమైన పని వాతావరణాలకు మద్దతు ఇచ్చే పనిప్రాంత విధానాలను అమలు చేయాలి. సమాన వేతన అంతర్జాతీయ కూటమి (ఇపిఐసి)అనేది అన్ని చోట్లా మహిళలు, పురుషులకు సమాన వేతనం సాధించడమే దీని లక్ష్యంగా పనిచేస్తుంది. విభిన్న నైపుణ్యం కలిగిన విభిన్న సమూహాన్ని ఏకతాటిపైకి తీసుకురావడం ద్వారా ఇపిఐసి ఈ లక్ష్యం దిశగా ఖచ్చితమైన సమన్వయ పురోగతిని సాధించడానికి ప్రభుత్వాలు, యజమానులు, కార్మికులు, వారి సంస్థలకు మద్దతు ఇస్తుంది. అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలలో లింగ వేతన వ్యత్యాసాన్ని తగ్గించడానికి పనిచేస్తున్న ఏకైక బహుళ భాగస్వామ్య భాగస్వామ్య సంస్థ ఇది. ఇక మన దేశంలో లింగ వేతన వ్యత్యాసం వివిధ కారకాలచే ప్రభావితమైన సంక్లిష్ట సమస్య. కనీస వేతనాల చట్టం (1948), సమాన వేతన చట్టం (1976), వేతనాలపై 2019 కోడ్ వంటి మైలురాయి చట్టాలతో లింగవేతన వ్యత్యాసాన్ని పరిష్కరించడానికి కేంద్రం చట్టబద్ధమైన చర్యలు చేపట్టింది. 2017లో పెద్ద సంస్థల్లోని మహిళలకు ప్రసూతి సెలవులను 26 వారాలకు పొడిగించేందుకు మెటర్నిటీ బెనిఫిట్ చట్టం సవరించబడింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి పే ఈక్విటీ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా పురుష, మహిళా క్రికెటర్లకు సమాన మ్యాచ్ ఫీజులను నిర్ధారించడం ద్వారా ఒక ఉదాహరణగా నిలిచింది. గృహ, వృత్తిపరమైన విధుల్లో ఇద్దరూ చురుకుగా పాల్గొనే వాతావరణాన్ని పెంపొందించాలి. క్రియాశీల ఉద్యోగాలలో మహిళలను నియమించాలి. వేతన నిర్ణయాలలో పారదర్శకత పాటించాలి. వివక్ష, వేధింపుల కోసం జీరో-టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలి. మహిళా శక్తి కేంద్రం (ఎమ్మెస్కే) ఉపాధి అవకాశాల ద్వారా గ్రామీణ మహిళల సాధికారతను లక్ష్యంగా పెట్టుకుంది. నేషనల్ క్రెచ్ స్కీమ్ చిన్నపిల్లలు ఉన్న తల్లులకు మహిళలు ఉపాధిని కొనసాగించడానికి వీలు కల్పిస్తుంది. 19నవంబర్ 2024 నాడు బ్యాంకాక్ లో ఐక్యరాజ్యసమితి ఎకనామిక్ అండ్ సోషల్ కమిషన్ ఫర్ ఆసియా అండ్ ది పసిఫిక్ (ఎస్కాప్), యూఎన్ ఉమెన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న సదస్సులో శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రీతమ్ బి యశ్వంత్ మాట్లాడుతూ లింగ వేతన అంతరం, లింగ డిజిటల్ విభజన, మెరుగైన ఆరోగ్యం, శ్రేయస్సు, పోషకాహార ఫలితాలను తగ్గించడంపై దృష్టి పెట్టామని చెప్పారు.



జనక మోహన రావు దుంగ
ఫోన్ 8247045230

# మెస్ చార్జీలు పెంచిన ఘనత కాంగ్రెస్‌దే

- విద్యార్థులకు బ్లాంకెట్లు, స్వెటర్ల పంపిణీకి చర్యలు
- పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో అధ్వాన్నంగా రోడ్లు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 26 (జనం సాక్షి)**

గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు గురుకుల పాఠశాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు మేస్చార్జీలు పెంచిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించేలా చర్యలు చేపట్టిందన్నారు. చలికాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా ఉండడానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో రోడ్ల మరమ్మత్తులు లేక రాష్ట్రంలో రోడ్లన్నీ అధ్వాన్నంగా తయారయ్యాయి అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మంగళవారం అందోల్ నియోజకవర్గంలో సుమారు రూ. 30 కోట్లతో వివిధ రోడ్డు పునర్నిర్మాణం పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. గత పది సంవత్సరాల కాలంలో రోడ్లు మరమత్తు పనులు చేపట్టకపోవడంతో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయి అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రోడ్ల పునర్నిర్మాణ పనుల్లో ఉందన్నారు. అందులో నియోజకవర్గంలో మంగళవారం రూ .30 కోట్లతో వివిధ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసినట్లు మంత్రి తెలిపారు. మంగళవారం పుల్కల్ మండలం కోడూరు ఎక్స్ రోడ్డు నుండి కొండారెడ్డిపల్లి ఎక్స్ రోడ్ వరకు కోట్లతో, డాకుర్ పిడబ్ల్యుడి రోడ్డు నుండి పోతిరెడ్డిపల్లి ఎక్స్ రోడ్ వరకు కోట్లతో, రోళ్ల పహాడ్ గేట్ నుండి గ్రామం వరకు కోట్లతో రోడ్డు నిర్మాణం పనులకు మంత్రి దామోదర్ శంకుస్థాపన చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని అన్ని రోడ్లకు మరమ్మతు పనులు చేపట్టడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కులగనున కార్యక్రమం పూర్తికావస్తుందన్నారు. సామాజిక ఇంటింటి సర్వే పూర్తికాగానే ప్రభుత్వం నీకు నివేదిక అందజేయున్నట్లు తెలిపారు. చలికాలంను దృష్టిలో పెట్టుకొని సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు గురుకుల పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్ర శేఖర్, పంచాయతీ రాజ్, ఎస్ఈ జగదీశ్, ఆర్‌డిఓ పాండు, మండల ప్రత్యేక అధికారి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ. 1.70 కోట్లతో రోడ్లకు శంకుస్థాపన
- నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



**నిజాంపేట్ సెప్టెంబర్ 26 (జనంసాక్షి)**

కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో గ్రామీణ ప్రాంతా రోడ్లకు మహర్దశ రానుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నిజాంపేట్ మండలంలో ఉపాధి హామీ నిధులు 10 లక్షలతో సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే దర్గా నుంచి పోసేటి పల్లి వరకు రూ. 1. 70 లక్షలతో నిర్మించనున్న రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. నిజాంపేట్ మండలంలోని రోడ్డు చాలా సంవత్సరాల నుంచి వెళ్లే వారికి చాలా ఇబ్బందులు కలుగుతుందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో రోడ్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంత రోడ్లను పట్టించుకున్న పాపాన పోలేరని కాంగ్రెస్ ప్రభుత్వ ఆయంలోప్రతి గ్రామానికి రోడ్లు వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి రాకేష్ సెట్కర్, మాజీ డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ రెడ్డి, నిజాంపేట్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ గౌడ్, నారాయణఖేడ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, మాజీ సర్పంచ్ రఘుపతి రెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగారెడ్డి, ప్రవీణ్ గౌడ్, శ్రీను నాయక్, కృష్ణ ,శివకాంత్ పటేల్, సాయి చరణ్ ,సీమోను తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పధకాలను ప్రజలకు చేరేందుకు కృషి చేయాలి

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి

**శామీర్ పేట్ (జనం సాక్షి):**

ప్రభుత్వం అందించే బృహత్తర పథకాలు పేద ప్రజలకు చేరువ అయ్యేలా రధ సారదులు పాటుపడాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నిమ్మల గార్డెన్ లో జరిగే మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మల పల్లి నర్సింలు యాదవ్,జిల్లా గ్రంధాలయం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి ల ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, అతిధులుగా వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్, రాష్ట్ర గ్రంధాలయం చైర్మన్ రియాజ్ లు విచ్చేయగా పూల బొకే అందించి స్వాగతం పలికారు. నూతనంగా నియమించిన చైర్మన్ లు, డైరెక్టర్ లను ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో బోడుప్పల్ మేయర్ అజయ్ యాదవ్,శ్రీదేవి, సరిత, ఎ బ్లాక్ అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి

**యాచారం, నవంబర్26(జనం సాక్షి)**



యాచారం మండల పరిధిలోని అయ్యావారిగూడెం, ఏనకింది తండా, చౌదర్పల్లి గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి, అయ్యవారిగూడెం, ఎనకింది తండా గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణానికి 18 లక్షలు, చౌదర్పల్లి గ్రామంలో 16 లక్షలతో శంకుస్థాపన చేశారు. సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో కొంతమందికి ఇంకా రుణమాఫీ కాలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే రుణమాఫీ కానీ వారి వివరాలను సేకరించి అర్హులైన వారందరికీ రుణమాఫీ చేయాలని అగ్రికల్చర్ ఏవో ను ఆదేశించారు. గ్రామంలో త్రాగునీటి సమస్య ఎక్కువగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అక్కడ ఉన్న అధికారులపై గ్రామస్తులకు సరిపడా త్రాగునీరు అందించ లేనప్పుడు మీరు ఉద్యోగం చేసి ఎందుకని అధికారులపై మండిపడ్డారు. త్రాగునీటి సరఫరా లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, బి.ఎస్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మూడేళ్ల వెంకట్ రెడ్డి, పోలమోని రామకృష్ణ యాదవ్, గౌర శ్రీశైలం, కొమ్ము సురేష్, ఎంపీడీవో నరేందర్ రెడ్డి, ఎంపీవో శ్రీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో ఓటే బలమైన ఆయుధం

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి
- అడిషనల్ కలెక్టర్ లింగ్య నాయక్



**కొడంగల్ నవంబర్26(జనంసాక్షి):**

అర్హత కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు నమోదు చేసుకుని ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్య నాయక్ కోరారు. మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్విఫ్ ఓటర్ అవగాహన సదస్సులో భాగంగా 2కే రన్ నిర్వహించారు. ఈ 2కె రన్ కొడంగల్ పట్టణ కేంద్రంలో మార్కెట్ యాడ్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులతో ర్యాలీ కొనసాగింది. అంబేద్కర్ చౌరస్తా చేరుకొని భారత రాజ్యాంగం దినోత్సవం పురస్కరించుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ..ప్రజాస్వామ్యలో ఓటే బలమైన ఆయుధం అన్నారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకొని ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. దేశ భవష్యత్తును నిర్ణయించే శక్తి మనం వేసే ఓటుపై ఆధారపడి వుంటుందన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కావద్దని ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత తెలుసుకుని బాధ్యతగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ విజయ కుమార్, మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, ఎస్ఐ సత్య నారాయణ, ఎంఈఓ వెంకట్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది, ప్రైవేట్ పాఠశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటిల అమలే లక్ష్యం..!

- ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- 3.54 లక్షల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ
- మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి

**కూకట్ పల్లి నవంబర్ 26(జనంసాక్షి):**



ప్రజా ప్రభుత్వం ప్రజల కోసమే పని చేస్తుందని ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్షంగా పెనిచేస్తుంది అని మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలో మూడు కోట్ల 54 లక్షల షాదీ ముబారక్ కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తుందని అన్నారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వంపై ప్రజలు ఆశతో ఉంటారని ప్రజల ఆశలను వమ్ము చేయకుండా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ఎలాంటి పక్షపాత ధోరణి ఉండదని అలా ఎవరైనా భావిస్తే వారి భ్రమే అవుతుందన్నారు. నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భవిష్యత్తులో సైతం ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో.... కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి బి బ్లాక్ అధ్యక్షులు తుమ్మా వేణు కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవరావు వెంకటేశ్వరరావు డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్ కృష్ణ రాజ్ పుత్, సతీష్ గౌడ్, మహమ్మద్, మేకల రమేష్, మధు గౌడ్, ఫణీంద్ర లక్ష్మినారాయణ, మస్తాన్ రెడ్డి, కనకయ్య ముదిరాజ్, అక్బర్, శ్రీధర్ చారి, రాజు ముదిరాజ్, శివ చౌదరి, నలిని కాంత్, భారీ ఎత్తున నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామాభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



- రోడ్ల నిర్మాణానికి 20 కోట్ల 86 లక్షల రూపాయల నిధుల మంజూరు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్చెరు నవంబర్ 26(జనంసాక్షి)**

నియోజకవర్గ పరిధిలోని ప్రతి గ్రామం సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా నిధులు కేటాయిస్తున్నామని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రజాపాలన వారోత్సవాలలో భాగంగా సి ఆర్ ఆర్ పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల పరిధిలో నూతన రోడ్ల నిర్మాణానికి 20 కోట్ల 86 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని నందిగామ నుండి బానూరు గ్రామం వరకు కోటి రూపాయలు అంచనా వేయడంతో నిర్మించి తలపెట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన అభివృద్ధి పనులకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. అనంతరం నందిగామ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 50వేల రూపాయలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, గోపాల్,. శ్రీశైలం యాదవ్, ఎంపీడీవో యాదగిరి, పంచాయతీరాజ్ విభాగం డి ఈ సురేష్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



## దాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి

- ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించం
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 26 (జనం సాక్షి):**

ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని..ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించమని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజు అన్నారు. కొల్చారం మండలం పోతన శెట్టిపల్లి గ్రామంలోని ఐకెపి వారి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన అనంతరం మండల కేంద్రంలోని సత్యసాయి రైస్ మిల్ మరియు కేజీవీబీ పాఠశాలలో వంటగదిని ,వంటలను వండే వస్తువులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేసి,రైతులకు సత్వరమే వారి అకౌంట్లలో డబ్బులు జమ చేయాలన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండాలని ఆదేశించారు.ధాన్యం తరలింపులో మిల్లర్ల అలసత్వాన్ని సహించమన్నారు. ధాన్యం లోడింగ్ అన్లోడింగ్‌లో ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మిల్లర్లు సహకరించాలన్నారు.

### పౌష్టిక ఆహారాన్ని అందించాలి

ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు,ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మంచి నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి లోటు పట్లు లేకుండా చూడాలన్నారు. వంట గది,వంట సామగ్రిని ఎపుడు శుభ్రంగా ఉంచాలని, కేజీవీబీ పాఠశాల సిబ్బందికి సుంచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులకు విరుద్ధంగా అక్రమ బ్లాస్టింగులు

- దళితుల భూములు రికార్డుల్లో మాయం
- నిబంధనలు గాలికి.. అడ్డగోలుగా తవ్వకాలు
- మంజీరా మెటల్ ఇండస్ట్రీ నిర్వాకం..!
- కంకర మాటున కాసుల దందా



**మెదక్ జిల్లా బ్యూరో, నవంబర్ 26(జనంసాక్షి):**

కొండలను పిండి చేస్తున్నారు.. నేల, నీరు, పర్యావరణం కలుషితమవుతున్నా వారికి పట్టింపు లేదు.. ఇల్లు బీటలు వారినా, ప్రమాదాలు జరిగినా, పంటలు నష్టపోయినా, భూగర్భ జలాలు అంతరించినా, ప్రభుత్వం ఇచ్చిన నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా బోరు బ్లాస్టింగ్లతో మొబైల్ క్రషర్లు ఏర్పాటుచేసి కంకర మాటున కాసుల దందా మూడు పువ్వులు ఆరు కాయలు అన్న సొంతంగా నడుస్తుంది. మెదక్ జిల్లా కొల్చారం మండలం రాంపూర్ గ్రామంలో సుమారు 20 సంవత్సరాల క్రితం ఏర్పాటుచేసిన మంజీరా మెటల్ ఇండస్ట్రీ రైతుల పాలిట.. ప్రజల పాలిట శాపంగా మారింది. ఈ క్రషర్ దాషితీకాలను ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తే అక్రమాలను అరికట్టాల్సిన పోలీస్, రెవెన్యూ, అటవీ, మైనింగ్ శాఖ అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి బొక్కలో వేయిస్తున్నారని రైతాంగం వాపోతున్నారు.

### స్థానిక అవసరాల కోసం స్టోన్ క్రషర్ ఏర్పాటు

ఇరవై ఏళ్ల క్రితం స్థానిక గ్రామపంచాయతీ అగ్రిమెంట్తో రాంపూర్ గ్రామంలోని అటవీ, ప్రభుత్వ భూమి సర్వేనెంబర్ 373లో రెండు హెక్టాల క్వారీ లీజుకు తీసుకొని స్టోన్ క్రషర్ ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి, ఈ ప్రాంతంలో రోడ్ల నిర్మాణానికి అవసరమైన కంకర, డస్ట్ కోసం మామూలు బ్లాస్టింగ్ తో క్రషర్ ఏర్పాటుకు అనుమతి తీసుకున్నారు. అప్పట్లో గ్రామపంచాయతీ కి నెలవారి కొంత అమౌంట్ ఇవ్వడంతో పాటు, స్థానికుల ఇండ్ల నిర్మాణానికి సగం ధరకే కంకర ఇచ్చేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నారు. కంకర, డస్ట్ నిల్వ చేసేందుకు చుట్టుపక్కల భూముల రైతులకు ఆశలు కల్పించి భూములను లీజుకు తీసుకున్నారు.

### అడ్డగోలుగా బ్లాస్టింగులు



ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రైవేటు భూమి అయినా, ప్రభుత్వ భూమి అయినా మామూలు బ్లాస్టింగ్లతో 9 ఫీట్ల లోతు వరకు మాత్రమే క్వారీ నుంచి కంకర తీయాల్సి ఉంటుంది. కానీ క్రషర్ నిర్వాహకులు బోరు బ్లాస్టింగ్లతో 60 నుంచి 70 ఫీట్ల లోతు వరకు తవ్వకాలు జరిపి కంకర తీస్తున్నారు. దాంతో చెరువులను తలపించే విధంగా ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. బోరు బ్లాస్టింగ్లతో దగ్గర్లోనే ఉన్న ఇండ్లు బీటలు వారాయి. పక్క పొలాల్లో ఉన్న రైతుల బోర్లలో మోటర్లు ఇరుక్కుపోతున్నాయి.

### దెబ్బతింటున్న పర్యావరణం

క్రషర్ యజమానులు హిస్టారీతిగా బ్లాస్టింగ్లు జరపుతుండడంతో పెద్ద ఎత్తున దుమ్ము, ధూళి పక్కనే ఉన్న మొక్కలపై, రైతులు సాగు చేసిన పంటలపై పడుతుంది. రాతి పొడి కారణంగా పంట దిగుబడి తగ్గుతుంది. అడవిలో ఉన్న వన్యప్రాణులు సైతం మృత్యువాత పడుతున్నాయి. క్రషర్ నుంచి హైవే రోడ్ వరకు పెద్ద పెద్ద టిప్పర్లలో కంకర, డస్ట్ రవాణా చేస్తుండడంతో రోడ్డు పక్కన భూముల్లో సాగు చేసిన పంటలన్నీ దెబ్బతింటున్నాయి. దుమ్ము, ధూళితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.

### దళితుల భూములు రికార్డుల్లో మాయం

రాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 373 లో కొంతమంది దళితులకు ప్రభుత్వం 30 సంవత్సరాల క్రితం అసైన్ చేసింది. అట్టి భూమిని సాగు చేసుకొని వచ్చిన పంట ఉత్పత్తులతో దళితులు జీవిస్తున్నారు. కాగా క్రషర్ ఏర్పాటు చేసిన తర్వాత కంకర నిల్వ ఉంచేందుకు క్రషర్ యజమానులు సుమారుగా 20 నుంచి 25 మంది రైతులకు డబ్బు ఆశ చూపి వారి భూములను లీజుకి రాసుకొని, వారి నుంచి పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకున్నారు. రెవెన్యూ అధికారులతో క్రషర్ యజమానులు చేతులు కలిపి దళితుల భూములను రికార్డులో వారి పేర్లు లేకుండా తొలగించారు. కొంతమంది రైతుల భూములను ప్రభుత్వ భూమిగా నమోదు చేయించారు. దాంతో దళిత రైతులు ఆందోళన చెందుతున్నారు.

### గుట్టు చప్పుడు కాకుండా కెపిసితో ఒప్పందం

స్థానిక అవసరాల కోసం..చిన్న చిన్న బ్లాస్టింగ్లతో క్వారీ నిర్వహిస్తామని ఒప్పందం కుదుర్చుకున్న యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా మెదక్ ఎల్లారెడ్డి రోడ్డు పనులు చేపడుతున్న కెపిసి కంపెనీతో కంకర, డస్ట్ రవాణా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. రోజుకు 30 నుంచి 40 టిప్పర్ల కంకర, డస్ట్ తయారు చేసేందుకు ఇక్కడ ఏర్పాటుచేసిన క్రషర్ సరిపోకపోవడంతో, మరో రెండు మొబైల్ క్రషర్లను ఏర్పాటు చేశారు. దాంతో నిత్యం పెద్ద పెద్ద బోర్ బ్లాస్టింగ్లతో బండలు పిండి చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా క్రషర్లు ఏర్పాటు చేస్తున్నా... మైనింగ్ అధికారులు చప్పుడు చేయకుండా ఉండటంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు.

### యదేచ్ఛగా రాయల్టీ ఎగవేత

క్వారీ ఏర్పాటు నుంచి అడ్డగోలు తవ్వకాలతో ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించకుండా ఎగవేశారు. దాంతో అక్రమ తవ్వకాలపై గ్రామస్తుల ఫిర్యాదుతో కదిలిన మైనింగ్ అధికారులు విచారణ జరిపి 2016 -17 సంవత్సరంలో 21 లక్ష 62 వేల రూపాయల పెనాల్టీ విధించారు. అంతేకాకుండా అనుమతులు రద్దు చేశారు. ఇంకో వ్యక్తి పై టెంపరరీ పర్మిషన్ తీసుకొని క్రషర్ నడుపుతున్నారు. ప్రస్తుతం కూడా రోజుకు 200 రూపాయల నుంచి 300 రూపాయలు ( సంవత్సరానికి లక్ష రూపాయలు మాత్రమే) రాయల్టీ చెల్లిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారంటే మైనింగ్ అధికారుల తీరు అర్థమవుతుంది.

### టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు



రాంపూర్ గ్రామంలోని మంజీరా మెటల్ ఇండస్ట్రీ నుంచి అడ్డగోలుగా కంకర, డస్ట్ రవాణాను స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. స్థానికులు నిర్మించుకుంటున్న ఇండ్లకు కంకర లేదని చెప్పుతూ, రోడ్డు పనులకు రవాణా చేయడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

# విద్యార్థుల భోజనంలో రాజీ పడొద్దు



## ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎలాంటి రాజీ పడకుండా నాణ్యమైన ఆహారం అందించాలని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికా రెడ్డి ఆదేశంచారు. నారాయణపేట కేజీబీవీ, గురుకుల పాఠశాలను ఆకస్మికి తనిఖీ చేసి విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. నారాయణపేట పట్టణంలోని కేజీబీవీ మరియు గురుకుల పాఠశా లను ఆకస్మిక తనిఖీ చేసి ఎమ్మెల్యే స్టోర్ రూమ్ కి వెళ్లి బియ్యాన్ని కూరగాయలను ఈరోజు విద్యార్థులకు వడ్డించిన వంటలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి రోజు నాణ్య మైన భోజనం పెడుతున్నారా ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినీలతో కలిసి అక్కడే భోజనం చేశారు. టీచర్ల కొరత ఉంది అని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించి కొత్త టీచర్లను వెంటనే నియమిం చాలని విద్యార్థులకు ఇబ్బం దులు కలగకుండా చూడాలని ఆదేశించిన ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. రోజు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురావాలని టీచర్లను పాఠశాల అధికారులు సూచించారు.

# పల్లె ప్రాంతాల సర్వతోముఖాభివృద్దే ధ్యేయం

- **రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 12,250 కోట్ల రూపాయల పనులకు శ్రీకారం**
- **ఎమ్మెల్యే మేఘా రెడ్డి**



**వనపర్తి బ్యూరో నవంబర్ 26 (జనంసాక్షి)**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మారుమూల పల్లెలను సైతం అభివృద్ధి పదంలో నడిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నేడు శ్రీకారం చుట్టిందని, రాష్ట్రవ్యాప్తంగా ఒకే రోజు 12250 కోట్లకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయని, వనపర్తి నియోజకవర్గంలో సైతం 12 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు మొదలైనట్లు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో మంగళవారం ఆయన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, అంగన్వాడి భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నేడు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. గ్రామాలలో నూతన గ్రామపంచాయతీ భవనాలను, నూతన అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణాలను, పొలం బాటలను, రైతులకు వ్యవసాయోగ్యమైన పాంపాండ్స్, వర్మి కంపోస్ట్ ఫిట్ నిర్మాణాలను గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణాలను, నర్సరీ అభివృద్ధిని, చెక్ డ్యామ్ ల నిర్మాణం గల్లి కంట్రోల్ వాల్సు లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని వివరించారు. పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే ఈ అభివృద్ధి పనులు రైతులకు గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనంతరం గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగంపల్లి గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన చెక్ డ్యామ్ ను వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈ ఈ మల్లయ్య,డిఆర్డీఏ పిడి ఉమాదేవి, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్ పెద్దమందడి ఎంపీడీవో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### కుటుంబ సర్వేలో వివరాలను నమోదు చేసుకున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వారి కుటుంబ వివరాలను నమోదు చేయించుకున్నారు. మంగళవారం పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా తన సొంత గ్రామం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామానికి వెళ్ళిన ఎమ్మెల్యే గారితో సర్వే అధికారులు కుటుంబ వివరాలను సేకరించారు.

# ప్రతి పౌరునికి సమన్యాయం జరగడమే రాజ్యాంగ లక్ష్యం



## జిల్లా అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్

**వనపర్తి బ్యూరో నవంబర్ 26(జనంసాక్షి)**

ప్రతి పౌరునికి సామాజిక, ఆర్థిక,రాజకీయ సమన్యాయం అందించడమే భారత రాజ్యాంగం లక్ష్యమని, జిల్లా అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్ అన్నారు. పరాయి పాలన నుండి విముక్తి పొందిన అనంతరం స్వతంత్ర రాజ్యాంగాన్ని రూపొందించుకొని ఆమోదించి నేటికీ 75 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా పోలీసు అధికారులకు, సిబ్బందికి, జిల్లా ప్రజలందరికి జిల్లా అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్ శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా పోలీసుఅధికారులు, సిబ్బంది చేత భారత రాజ్యాంగం పీఠికను చదివించి ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్య భావాలకు అనుగుణంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం భారతీయ జీవన విధానానికి ప్రతీక అని కొనియాడారు.

# కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



## ఎమ్మెల్యే కూచుకుల రాజేష్ రెడ్డి

**బిజినేపల్లి నవంబర్ 26 (జనం సాక్షి)**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని నాగర్ కర్నూల్ శాసనసభ్యులు కూచుకుల రాజేష్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లిపూర్ గ్రామంలో 20 లక్షల వ్యయంతో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎనిమిది లక్షల 40000 తో నిర్మించిన ఐమాక్స్లైట్లను. 30 లక్షలతో నిర్మించిన సిసి రోడ్ల ను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గత బి ఆర్ ఎస్ పాలనలో అల్లిపూర్ గ్రామానికి 10 సంవత్సరాల కాలంలో 15 లక్షలు ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయి సంవత్సర కాలంలో గ్రామానికి 70 లక్షల పనులు ఇచ్చామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రోడ్లు. విద్య. రైతు రుణమాఫీ పై దృష్టి సారించారని ఎవరు కూడా అధైర్యపడవద్దని ఆయన ప్రజలకు సూచించారు. నవంబర్ 30 తారీఖున మహబూబ్నగర్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహి స్తున్నట్లు ఆయన తెలిపారు. ఆ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెంచిన పెన్షన్స్ పై. ఇందిరమ్మ ఇండ్లు. ఇచ్చిన హామీల్లో పెండింగ్ లో ఉన్న హామీలన్నీ నెరవేర్చే విధంగా ప్రకటన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ ఓబులేష్, పిఆర్డిఈ. తాసిల్దార్ శ్రీరాములు, ఎంపీడీవో కథలప్ప, ఏపీఎం రజిత, ఏవో నీతి పిఆర్ఏఈ నాయకులు కొండా నాగేష్, మాజీ సింగల్ విండో చైర్మన్ వెంకటస్వామి, అమృత రెడ్డి, గంగన మౌని తిరుపతయ్య, మస్కూరి బంగారయ్య, రామకృష్ణ. హరీశ్వర్ రెడ్డి. శ్రీనివాస్ బహు దూర్, గోవింద నాయక్ తదితరులు ఉన్నారు

# అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి కృషి



- **అంగన్వాడీల నూతన భవనాలకు శంకుస్థాపన**
- **అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**

**చారకొండ, నవంబరు 28 (జనంసాక్షి)**

అంగన్వాడి కేంద్రాల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. చారకొండ, తుర్కలపల్లిలో అంగన్వాడి నూతన భవణ నిర్మాణాలకు మంగళవారం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యరంగానికి అధిక నిధులు కేటాయిస్తూ అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో విద్యను బలోపేతం చేస్తుందని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో గర్బిణీలకు, బాలింతలకు, చిన్నారులకు అనేక పథకాలు పెట్టి వారికి పౌష్టికాహారం అందజేస్తుందని అన్నారు. చారకొండ, తుర్కలపల్లి ఆంగన్వాడి నూతన భవణ నిర్మాణాలకు రూ. 24 లక్షలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. త్వరతగతిన అంగన్వాడి భవణ నిర్మాణాలను నాణ్యతతో పూర్తి చేయాలని అన్నారు. నాగర్ కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి. కల్వకుర్తి ఎమ్మెల్యే కరెడ్డి నారాయణరెడ్డిలతో కలిసి గోకారం రిజర్వాయర్ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పనులు త్వరగా పూర్తి అయ్యోవిధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటామని ఈ ప్రాంతంలో ప్రతి ఒకరాకు సాగునీరు అందించడమే తమ లక్ష్యమని అన్నారు. అనంతరం తుర్కలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడి వారికి కావాల్సిన వతుల గురించి అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, ఎంపీడీవో ఇస్సాకు హుస్సేన్, ఎంపీవో వెంకటేష్ పీఆర్ డీఈఈ చంద్రకళ, పీఆర్ ఏఈఈ దివ్యరాణి, పంచాయతీ కార్యదర్శులు గణేష్, శ్రీలత, అంగాన్వాడి టీచర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యకుడు గుండె వెంకట్ గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాలంగౌడ్, ఎన్ఎస్ యుఐ మండల అధ్యక్షుడు గోరేటి శివ, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, శంకర్ గౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, గుండె శివగౌడ్, జైపాల్, కందికంటి శ్రీనయ్యగౌడ్, కుకుడాల శ్రీనివాస్, ప్రశాంత్ నాయక్, కొండల్ గౌడ్, సురేందర్ రెడ్డి, వెంకటయ్య, వెంకటరెడ్డి, సహదేవ్, దశరథం. కృష్ణ, గణేష్, నజీర్, రవిగౌడ్, నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ పరిరక్షణ మన అందరి బాధ్యత

### డిఎస్పీ ఎన్ లింగయ్య

**నారాయణపేట జిల్లా బ్యూరో(జనం సాక్షి):**

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని నారాయణపేట డిఎస్పీ ఎన్.లింగయ్య అన్నారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించిందని, అందుకు ప్రతి సంవత్సరం నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని అంగీకరించిన సంవిదాన్ రోజుగా జరుపుకుంటామని తెలిపారు. మంగళవారం ఉదయం జిల్లా ఎస్పీ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించి, భారత రాజ్యాంగ పీఠికను పోలీస్ అధికారులు సిబ్బంది అందరు చదివారు. ఈ సందర్భంగా డిఎస్పీ నల్లపు లింగయ్య మాట్లాడుతూ 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని అధికారంకంగా ఆమోదించినందున ఈ రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది అప్పటినుంచి మనం గణతంత్ర దేశంగా మారమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. నరసింహ, ఎస్బి. సిఐ రామ్ లాల్, ఎస్ఐలు శివశంకర్, నరేష్, వసంత, సునిత, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యధలారూల వ్యవస్థ అరికట్టాలి

### పత్తికి మద్దతు ధర రూ. 7521 చెల్లించాలి

### డిఆర్ఓకు సిపిఎం వినతిపత్రం



**సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 26 (జనంసాక్షి)**

పత్తి క్వింటాలుకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రూ. 7521 రూపాయలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా డిఆర్ఓ పద్మజ రాణి కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా అత్యధిక పంట 3,70,000 ఎకరాలలో పత్తి సాగు అవుతుందని అన్నారు. అత్యధిక మంది రైతులు పత్తిలో అధిక పెట్టుబడులు పెట్టి, ఇటీవల కురిసిన వర్షాలకు పెద్ద ఎత్తున నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఇవ్వకుండా మధ్యధలారులు చేతికి అందిన కాడికి దోచుకుంటున్నారని విమర్శించారు. క్వింటాల్కు రూ. 6500 నుండి 6800 చెల్లిస్తూ దళారులు బాగుపడుతున్నారని అన్నారు సిసిఐ కొనుగోలు కేంద్రాల్లో కూడా రూ. 7,521 పూర్తిగా రావటం లేదన్నారు. రైతులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో రైతులను దోచుకుంటున్న మధ్యదలరులను వ్యవస్థను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రాజయ్య, శ్రీనివాస్, శేఖర్, నర్సిములు రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

### ప్రత్యేక అధికారి నూతన్ కుమార్

**కంగ్టి నవంబర్ 26 (జనం సాక్షి)**

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ప్రత్యేక అధికారి నూతన్ కుమార్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం కంగ్టి మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను నూతన్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులకు మంచి భోజనం అందించాలన్నారు. విద్యార్థుల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిచెన్ రూమ్, స్టోర్ రూమ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్తయ్య, ఎమ్మార్వో అబ్దుల్ నజీమ్ ఖాన్, డీఎల్పీవో,ఏపీవో సుభాష్, ఉపాధ్యాయుల సిబ్బంది పాల్గొన్నారు.

# డిసెంబర్ 7న అన్న ఏం చేస్తడో..!

- **రేవంత్ ప్రకటనపై గంపెడాశలు**
- **6 గ్యారెంటీలు అమలు చేయకుంటే అవస్థలే**
- **ఆందోళన చెందుతున్న కాంగ్రెస్ శ్రేణులు**



**వనపర్తి,నవంబర్26(జనంసాక్షి):**

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే మార్పు తెస్తానని నమ్మబలికిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఫ్రీబస్సు ప్రయాణం తప్పా ఏ ఒక్కటీ అమలు చేయలేదన్న విమర్శలు కొనసాగుతున్న వేళ ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా మిగిలిపోయిన 6 గ్యారెంటీల అమలు ప్రకటిస్తాడేమో అన్న గంపెడాశల్లో పార్టీ కార్యకర్తలు ఉన్నారు. రైతు పక్షపాతిగా చెప్పుకుంటున్న ప్రభుత్వం రుణమాఫీని పూర్తిస్థాయిలో చేయకపోవడం పంట పెట్టుబడుల కోసం గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం ఖరీఫ్ సీజన్లో అమలు చేయకపోవడం పట్ల పాలకుల చిత్తశుద్దిని రైతాంగం శంకిస్తోంది.

### కాంగ్రెస్లో అంతర్మథనం

ఏడాది సంబరాలంటూ ప్రజల్లోకి వెళ్లాలన్న అంతర్మథనం కాంగ్రెస్ నేతల్లో మొదలైంది. డిసెంబర్ 7 నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరి ఏడాది అవుతుంది. 9న సోనియాగాంధీ బర్త్డే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఏడాది పాలన సంబురాలు, సోనియా పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, చేసిన ఖర్చు తదితర సమగ్ర వివరాలతో ప్రోగ్రెస్ రిపోర్టు తయారు చేయాలని, విపక్షాల విమర్శలకు కౌంటర్ ఇచ్చేలా రిపోర్టు సిద్ధం చేయడంలో ముఖ్య నేతలు తలమునకలైనట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే, ఆరు గ్యారెంటీల అమలు, జాబ్ క్యాలెండర్, రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మ హాలక్ష్మి, చేయూత, రూ. 4 వేల నిరుద్యోగ భృతి, ఆడబిడ్డకు రూ. లక్షతోపా టు తులం బంగా రం.. వంటి ఏ ఒక్క పథకమూ అమలు కాకపోవడంతో ఏ ముఖం పెట్టుకుని ప్రజల్లోకి వెళ్లాలంటూ కాంగ్రెస్ నేతలు భయపడుతున్నారు.

### ప్రజలు నిలదీస్తారన్న భయం

మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం మినహా కాంగ్రెస్ ఏదీ అమలు చేయలేకపోయింది. ప్రతి మహిళకు నెలకు రూ. 2,500 అనే కీలక హామీపై ఎలాంటి ప్రకటనా లేదు. దీనిపై గ్రామాల్లో మహిళలు నిలదీస్తే ఏమని సమాధానం చెప్పాలో తెలియక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15,000, వ్యవసాయ కూలీలకు రూ.12,000 ఇస్తామన్న హామీ కూడా మూలన పడింది. రైతు భరోసా లేకపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. ఇందిరమ్మ పథకం కింద ఇంటి జాగ, రూ.5 లక్షల హామీ తో నియోజకవర్గానికి 3,500 చొప్పున రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చింది. విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కా ర్డు, ప్రతి మండలంలో ఇంటర్నేషనల్ స్కూ లు, పింఛను రూ.4000కు పెంపు వంటి హామీలు కూడా అటకెక్కాయి. ప్రభుత్వం వీటిపై ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో అన్న సందేహాల్లో కాంగ్రెస్ క్యాడర్ సతమతం అవుతున్నది. హామీలు అమలు కాకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లడగడానికి ప్రజలు నిలదీస్తారన్న భయం కాంగ్రెస్ శ్రేణుల్లో నెలకొంది.

### మభ్యపెట్టడం అసాధ్యం

రుణ మాఫీ రివర్స్ కావడంపై కాంగ్రెస్ నేత లు ఆందోళనతో ఉన్నారు. ఇంకా 22 లక్షల మంది రైతులకు మాఫీ కావాల్సి ఉండగా వారికి ఎప్పటిలోగా చేస్తారన్న దానిపై స్పష్టత లేదు. ఇది పూర్తిగా అమలైతే ప్రజల్లోకి వెళ్లేవారమని, కానీ ఇప్పుడు రైతులకు ముఖం చూపించే పరిస్థితి లేదని పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న హామీ కూడా ఎటూ కాకుండా పోయింది. బీఆర్ఎస్ హయాంలో వేసిన నోటిఫికేషన్లకు ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి తామే ఇచ్చుకుంటున్నామని గొప్పలు చెప్పుకుంటున్నా నమ్మేందుకు ఎవరూ సిద్ధంగా లేరని, ఇలా అన్నింటా విఫలమైన తర్వాత ప్రజలను ఇంకా మభ్యపెట్టడం అసాధ్యమని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు.

### అప్పులు తెచ్చి ఏం చేశారన్న విమర్శలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 11 నెలల కాలంలోనే ఏకంగా రూ. 87 వేల కోట్ల అప్పు చేశాడని, డిసెంబర్ 7న ప్రమాణ స్వీకారం చేసిన ఆయన సరిగ్గా 5 రోజులకు అంటే డిసెంబర్ 12న రూ. 1000 కోట్ల అప్పు తెచ్చారని, ఇందులోంచి రూపాయి కూడా సంక్షేమ పథకానికి వినియోగించలేదని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తుండగా, అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా అనుమానాల్లో ఉన్నారు. ఖజానాలో నిల్వ ఉన్న డబ్బును, అప్పుగా తెచ్చిన డబ్బును మొత్తం కలిపి, ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఖర్చు పెట్టిన ప్రభుత్వంలోని ఓ కీలక నేతకు కాంట్రాక్టు బిల్లు బకాయిల కింద చెల్లించినట్టు గాంధీ భవన్ వర్గాలే చెప్పుకుంటున్నాయి. అప్పటి నుంచి ప్రతి నెలా బాండ్లు తాకట్టు పెట్టో, కార్పొరేషన్లను తనఖా పెట్టో వేల కోట్లు అప్పులు చేస్తున్నారని, కనీసం ఈ డబ్బునైనా సంక్షేమ పథకాలకు వినియోగించి ఉంటే, రైతులు, మహిళలు బాగుపడేవారని అంటున్నారు.

### తనదైన ముద్ర వేసుకున్న కేసీఆర్

కాళేశ్వరం ప్రాజెక్టు, 24 గంటల ఉచిత విద్యుత్తు, రైతుబంధు, మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి పథకాలు చేపట్టి ముఖ్యమంత్రిగా కేసీఆర్ తనదైన ముద్ర వేసుకున్నారు. కానీ, కాంగ్రెస్ ఏడాది పాలనలో చెప్పుకునేందుకు ఒక్క సంక్షేమ పథకమూ లేదు. పైపెచ్చు మూసీ కూల్చివేతలు, లగచర్ల గిరిజనుల భూములు గుంజుకోవడం వంటి ఘటనలతో ప్రజల్లో పార్టీ ప్రతిష్ఠ మసకబారింది. ఈ నేపథ్యంలో ఏ ముఖం పెట్టుకుని ఉత్సవాలను తొలుత రెండు వారాలు నిర్వహించాలనుకున్నా, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫిర్యాదుల నేపథ్యంలో వారానికి కుదించినట్టు తెలిసింది. కానీ ఏడాది పాలన విజయోత్సవ కార్యక్రమాల పై ఇప్పటి వరకు ఎలాంటి ఎజెండా లేదని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు.



# మహబూబ్ నగర్లో జరిగే రైతు పండుగను విజయవంతం చేయండి

### రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)**

ఈనెల 28,29,30 తేదీల్లో మహబూబ్ నగర్లో నిర్వహించే రైతు పండుగ విజయవంతంగా నిర్వహించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు కలసి పనిచేయాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణా రావు, దామోదర్ రాజా నర్సింహాలు అన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో ఈనెల 28,29,30 తేదీలలో నిర్వహించే రైతు సదస్సు ఏర్పాట్లపై నేడు సచివాలయంలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణా రావు, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్, కలెక్టర్లు, ఎస్పిలు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్బంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ సంవత్సర కాలంలో రాష్ట్ర ప్రభుత్వం మరే రంగానికి లేని విధంగా వ్యవసాయ రంగానికి అధిక మొత్తం నిధులు కేటాయించిందని, ముఖ్యంగా రైతు రుణ మాఫీతో రాష్ట్రంలోని ప్రతీ అసెంబ్లీ నియోజక వర్గంలో కనీసం 20 వేల మంది నుండి 30 వేల మంది రైతులకు లబ్ది చేకూరిందని గుర్తు చేశారు. ఈ సమీక్ష సమావేశానికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ కె.దామోధర్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మేఘా రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీ కృష్ణ, పర్ణిక రెడ్డి, ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస రాజు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, జిఏడి కార్యదర్శి రఘునందన్, టీజీఎస్పిడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ ఫరూఖీ, సమాచార శాఖ స్పెషల్ కమీషనర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# చిట్టీల పేరుతో కుచ్చుటోపి!

- అధిక వడ్డీ పేరుతో 80 మందికి కుచ్చు టోపీ
- సైబరాబాద్ పోలీసుల అదుపులో నిందితుడు

**శేరిలింగంపల్లి, నవంబర్ 26 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్‌ను ఓవైపు కల్తీ పదార్థాలు నగర ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తుంటే.. మరోవైపు ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేస్తూ అందినకాడికి దోచేసి వారికి కుచ్చు టోపీలు పెట్టడం ఆనవాయితీగా మారుతుంది. మోసం ఈ రకంగా కూడా చేయవచ్చా... అనేంతలా కొందరు దుర్మార్గులు రెచ్చిపోయి మరి ప్రజల సొమ్మును దిగమింగేస్తున్నారు. సోమవారం "ఆర్ హెమ్స్ ఇన్ఫ్రా డెవలపర్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ ఏకంగా 200 మంది వినియోగదారులను ముంచి 48 కోట్ల రూపాయలను దండుకున్న సంఘటనను మరువక ముందే సైబరాబాద్ కమిషనరేట్ ఆర్థిక నేరాల విభాగం డిప్యూటీ కమిషనర్ కె. ప్రసాద్ మంగళవారం మరో సంచలనాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం... శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ పరిధిలో నివాసముండే అప్పంపల్లి సూర్య ప్రతాపరెడ్డి గత 14 సంవత్సరాలుగా ప్రైవేటు చిట్టీల వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. నమ్మకంగా చిట్టి లేసిన వినియోగదారులకు సమయానుకూలంగా డబ్బులు అందజేస్తూ మంచి నమ్మకాన్ని సంపాదించుకున్నారు. ఈ క్రమంలో చందానగర్‌తో పాటు మియాపూర్, బీహెచ్‌ఈఎల్, కూకట్పల్లి, శేరిలింగం పల్లి తదితర ప్రాంతాల నుండి పెద్ద మొత్తంలో చిట్టీల కస్టమర్లు ఆయన వద్ద సభ్యులుగా చేరారు. కాగా చందానగర్ ప్రాంతానికి చెందిన నాసర్ ఖాన్ అదే నమ్మకంతో ప్రతాప్ రెడ్డి వద్ద చిట్టిని వేయడం జరిగింది. ప్రధానంగా లక్ష రూపాయలు, 2 లక్షలు, 5 లక్షలు, 10 లక్షలు, 25 లక్షల రూపాయల విలువ గలిగిన చిట్టీలను నెలవారి చెల్లింపులతో సూర్యప్రతాప రెడ్డి కొనసాగిస్తుండడంతో నాసర్‌ఖాన్‌లాంటివారు ఎంతోమంది వివిధ విభాగాల లో చిట్టీలను వేసి టర్మ్ అయిపోయిన వారు చిట్టి మొత్తాల కోసం ఎదురుచూస్తున్న తరుణంలో సూర్య ప్రతాప్ రెడ్డి అకస్మాత్తుగా అదృశ్యం కావడంతో మోసపోయినట్టు గ్రహించిన చిట్టీల వినియోగదారులు సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలోని ఆర్థిక నేరాల విభాగం పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కర్మన్ ఘాట్ లో ఉన్నట్టుగా కనుగొన్న సైబరాబాద్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకొని మంగళవారం రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పేదలకు మెరుగైన జీవితం కోసమే ఐక్యత పౌండేషన్ ఆరాటం

- శంకర నేత్రాలయం చెన్నై ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం
- ప్రజలకు సేవ చేయడంలోనే సంతృప్తి
- ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి.ఓ.ఓ.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**తలకొండపల్లి(ఆమనగల్)నవంబర్ 26(జనంసాక్షి):** మానవసేవే మాధవసేవ..పేద ప్రజలు అనారోగ్యంతో ఉన్న వారిని ఆదుకోవడంలో ఉన్న తృప్తి మరి దేనిలోనూ కనిపించదు అని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి.ఓ.ఓ.సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. గత 8,రోజులుగా నిరుపేద ల కోసం నిరంతరాయంగ సేవలు అందిస్తున్న ఐక్యత ఫౌండేషన్,శంకర నేత్రాలయ చెన్నై ఆధ్వర్యంలో ఆమనగల్ పట్టణ కేంద్రంలో శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్ నందు ఏర్పాటు చేసిన ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి పరీక్షలను ఉచితంగా చేసి అద్దాలను అందజేయడంతో పాటు కంటి శుక్లాల ఆపరేషన్లను 119 మందికి పూర్తి చేశారు.ఈ శిబిరంలో మొత్తంగా 5000 మందికి పైగా శిబిరాన్ని సందర్శించగా వారిలో 4500 మందికిపైగా కంటి పరీక్షలు నిర్వహించగా,దాదావు 3000 మంది పేషెంట్లకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామని,ఇంత పెద్ద మొత్తంలో మా ఈ ఉచిత శిబిరం సేవలు అందించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఇంకా ఇలాంటి మరెన్నో సేవా కార్యక్రమాలతో ఐక్యత ఫౌండేషన్ సేవలు ముందుకు తీసుకెళ్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు, నరేందర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి,చంద్ర శేఖర్, శ్రీను, కొండల్ రెడ్డి, అభినవ్ రెడ్డి, మల్లయ్య, రమేష్ నాయక్, శేఖర్, యాదయ్య, రఘు, శ్రీపతి, మహేష్, భాస్కర్, కళ్యాణ్‌లతో పాటు పాల్గొన్నారు.

# మారుమూల గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

## చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**నవాబుపేట నవంబర్ 26 (జనం సాక్షి)**
మారుమూల గ్రామాల అభివృద్ధికి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీ పథకాలను పథకాలను అమలు చేసే బాధ్యత తనచే అన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు మంగళవారం నవాబుపేట మండలంలోని చించల్ పేట గ్రామంలో ప్రజా పాలన వారోత్సవాల్లో భాగంగా సిసి రోడ్డు పనులకు ఆయన ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలుపడుతున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో నవాబుపేట



మార్కెట్ కమిటీ చైర్మన్ రాథోడ్ గీతా సింగ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మొహమ్మద్ ఖదీర్ నరసింహారెడ్డి గంగాడ నాగిరెడ్డి పిఎసిఎస్ చైర్మన్ రామిరెడ్డి గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ మాజీ జెడ్పిటిసి జయమ్మ మాజీ ఎంపీపీ భవాని మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు

# సంక్షేమ పథకాలను సరైన సమయంలో ప్రజలకు అందించాలి

- ప్రజలకు సంక్షేమ పథకాలు చేరే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి నవంబర్ 26(జనంసాక్షి):**

నియోజకవర్గంలోని కూకట్‌పల్లి, బాలానగర్ ఎమ్మార్వో కార్యాలయంలో 534 లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ నిన్న అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినందుకు నేడు లబ్ధిదారులకు చెక్కులను అందజేశారన్నారు. చెక్కులు ఇవ్వకుండా నెల రోజులుగా అధికారులు మంత్రి రాక కోసం నిలిపివేసిన కొంతమంది గ్రూపులలో చెక్కులు వచ్చి వారం రోజులు అవుతుందని వాట్సప్ గ్రూపులలో తప్పుడు ప్రచారం చేయడం సరైనది పద్ధతి కాదని రాజకీయాల మధ్యన ప్రజలను లాగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలని అదేవిధంగా రాబోయే రోజుల్లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సంక్షేమ పథకాలు అందజేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందడి శ్రీనివాస్, శిరీష బాబురావు సబిహా గౌసుద్దీన్, జూపల్లి సత్యనారాయణ, రవీందర్ రెడ్డి, సతీష్ గౌడ్, నరసింహ యాదవ్, మాజీ కార్పొరేటర్లు బాబురావు తూము శ్రావణ్ పాల్గొన్నారు





# అతిపెద్ద లిఖిత రాజ్యాంగం భారత రాజ్యాంగం

కొడంగల్, నవంబర్ 26 (జనం సాక్షి): ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని అంబేద్కర్ సంఘాల నాయకులు కొనియాడారు.రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని,కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు యు.రమేష్ బాబు మాట్లాడుతూ.. అన్ని కులాలు, మతాల కతీతంగా సమానత్వం, స్వేచ్ఛ,లౌకిక, ప్రజాస్వామ్య విలువలను పొందుపరిచి దేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహోన్నత మూర్తి డా"బిఆర్ అంబేద్కర్ అని గుర్తు చేశారు. రాజ్యాంగం ద్వారా ఆయన అందించిన ఫలాలే నేటి సమానత్వం, విద్య, ఉద్యోగం, సమసమాజ అభివృద్ధి అని అన్నారు. రాజ్యాంగం ప్రకారమే అందరికీ అన్ని రకాల అవకాశాలు దక్కుతున్నాయన్నారు. గవర్నర్ నుంచి గరీబు వారి వరకు ఒకే విధమైన న్యాయం, అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని అన్నారు. ఈకార్యక్రమంలో బిఎస్పి పార్టీ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్వప్ప, అంబేద్కర్ సంఘాల నాయకులు అన్నారం సాయిలు.పి. వెంకటయ్య, ఎండీ బషీర్,బి.సాయిలు, జి.సాయిలు, యూ.శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్లో ఘనంగా "భారత రాజ్యాంగ దినోత్సవం"

- 75 ఏండ్లు గడిచిన అగ్రవర్ణాలదే రాజ్యాధికారం
- దళిత,బహుజనులు అభివృద్ధి చెందేది ఎప్పుడు?

బోడుప్పల్-జనంసాక్షి: అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ముత్తయ్య, ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు వంగ ప్రణయ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ ముత్తయ్య మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతదేశానికి అందించాడని,ప్రతి భారతీయుడు రాజ్యాంగబద్ధంగా నడుచుకోవాలని 75 ఏండ్లు గడచిన ఇంకా అగ్రవర్ణాల ఆధిపత్యం కొనసాగుతుందని,దళిత బహుజనులు ఏకమై రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. టైం ఇస్ నాలెడ్జ్ అని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చెప్పినట్టు నేటి యువత సమయాన్ని వృధా చేయకుండా పుస్తకాలు చదివి విజ్ఞానాన్ని పొందాలని అన్నారు.బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో పాలకవర్గం రాజ్యాంగ దినోత్సవం జరపకపోవడం, ఏ ఇతర రాజకీయ పార్టీలు కూడా బోడుప్పల్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించకపోవడం చాలా బాధాకరమని, అంబేద్కర్ కృషి,త్యాగ ఫలితమే నేడు పదవులు,ఉద్యోగాలు, అనుభవిస్తున్నామని నత్తి మైసయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో సాయి బండారి,ఆర్ సంజీవ,గరుగుల యాకయ్య,గరుగుల అఖిల్,గరుగుల స్వర్ణరాజ్, కంచి సతీష్,జంగిటి చందు, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రిజొనెన్స్ వస్త్రశ్రేణిని ఆవిష్కరించిన స్వప్న అనుమోలు

**ఖైరతాబాద్, నవంబర్ 26 (జనం సాక్షి) :**
హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వస్త్ర విక్రేత స్వప్న అనుమోలు బంజారా హిల్స్‌లోని తన 'ద మిశ్రు స్టోర్‌లో రిజొనెన్స 2024/25 కలెక్షన్'ను మిశ్రు వ్యవస్థాపకురాలు, క్రియేటివ్ డైరెక్టర్ అయిన స్వప్న అనుమోలు ఆవిష్కరించారు. తొలుత దీన్ని న్యూఢిల్లీలో ఆవిష్కరించి, అనంతరం హైదరాబాద్ వాసులకు పరిచయం చేశామన్నారు. కేవలం ఫ్యాషన్ మాత్రమే కాక మల్టీసెన్సరీ అనుభవాన్ని, అద్భుతమైన డిజైన్ల సంకలనాన్ని ఇది అందిస్తు న్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా స్వప్న అను మోలు, సోనా రెడ్డి రూపొందించిన వైల్డ్ స్కేప్స్ అనే వస్త్ర ప్రదర్శన జరిగిందన్నారు. మిశ్రుస్టోర్‌లో ఎవరికి కావల్సిన కలెక్షన్లు వారికి అందుబాటులో ఉన్నాయన్నారు. మిశ్రులో ఉన్న కలెక్షన్లలో 3డి ఎంబ్రాయిడరీ, పార్సీ-సుజిని-ఇన్‌స్పైర్డ్ డీటైలింగ్ సహా అనేక పద్ధతులు ఉన్నాయ న్నారు. ఇది రంగు, రూపాల మంత్ర ముగ్ధులను చేసే అద్భుతమైన లేయరింగ్ టెక్నిక్ తో ముగిసిందన్నారు. నిరంతరం అభివృద్ధి చెందుతున్న ప్రకృతి దృశ్యాల నుంచి ప్రేరణ పొందిన ఈ కలెక్షన్లు అత్యంత వైబ్రెంట్‌గా ఉంటాయన్నారు.

# సర్వేకు అందరు సహకరించాలి

## మండల అభివృద్ధి అధికారి సంధ్య.



**మొయినాబాద్, (జనం సాక్షి):** ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా మొయినాబాద్ మండలంలో సర్వేలో గుర్తించిన 17,799 ఇళ్లు పూర్తి అయ్యాయని అదనంగా అక్కడక్కడ ఉన్న ఇళ్లను కూడా గుర్తించిన వాటితో పాటు సర్వే నిర్వహిస్తున్నామని మండల అభివృద్ధి అధికారి సంధ్య పేర్కొన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సర్వేలో భాగంగా మొయినాబాద్ మండలంలో ముందుగా రెండు రోజులు ఇళ్లను గుర్తించడం జరిగిందన్నారు. గుర్తించిన ఇళ్లు పూర్తి చేయడంతో పాటు అక్కడక్కడ డోర్ లాక్, మిగిలి ఉన్న వాటిని మరో రెండు రోజులు సర్వే నిర్వహిస్తామని పై అధికారుల సూచనల మేరకు చేపడుతున్నట్లు తెలిపారు. సర్వేలో సమాచారం ఇవ్వని వారు మీ గ్రామాల్లో అధికారులు ఉంటారని వారికి సహకరించి వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు.సర్వేకు అందరు సహకరించాలి.ప్రభుత్వం ద్వార ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించి పూర్తి వివరాలు ఇవ్వాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఫిషర్మెంట్ చైర్మన్ మహేందర ముదిరాజ్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాకారం గ్రామంలో మహేందరముదిరాజ్ నివాసంలో సర్వేకు వచ్చిన అధికారులకు పూర్తి వివరాలు అందజేసిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టడం అభినందనీయ మన్నారు. కుటుంబ సర్వేలో పూర్తి వివరాలు ఉంటాయని సూచించారు. అధికారులకు సహకరించి సర్వేలో పాల్గొనాలని పేర్కొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

- ప్రజా పాలనలో విద్యా ప్రమాణాలకు పెద్దపీట
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి

**తలకొండపల్లి నవంబర్ 26(జనంసాక్షి):**
కాంగ్రెస్ ప్రజాపాలనలో విద్యా ప్రామాణాలకు అధిక ప్రాధాన్యమిస్తూ ఇంటగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి పూనుకోవడం చాలా సంతోషమని మండల కాంగ్రెస్ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి అన్నారు.స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆదేశాలతో తలకొండపల్లి మండల శివారులోని ఖానాపూర్ రెవెన్యూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు మంజూరు చేయడంతో హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి,ఎంపీ మల్లు రవి,స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,చిత్రపటాలకు మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా డోకూరు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మండల ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి అధునాతనమైన రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం,190 విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేయించడం గొప్ప విషయం అన్నారు.తలకొండపల్లి మండలానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను మంజూరు చేయించడంలో విశేషంగా కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి,మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్,ఏఎంసి డైరెక్టర్ ఎండి అజీమ్,బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి డిగ్రీకృష్ణ,మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నకేశవులు,మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అరిఫ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డేవిడ్, రేణు రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్,తుమ్మ నరసింహ,చిన్న హరి మోహన్ రెడ్డి,కాకి కృష్ణ,మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్,వెంకటయ్య,పవన్ వాల్మీకి,శంకర్,తదితరులు పాల్గొన్నారు.



# సంతానోత్పత్తిపై వయస్సు ప్రభావం



**ఖైరతాబాద్, నవంబర్ 26 (జనం సాక్షి) :** సంతానోత్పత్తిపై వయస్సు ప్రభావం పట్ల అవగా హన అవసరం అని అంకురా హాస్పిటల్ ఫర్ మెన్ అండ్ చిల్డ్రన్ కన్సల్టెంట్ ఫెర్టిలిటీ డా.షాలినీ సింగ్ అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. భావన అనేది వయస్సు, జన్యుశాస్త్రం, జీవనశైలి, పర్యావరణం ద్వారా ప్రభావితమైన సంక్లిష్ట ప్రక్రియ అని, వయస్సు సంతానోత్పత్తిని ఎలా ప్రభావితం చేస్తుందో అర్థం చేసుకోవడం వారి కుటుంబాన్ని ప్రారంభించడం లేదా విస్తరించడం గురించి ఆలో చించే వారికి కీలకం అన్నారు. గవర్నమెంట్ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ ఇంప్లిమెంటేషన్, భారత ప్రభుత్వం ప్రకారం, 'విమెన్ అండ్ మెన్ ఇన్ ఇం డియా 2023' అనే ప్రచురణ-2016 నుండి 2020 వరకు, 20-24, 25 సం.ల వయస్సులో వయస్సు నిర్దిష్ట సంతానోత్పత్తి రేటు స్పష్టంగా ఉందన్నారు. -29 135.4, 166.0 నుండి 113.6, వరుసగా 139.6. పైన పేర్కొన్న కాలానికి 35-39 సం.ల వయస్సు గల ఏఎస్ఎఫ్ఆర్(వయస్సు-నిర్దిష్ట సంతానోత్పత్తి రేటు) 32.7 నుండి 35.6కి పెరి గిందన్నారు. ఇది తరువాత జీవితంలో సంతా నోత్పత్తికి డిమాండ్‌ను చూపుతుందన్నారు. ఈ ధోరణి వయస్సుతో పాటుగా పురుష, స్త్రీ సంతా నోత్పత్తిని సమీక్షించడాన్ని ప్రోత్సహిస్తుందన్నారు.

# ఇస్లావత్ శ్రావ్య కుటుంబానికి న్యాయం చేయాలి

## న్యాయ శాస్త్ర విద్యార్థిని లైంగికంగా వేధించి హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



**చంపాపేట్, నవంబరు 26 (జనంసాక్షి) :** ఏఐఎఫ్‌డివై రాష్ట్ర నాయకులు ఇస్లావత్ దశరథ్ నాయక్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు . మలక్ పేట్ లో రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం తక్రాజ్ గూడా తాండకు చెందిన బంజారా నిరుపేద కుటుంబమైన ఇస్లావత్ రమేష్ కంసీ దంపతులు కూలి పనులు చేస్తూ రూపాయి రూపాయి కూడా గట్టి కూతురిని న్యాయ శాస్త్రం చదివిస్తున్నారు. ఎల్బీనగర్‌లో మహాత్మా గాంధీ లా కాలేజీలో మూడో సంవత్సరం చదువుతున్నది ఓ సీనియర్ న్యాయవాది దగ్గర జూనియర్‌గా ఉంటూనే కుటుంబం పేదరికంలో ఉండడం వల్ల మలక్ పేట్ మూసరంబాగులోని ఓ ఎడ్యుకేషన్ కన్సలేన్సులో పార్ట్ జాబ్ చేస్తుంది ఆదివారం కన్సల్టెన్సీ యాజమాని నవీన్ కార్యాలయం లో ఫ్యాన్ కు ఉరి వేసుకొని శ్రావ్య ఆత్మహత్య చేసుకొని మృతి చెందింది.అయితే శ్రావ్య ది ఆత్మహత్య కాదని లైంగిక వేధించి హత్య చేశారని అనుమానాలు వ్యక్తమయ్యాయి,శ్రావ్య మృతికి కారకులైన నిందితుడు నవీన్ అతనికి సహకరించిన వారిని విచారణ జరిపి,అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, శ్రావ్య కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, న్యాయ శాస్త్రం చదువుతున్న ఇస్లావత్ శ్రావ్య కుటుంబానికి ముఖ్యమంత్రి గారు స్పందించి న్యాయం చేయాలని ఏఐఎఫ్‌డివై రాష్ట్ర నాయకులు ఇస్లావత్ దశరత్ నాయక్ డిమాండ్ చేశారు.

# ప్రజాపాలన విజయోత్సవం, రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

**బొంరాస్ పేట, నవంబర్ 26 (జనం సాక్షి):** మండల పరిధిలోని చౌదర్పల్లి గ్రామంలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవం, రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వికారాబాద్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ శేరి రాజేష్ రెడ్డి ఉపాధి హామీ పథకంలో భాగంగా నూతన నర్సరీ, పశువులపాక ఏర్పాటుకు సంబంధించి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు జయకృష్ణ,ఎంపీడీవో వెంకన్ గౌడ్, ఎంపీఓ మహేష్ కుమార్,ఏపీవో మల్లికార్జున్ యాదవ్, పిఆర్ ఏఈ సురేందర్ రెడ్డి, ఈసీ ఇలియాస్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింలు గౌడ్,నాయకులు రాంచంద్ర రెడ్డి,మల్లేశ్,నరసింహ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# మూసీలోకి వదులుతున్న కెమికల్ ఆయిల్ ట్యాంకర్ సీజ్

**రాజేంద్రనగర్,నవంబర్26(జనం సాక్షి) :**
రాజేంద్రనగర్ అత్తాపూర్ బాబు గాట్ బ్రిడ్జి వద్ద మూసి లోకి వదులుతున్న కెమికల్ ఆయిల్ ట్యాంకర్‌ను రాజేంద్రనగర్ పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని సీజ్ చేశారు.తాండూర్ కర్ణాటక పటాన్ చెరువు, షాద్నగర్ ఇండస్ట్రీల నుండి తెచ్చిన ప్రమాదకరమైన కెమికల్స్ ను గుట్టుచప్పుడు కాకుండా మూసీలో వదులుతున్నారు. మూసీ వెంబడి ఖాళీ స్థలంలో కబ్జా చేసి అందులో ఇసుక వ్యాపారం లారీల పార్కింగ్ పెట్టి ఎవరికి అనుమానం రాకుండా ఆ స్థలం నుండి మూసీలోకి ఏకంగా పైప్ లైన్ ను ఏర్పాటు చేసిన ఇసుక దందా యజమానులు. ఆ పైప్ లైన్ ద్వారా ప్రతిరోజు కనీసం 8 నుండి 10 భారీ ట్యాంకర్లను తెచ్చి కెమికల్స్‌ని మూసీలో వదులుతున్నారని పోలీసులు గుర్తించారు.లారీలు రావడం గమనించిన స్థానికులు పట్టుకునే ప్రయత్నం చేయగా నాలుగు లారీలతో పాటు పారిపోయారు. సంఘటన స్థలానికి చేరుకున్న రాజేందర్ పోలీసులు లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# నిఘా నేత్రాల ఏర్పాటుతో నేరాలను అరికట్టవచ్చు

- నిఘా నేత్రాల ఏర్పాటుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 67,వేలు ఆర్థిక సాయం
- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి



**తలకొండపల్లి నవంబర్26(జనంసాక్షి):**
గ్రామీణ ప్రాంతాల్లో నేరాల సంఖ్యను తగ్గించడానికి ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని తలకొండపల్లి ఎస్సై ఏ.శ్రీకాంత్ కోరారు.తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి రూ,50 వేలు,గట్టు ఇప్పలపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రేణురెడ్డి రూ,10 వేలు,కర్కాస్ తండా నాయకులు శంకర్ రూ,5 వేలు,రాజేందర్ నాయక్ రూ 2,వేలు,మొత్తం కలిపి రూ,67 వేల రూపాయలను ఎస్సై శ్రీకాంత్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులను ఎస్సై అభినందించారు.ఈ కార్యక్రమం లో కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు మోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు,జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండి అజీమ్,బ్లాక్ కాంగ్రెస్ కార్యదర్శి డిగ్రీకృష్ణ,మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు చెన్నకేశవులు,మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి అరిఫ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు డేవిడ్, రేణురెడ్డి,మాజీ ఎంపీటీసీ రాములు,పడకల్ మాజీ ఎంపీటీసీ జోగు రమేష్,మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, రాంపూర్ చిన్న హరి మోహన్ రెడ్డి,కాకి కృష్ణ,ప్రదీప్ రెడ్డి,బీసా శ్రీనివాస్ రెడ్డి,పవన్ వాల్మీకి,శివ తదితరులు పాల్గొన్నారు.



## దూలపల్లి పారిశ్రామిక వాడలో

# భారీ అగ్ని ప్రమాదం

**కుత్బుల్లాపూర్ నవంబర్ 26 (జనం సాక్షి) :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దూలపల్లి పారిశ్రామికవాడలో మంగళవారం సాయంత్రం ఓ ప్లాస్టిక్ బ్యాగుల తయారీ కంపెనీలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. క్షణక్షణం ప్రమాద తీవ్రత పెరిగి మంటలు భారీ ఎత్తున ఎగిసిపడుతున్నాయి. సాయంకాలం నుండి 7 ఫైర్ ఇంజన్లు మంటలను ఆర్పడానికి ప్రయత్నిస్తున్న ఫలితం లేకుండా పోయింది . ఈ అగ్ని ప్రమాదంపై అధికారులు ఇప్పటివరకు స్పందించలేదు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 నవంబర్ 2024
తెలంగాణ

# రాజ్యాంగం సామాన్య ప్రజలకు ప్రాథమిక హక్కుల రక్షణ కల్పించింది

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ బ్యూరో,నవంబర్ 26,(జనంసాక్షి) :** భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తెలంగాణ శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనేక రాజ్యాంగాలను అధ్యయనం చేసిన తర్వాత వివిధ రాజ్యాంగంలోని మేలిమి విషయాలను క్రోడీకరించి భారత దేశ పరిస్థితులకు అన్వయించి సిద్ధం చేసిన రాజ్యాంగాన్ని 75 సంవత్సరాల కిందట ఆమోదించడం జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.భారత రాజ్యాంగ పరిషత్ అధ్యక్షులుగా బాబు రాజేంద్ర ప్రసాద్ రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భారతీయులకు నిరంతరం స్మరణీ యులుగా మిగిలిపోయారన్నారు. సామాన్య ప్రజలకు ప్రాథమిక హక్కుల రక్షణ కల్పించిన గొప్ప రాజ్యాంగం భారత రాజ్యాంగమని ఈ సందర్భంగా కొనియాడారు.ప్రస్తుతపు రోజుల్లో అందరికీ సమానత్వం అనేది ఒక సాధారణమైన అంశంగా చూస్తూ ఉన్నప్పటికీ 75 సంవత్సరాల కింద అందరికీ సమానత్వం,సార్వత్రిక ఓటింగ్ అనేవి ఒక విప్లవాత్మకమైన నిర్ణయాలే అని చెప్పారు.భారత పౌరులుగా రాజ్యాంగ స్ఫూర్తితో నడుచుకోవడం ఒక గర్వ కారణమైన విషయంగా భావించవలసి ఉంటుందని, కాలానుగుణంగా సందర్భ అవసరాలను బట్టి అనేక సవరణలకు అవకాశం కూడా ఇచ్చిన రాజ్యాంగం మనదన్నారు.అందువల్లే ఇప్పటి వరకు వందకు పైగా రాజ్యాంగ సవరణలు చేసుకోవడం జరిగిందని తెలిపారు. సాధారణ పరిస్థితులలో సమాఖ్య పద్ధతిని విపత్కర సమయాలలో కేంద్రీకృత విధానాన్ని స్వీకరించిన భారత రాజ్యాంగం వల్లనే భారతదేశం అభివృద్ధి చెందని దేశము నుండి అభివృద్ధి చెందుతున్న దేశాలలో అగ్రగామి దేశంగా మారిన సంగతి గుర్తు చేసుకోవలసిన అవసరం ఉందని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు.

# మధ్యాహ్నం భోజన పథకంను పకడ్బందీగా అమలు చేయాలి

కలెక్టర్ హనుమంతరావు





**భువనగిరి కలెక్టర్, నవంబర్ 26 (జనంసాక్షి):** పట్టణం లోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజన పథకంలో వండిన వంటను పరిశీలించారు. మంచిగా వున్నాయని, రోజు ఇదే విధంగా ఉండాలని సంబం ధిత అధికారులకు తెలిపారు. విద్యార్థులకు కలెక్టర్ స్వయంగా వడ్డించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహార విషయంలో శుచి, శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను తప్పు కుండా పాటిస్తూ పప్పు, కూర గాయలు, ఆకుకూర లను వండాలన్నారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు. ఉపాధ్యా యులు విద్యార్థులపై ఒత్తిడి లేకుండా విద్యను బోధించాలన్నారు. పదవ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పదవ తరగతిలో వెనకబడుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు.మన ఊరు మనబడి లో అసంపూర్తిగా మిగిలి ఉన్న పనుల వెంటనే మొదలు పెట్టాలని పంచాయతీరాజ్ .ఇ ఇ కి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ రేణుక, ఇంచార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు మూర్తి,విజశ్రీ వాణి, రామలింగయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

రాజ్యాంగ పరిరక్షణ తన వంతు కృషి చేస్తా : కలెక్టర్ ఇలా త్రిపాటి





**నల్లగొండ బ్యూరో,నవంబర్ 26,(జనంసాక్షి) :**
భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావే మందిరంలో భారత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు.ఈ సందర్భంగా ఆమె రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ రాజ్యాంగ పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానని,దేశ సమగ్రత కు కట్టుబడి ఉంటానని ప్రతిజ్ఞ చేయించారు. కాగా మంగళవారం రాష్ట్ర విద్యా కమిషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్,విశ్రాంత ఐఏఎస్ అధికారి ఆకునూరు మురళి, సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్, వెంకటేష్,జోష్నా రెడ్డి,అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ అమరేందర్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న విద్యావేత్తలు, మేధావులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు,విద్యార్థులు,తల్లిదండ్రులు,తదితరులు ఈ ప్రతిజ్ఞలో పాల్గొన్నారు.



# కేసులు ఫిర్యాదులు పెండింగ్ లేకుండా పని చేయాలి

- యాంటీ ర్యాగింగ్ కార్యక్రమాలు సైబర్ మోసాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి
- ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలి : జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** కేసులు, ఫిర్యాదులు పెండింగ్ లేకుండా పని చేయాలని, నాణ్యమైన దర్యాప్తు చేపట్టి ఫిర్యాదులపై త్వరగా స్పందించాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు.మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని అన్నారు. నేరాల నియంత్రణకు జిల్లా వ్యాప్తంగా కార్డన్ అండ్ సెర్చ్ లు, తనిఖీలు, పటిష్టమైన పెట్రోలింగ్, పోలీస్ బీట్స్ నిర్వహించాలని, అనుమానితులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ర్యాగింగ్ లాంటి చట్టవ్యతిరేక సంఘటనలు జరగకుండా కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని,ర్యాగింగ్ నిరోధక చట్టాల గురించి విద్యార్థుల్లో అవగాహన కల్పించాలని అన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, అపరిచితులకు వ్యక్తిగత బ్యాంక్ ఖాతా వివరాలు చెప్పవద్దని, అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి విరాళాలు, బహుమతులు ఇస్తామంటే నమ్మవద్దని సూచించారు.సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీసు వాహనాల నాణ్యతను పరిశీలించారు. వాహనాలు కండిషన్ లో ఉండాలని తెలిపారు. మహిళా భద్రత, రక్షణకు సంబంధించి షీ టీమ్ అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.మహిళా భద్రత రక్షణ విషయంలో జిల్లాలో షీ టీమ్ పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. కోదాడ, సూర్యాపేట సబ్ డివిజన్ ల పరిధిలో షీ టీం ఆధ్వర్యంలో మహిళా, విద్యార్థుల భద్రత, చట్టాల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. షీ టీమ్ సిబ్బంది బాగా పని చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, డీఎస్పీ రవి, డీసీఆర్బీ డీఎస్పీ మట్టయ్య, సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస రావు, ఏఆర్ డీఎస్పీ నరసింహ చారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ వీర రాఘవులు, డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ హరిబాబు, సీఐలు రాజశేఖర్, సురేందర్ రెడ్డి, రజిత రెడ్డి, రాము, రామకృష్ణారెడ్డి, శ్రీను, రఘువీర్ రెడ్డి, చరమంద రాజు, లక్ష్మీనారాయణ, ఎస్ఐలు, డీసీఆర్బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ.వి.ఎం.లు ట్యాంపరింగ్ చేయబడవు

కలెక్టర్ హనుమంతరావు



**భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 26 (జనంసాక్షి)**
ఎన్నికలలో వినియోగించే ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈ.వి.ఎం.) ట్యాంపరింగ్ చేయబడవని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించిందని జిల్లా ఎన్నికల అధికారి, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఒక ప్రకటనలో తెలిపారు.
భారత ఎన్నికలలో పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కొట్టి వేసిందని, ఈ.వి.ఎం. ట్యాంపరింగ్ పై పిటిషనర్ చేసిన వాదనలను న్యాయస్థానం తిరస్కరించిందని తెలిపారు. ఎన్నికలలో ఓడిపోయినప్పుడు మాత్రమే ఈ.వి.ఎం.ల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిరతను ఎత్తి చూపిందని తెలిపారు.

# ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**12 లక్షల వ్యయంతో నిర్మించే నూతన అంగన్వాడి కేంద్రానికి శంకుస్థాపన**

**శివన్నగూడెంలో త్వరలోనే మహిళా సమాఖ్య భవన్, సబ్ సెంటర్, రెండు అంగన్వాడి కేంద్రాలకు కొత్త భవనాలు నిర్మిస్తామని హామీ**

**భూ నిర్వాసితుల ఇండ్ల నిర్మాణానికి అధికారులు అనుమతినివ్వాలి**

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**



**మర్రిగూడ, నవంబర్ 26,( జనంసాక్షి) :** ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి, మర్రిగూడ మండలంలోని శివన్న గూడ లో 20 లక్షల వ్యయంతో నిర్మించే నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, కొట్టాలలో 12 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న అంగన్వాడి కేంద్రానికి శంకుస్థాపన చేసిన మునుగోడు శాసనసభ్యుల కోమటిరెడ్డి రాజ గోపాల్ రెడ్డి,పాత గ్రామపంచాయతీ భవన ఆవరణ మొత్తం కలియతిరిగి నూతనంగా నిర్మించే భవనానికి పలు మార్పులు సూచించారు. ఈ సందర్భంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ శివన్నగూడెంలో త్వరలోనే మహిళా సమాఖ్య భవన్, సబ్ సెంటర్, రెండు అంగన్వాడి కేంద్రాలకు కొత్త భవనాలు నిర్మిస్తామని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ భవన నిర్మాణాలు ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మర్రిగూడ మండల అధ్యక్షుడు రాందాస్ శ్రీను, మాజీ జెడ్పిటిసిలు పాశం సురేందర్ రెడ్డి, మేతరి యాదయ్య, నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెన్నమనేని రవీందర్ రావు, నీలకంఠ రామస్వామి దేవస్థానం చైర్మన్ రాపోల్ యాదగిరి మాల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్లు మేకల జగన్ రెడ్డి, జమ్ముల వెంకటేష్, గంట మల్లేష్, మాజీ సర్పంచులు మాస చంద్రశేఖర్ ,గంట కృష్ణ ,నాంపల్లి బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెం జైపాల్ రెడ్డి, గౌడ సంఘం నాయకులు ముద్దం నరసింహ, ఊరిపక్క మహేందర్, మేతరి శంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అందరికి భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు : కలెక్టర్ హనుమంతరావు





**భువనగిరి కలెక్టర్, నవంబర్ 26 (జనంసాక్షి):** భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు సమక్షంలో జిల్లా అధికారులు, సిబ్బంది తో ప్రతిజ్ఞ చేశారు. 'భారతదేశ ప్రజలమైన మేము దేశ సార్వభౌమ్య సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యముగా నెలకొల్పుటకు, పౌరులందరికీ సామాజిక, ఆర్థిక రాజకీయ, న్యాయమును, భావము, భావ ప్రకటన, విశ్వాసం, ధర్మం, ఆరాధన - వీటి స్వాతంత్ర్యమును, అంతస్తులోనూ, అవకాశంలోనూ సమానత్వాన్ని చేకూర్చుటకు, అందరిలోనూ వ్యక్తి గౌరవమును, జాతి ఐక్యతను, అఖండతను కాపాడేందుకు అంకిత భావంతో కృషి చేస్తామని' ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టరేట్ వీరారెడ్డి ఏ.ఓ జగన్మోహన్ ప్రసాద్ , వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన

**మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ మార్పు**

**రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పతిష్టమవుతుంది**

**విద్య వ్యవస్థలో సమగ్ర విధానాన్ని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉంది**

**విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి**















**నల్గొండ బ్యూరో, నవంబర్ 26, (జనంసాక్షి) :** ప్రాథమిక విద్య మొదలుకొని ఉన్నత విద్య వరకు విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన, బడ్జెట్ కేటాయింపు,మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సిలబస్ మార్పు,శిక్షణ, నైపుణ్యాలతో కూడిన విద్య ఇచ్చినప్పుడే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పటిష్టమవుతుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.మంగళవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ విద్యపై నిర్వహించిన ప్రజాభిప్రాయానికి పలువురు విద్యావేత్తలు, మేధావులు, అధ్యాపక, ఉపాధ్యాయులు,సంఘాల ప్రతినిధులు, ప్రాథమిక విద్య నుండి మొదలుకొని యూనివర్సిటీ విద్య వరకు ప్రొఫెసర్లు,తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరై ఆయా స్థాయిలలో విద్యను పటిష్టం చేసేందుకు వారి అభిప్రాయాలను తెలియజేశారు.
తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా చైర్మన్ ఏ.మురళి మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమగ్ర విధానాన్ని అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ నుఏర్పాటు చేసిందని తెలిపారు.ఇందులో భాగంగా అన్ని జిల్లాలలో,వివిధ స్థాయిలలో అందరి అభిప్రాయాలను తీసుకుంటున్నామని, కళాశాలలు, పాఠశాలలు సందర్శించి యూనియన్లు, మేధావులు, విద్యావేత్తలతో అభిప్రాయాలను తీసుకుంటు న్నట్లు చెప్పారు.సమగ్ర విద్యా విధానాన్ని రూపొం దించడంలో ప్రజల అభిప్రాయాలు ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.గత10 సంవత్సరాలలో తెలంగాణలో ప్రభుత్వ విద్య బాగా ఇబ్బందుల్లో ఉందని,విద్యారంగంలో చాలా సమస్యలు ఉన్నాయని,ప్రత్యేకించి ప్రభుత్వ సంస్థల్లో విద్యార్థుల నమోదు బాగా పడిపోయిందని తెలిపారు.రాష్ట్రంలో పటిష్ట విద్యా వ్యవస్థ ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం విద్యా కమిషన్ కు అప్పజెప్పిన పనిపై తాము సీరియస్ గా దృష్టి కేంద్రీకరించి పిల్లలు, తల్లిదండ్రులు, ఫ్యాకల్టీ అందరితో సంప్రదించి సలహాలు,సూచనలు తీసుకుంటున్నామని,ఇప్పటివరకు 2 జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించామని,నల్గొండ జిల్లా మూడవదని సమస్యలు అన్నింటిని ప్రభుత్వానికి నివేదిస్తామని,ఏం చేస్తే విద్యార్థులకు,తల్లిదండ్రులు, ప్రజలకు మేలు జరుగుతుందో అలాంటిది ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన తెలిపారు.ప్రజాభిప్రాయ సేకరణకు హాజరైన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సాగతోపన్యాసం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో విద్యాశాఖంలో పేను మార్పులు తీసుకొచ్చిందని,ఇందులో భాగంగా విద్యార్థుల మేస్ చార్జీలను 40 శాతం పెంచిందని తెలిపారు. నాణ్యమైన విద్యతో పాటు,భోజనాన్ని అందించేందుకు రాష్ట్రస్థాయి నుండి బహుళ క్రమశిక్షణ బృందాల ఏర్పాటు చేయడం జరిగిందని,ఇందులో భాగంగా నల్గొండ జిల్లాలో సైతం వివిధ శాఖల అధికారులతో బృందాలను ఏర్పాటు చేశామని, వారు ఎప్పటికప్పుడు పాఠశాలలు, వసతి గృహాలు,రెసిడెన్షియల్ పాఠశాలల్లో తనిఖీలు నిర్వహించి నాణ్యమైన భోజనం,గుణాత్మక విద్య కై చర్యలు తీసుకుంటున్నామని,జిల్లాలో ఇప్పటివరకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం,గుణాత్మక విద్యను అందించడంలో సత్ఫలితాలను ఇస్తున్నందుకు సంతోషంగా ఉందని తెలిపారు..విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ విశ్వేశ్వర్ మాట్లాడుతూ... విద్యలో నాణ్యతను పెంపొందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్యా కమిషన్ తన పని తాను చేస్తుందని,అభిప్రాయాలను, సూచనలను సేకరించి ప్రభుత్వానికి సమర్పిస్తామని,అభివృద్ధికి విద్య ఒక్కటే మార్గం అని, అదే సాధనమని,విద్య కమిషన్ తరఫున నాణ్యమైన విద్యను భవిష్యత్ తరాల విద్యార్థులకు అందించేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి నశ్రీన్ మాట్లాడుతూ...ఇంగ్లీష్ స్పీకింగ్ స్కిల్స్ విద్య ఉండాలని, లైబ్రరీలు,పుస్తకాలు ఏర్పాటు చేయాలని,విద్యార్థులకు విద్యతో పాటు,శారీరక కార్యక్రమాలు, క్రీడలను నిర్వహించుకునేలా అవకాశం కల్పించాలని, ప్రయోగాత్మక విద్య అతి ముఖ్యమని అన్నారు.బీఈడీ విద్యార్థిని జయ మాట్లాడుతూ...లైబ్రరీలు, సౌకర్యాలు కల్పించాలన్నారు. బొట్టుగూడ పదవ తరగతి విద్యార్థి మారుతి కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ తో పాటు,స్పెషల్ క్లాస్ లు నిర్వహించాలని,ఉన్నత పాఠశాల స్థాయిలోనే వీటిని నిర్వహించాలని సూచించారు.డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాపయ్య మాట్లాడుతూ... ఉపాధ్యాయ విద్యను అప్డేట్ చేయాలని సూచించారు.ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ ని ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించాలని,విద్యార్థులకు అల్పాహారం ఇవ్వాలని,రవాణా సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఎంపీపీ ఎస్ పాఠశాల హెడ్మాస్టర్ లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ.. ప్రైమరీవిద్యను బలోపేతం చేయాలని సూచించారు.డివిఎస్ ఫణికుమార్ మాట్లాడుతూ... హైస్కూల్ స్థాయి వరకు మౌలిక సదుపాయాలు పెంచడం,విద్యలో సిసి విధానాన్ని తీసివేయడం, సిలబస్ ను సమీక్షించడం చేయాలన్నారు.డైట్ కళాశాల నుండి నరసింహ మాట్లాడుతూ... ప్రతి డైట్ కళాశాలలో డిపిఈఎస్ కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు .రాష్ట్ర మోడల్ స్కూల్స్ అధ్యక్షులు జగదీష్,తదితరులు మాట్లాడారు. అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిఆర్ఓ అమరేందర్,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి తదితరులు ఉన్నారు.

# పది నిమిషాల్లోనే ఆమెకు కోట్లు

- **లాభాలను తెచ్చిపెడుతున్న స్టాక్ మార్కెట్ షేర్లు..**



**ముంబై, నవంబర్ 26 (జనంసాక్షి) :** స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో భారత బెంచ్‌మార్క్ సూచీలు వరుసగా మూడో సెషన్‌లో పెరుగుదలను కొనసాగించాయి. తరువాత కొద్దిసేపటికి సెన్సెక్స్, నిఫ్టీ డీలా పడిపోయి రెడ్ మార్కులోకి చేరాయి. షేర్ మార్కెట్ ఒక విధంగా తిరిగి కోలుకునే దశలో ఉన్నప్పటికీ చివరి నిమిషంలో ఎలా ముగుస్తుందో చూడాల్సిందే. ఇక స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసేవారికి ప్రస్తుతం లాభాలు పండిస్తున్నాయి. ఈ రోజుల్లో పెట్టుబడిదారులు వారి పెట్టుబడులపై మంచి రాబడిని పొందుతుండగా, కొంతమంది అనుభవజ్ఞులైన పెట్టుబడిదారులు కూడా పెరుగుతున్న స్టాక్ మార్కెట్‌లో భారీగా సంపాదిస్తున్నారు. వీరిలో రేఖా ఝున్‌జున్‌వాలా టాప్ లో ఉన్నారు. రేఖా ఝున్‌జున్‌వాలా ఒక ప్రముఖ వ్యాపారవేత్త అలాగే రాకేష్ ఝున్‌జున్‌వాలా భార్య.

**కేవలం 10 నిమిషాల్లోనే కోట్లు**

టాప్ స్టాక్ మార్కెట్ ఇన్వెస్టర్లలో ఒకరైన రేఖా జున్‌జున్‌వాలా ఆమె రెండు పోర్ట్‌ఫోలియో స్టాక్‌లు టైటాన్ కంపెనీ అండ్ మెట్రో బ్రాండ్‌ల ద్వారా 10 నిమిషాల్లో రూ.105 కోట్ల కంటే పైగా పొందారు. ఈరోజు ఎన్ఎస్ఈలో టైటాన్ షేరు మొదటి పది నిమిషాల్లో ఒక్కో షేరు రూ.20.90 పెరిగింది, అయితే ఇవాళ భారతీయ స్టాక్ మార్కెట్ ప్రారంభమైన మొదటి పది నిమిషాల్లో మెట్రో బ్రాండ్స్ షేర్ ధర కూడా ఒక్కో షేరుకు రూ.3.90 పెరిగింది.

**రూ.105 కోట్లు**

టైటాన్ షేరు ధర ఈరోజు ఎన్ఎస్ఈలో ఒక్కో షేరు రూ. 3,310తో ప్రారంభమై రూ.3,360 ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. అయితే మొదటి పది నిమిషాల్లో ఒక్కో షేరు రూ.20.90 పెరిగింది. అలాగే మెట్రో బ్రాండ్‌ల షేర్లు ఎన్ఎస్ఈలో ఒక్కో షేరుకు రూ1,177.10 వద్ద ప్రారంభమై పది నిమిషాల్లో రూ.1,180.95కి చేరాయి, దింతో ఒక్కో షేరు రూ.3.90 పెరిగింది.

# నష్టాల్లో ముగిసిన మార్కెట్లు..



**ముంబై, నవంబర్ 26 (జనంసాక్షి) :** భారతీ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాల నేపథ్యంలో మార్కెట్లు ఉదయం లాభాల్లో మొదలయ్యాయి. మధ్యాహ్నం వరకు పెరుగుతూ వచ్చిన సూచీలు ఒక్కసారిగా పతమయ్యాయి. చివరి సెషన్‌లో మళ్లీ కోలుకొని స్వల్ప నష్టాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,415.47 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 80,482.36 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. ఒక దశలో 79,798.67 పాయింట్ల కనిష్ఠానికి చేరుకుంది. చివరకు 105.79 పాయింట్లు పతనమై.. 80,004.06 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27.40 పాయింట్ల నష్టంతో 24,194.50 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో దాదాపు 2,179 షేర్లు పురోగమించాయి. మరో 1,580 షేర్లు పతనం కాగా.. 105 షేర్లు మాత్రం మారలేదు. నిఫ్టీలో బ్రిటానియా ఇండస్ట్రీస్, ఏషియన్ పెయింట్స్, శ్రీరామ్ ఫైనాన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫోసిస్ టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, అల్ట్రాటెక్ సిమెంట్, సన్ ఫార్మా, బజాజ్ ఆటో నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.6 శాతం పెరిగింది. రంగాలవారీగా ఆటో, పవర్, ఫార్మా, ఆయిల్, గ్యాస్ ఒకశాతం నుంచి 1.15శాతం వరకు దిగజారాయి. ఎఫ్ఎంసీజీ, ఐటీ, మెటల్ 0.5శాతం నుంచి ఒకశాతం వరకు వృద్ధిని నమోదు చేశాయి. మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి.. 5 పైసలు తగ్గి రూ.84.33 వద్ద స్థిరపడింది.




## అందుబాటులోకి ఆల్-టెర్రైన్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ క్వాంటా



**హైదరాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** గ్రావ్టన్ మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫుల్-స్టాక్ కంపెనీ, సస్టైనబుల్ మొబిలిటీలో అగ్రగామిగా ఉంది, హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో తన ఫ్లాగ్‌షిప్ ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ క్వాంటాను విడుదల చేసింది. క్వాంటా ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ ధర రూ. 1.2లీ. ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాచే ఆమోదించబడినది. ఇది వాణిజ్యపరమైన ఉపయోగం కోసం సిద్ధంగా ఉంది. క్వాంటా హైదరాబాద్‌లోని చెర్లపల్లిలోని గ్రావ్‌టన్ అత్యాధునిక సౌకర్యంలో రూపొందించబడింది. భారతదేశంలో లిథియం మాంగనీస్ ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీలను అనుసంధానం చేసిన మొదటి ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ క్వాంటా. ఈ పురోగతి ఆవిష్కరణ మెరుగైన బ్యాటరీ జీవితం, ఉన్నతమైన ఉష్ణ స్థిరత్వం, విస్తరించిన శ్రేణిని నిర్ధారిస్తుంది, పట్టణ ప్రయాణికులు, సాహస ఔత్సాహికుల కోసం క్వాంటాను నమ్మదగిన, సమర్థవంతమైన ఎంపికగా చేస్తుంది.

# పాన్ కార్డుల రద్దు దిశగా కేంద్రం మార్పులు?




**ముంబై, నవంబర్ 26 (జనంసాక్షి) :** ఆర్థిక లావాదేవీలకు పాన్ కార్డులు చాలా కీలకం. రూ. 50 వేలు అంతకు మించిన ట్రాన్సాక్షన్స్ చేయాలంటే కచ్చితంగా పాన్ కార్డు ఉండాల్సిందే. ఇప్పటికే పాన్, ఆధార్ కార్డును లింక్ చేస్తూ కేంద్రం పెద్ద ఎత్తున కార్యక్రమం చేపట్టింది. అయితే తాజాగా కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న పాన్ కార్డులన్నింటినీ రద్దుచేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది.

అందుకు సంబంధించి సోమవారం కేంద్ర క్యాబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. పాన్ కార్డు విషయంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. పాన్ 2.0 పేరుతో తీసుకున్న నిర్ణయానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దాంతె పాత పాన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో ఉన్న కొత్త కార్డులు అందుబాటులోకి రానున్నాయి. వినియోగదారులు ఈ కొత్త కార్డులను ఉచితంగా అప్‌గ్రేడ్ చేసుకోవచ్చని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అయితే ఈ మార్పు కోసం ప్రజలపై ఎలాంటి భారం పడకుండా కేంద్రం నిర్ణయం తీసుకుంది. అందుకు రూ.1435 కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించింది. పాన్ 2.0 ప్రాజెక్ట్‌లో భాగంగా ట్యాక్స్ చెల్లించే వారికి మెరుగైన డిజిటల్ అనుభవాన్ని అందించనున్నారు. ఈ కార్డులో పాన్ సేవలతోపాటు పన్ను చెల్లింపుదారుల రిజిస్ట్రేషన్ సేవలను కూడా ఏకీకృతం చేయనున్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు దేశంలో 78 కోట్ల పాన్ కార్డులను పంపిణీ చేశామని, ఈ కొత్త ప్రాజెక్ట్ పన్ను చెల్లింపుదారులు ఉపయోగించే ప్రస్తుత వ్యవస్థను అప్‌గ్రేడ్ చేయనుందని తెలిపారు.

# ఇన్ఫోసిస్ ఉద్యోగులకు 85 శాతం బోనస్

- **నవంబర్ నెలతో చెల్లింపు..!**




**న్యూఢిల్లీ, నవంబర్ 26 (జనంసాక్షి) :** దేశీయ ఐటీ దిగ్గజం 'ఇన్ఫోసిస్'.. తన ఉద్యోగులకు తీపి కబురందించింది. అర్హులైన ఉద్యోగులకు సగటున 85 శాతం వర్క్ బేస్డ్ బోనస్ చెల్లించాలని నిర్ణయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు సాధించిన ఇన్ఫీ.. ఈ బోనస్ చెల్లించాలని నిర్ణయం తీసుకున్నది. నవంబర్ నెలతోపాటు ఈ బోనస్ చెల్లించనున్నది. బోనస్ చెల్లింపు విషయమై సంబంధిత ఉద్యోగులకు ఇన్ఫీ యాజమాన్యం ఈ-మెయిల్స్ పంపింది. ద్వితీయ త్రైమాసికంలో మెరుగైన వృద్ధి నమోదు చేయడంలో ఉద్యోగుల సహాయ సహకారాలు మరువలేనివని తెలిపింది. ఉద్యోగులు ఇదే నిబద్ధతనూ మున్ముందూ కొనసాగించాలని కోరింది. ఇన్ఫీ నిర్ణయంతో సంస్థ డెలివరీ, సేల్స్ యూనిట్లలో పని చేసే మిడ్, జూనియర్ లెవల్ ఉద్యోగులకు భారీగా లబ్ధి చేకూరుతుందని ఓ ఆంగ్ల దినపత్రిక వార్తా కథనం ప్రచురించింది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.6,506 కోట్ల నికర లాభం గడించినట్లు ఇన్ఫోసిస్ తెలిపింది. అలాగే 5.1 శాతం వృద్ధితో రూ.40,986 కోట్ల ఆదాయం సముపార్జించినట్లు తెలిపింది. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలు కూడా 3.75-4.5 శాతంగా నమోదవుతుందని వెల్లడించింది. ఇన్ఫీ ఉద్యోగులను ఈ0 - ఈ2 క్యాటగిరీ, ఈ3-ఈ6, ఈ7 అంత కంటే పెద్ద క్యాటగిరీలుగా విభజించారు. ఇన్ఫీ ఉద్యోగుల్లో ఫ్రెషర్లు, టెక్నికల్ లీడర్లు, మిడ్ లెవల్ ఉద్యోగులు, సీనియర్ లెవల్ ఉద్యోగులు ఉంటారు.

# క్షీణించిన రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఆరోగ్యం

- **అపోలో ఆస్పత్రిలో చేరిన శక్తికాంతదాస్**
- **అసిడిటీతో బాధపడుతున్నట్లు తెలిపిన ఆస్పత్రి వర్గాలు**

**న్యూఢిల్లీ, నవంబర్ 26 (జనంసాక్షి) :** భారత రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ ఆరోగ్య సమస్యతో చెన్నైలోని ఆస్పత్రిలో చేరారు. ఆయన చిన్నపాటి సమస్యతో అపోలో ఆసుపత్రిలో చేరారు. ఈ మేరకు అపోలో ఆసుపత్రి వర్గాలు ఒక ప్రకటన విడుదల చేసింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ అసిడిటీతో బాధపడుతున్నారని, చికిత్స కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరినట్లు పేర్కొంది. ప్రస్తుతం అతను బాగానే ఉన్నారని, మరో 2-3 గంటల్లో డిశ్చార్జ్ అవుతారని వెల్లడించింది. అతని ఆరోగ్యానికి సంబంధించిన ప్రకటన కూడా ఆర్బీఐ ప్రతినిధి విడుదల చేశారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్ అసిడిటీతో బాధపడుతున్నట్లు తెలిపింది. వైద్య పరీక్షల కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో చేరారని చెప్పారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని ఆర్బీఐ అధికార ప్రతినిధి తెలిపారు. మరో 2-3 గంటల్లో డిశ్చార్జి కానున్నారు. చింతించాల్సిన పనిలేదు. ప్రస్తుత ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ పదవీ కాలం కూడా డిసెంబర్ 10తో ముగియనుంది. ఉర్జిత్ పటేల్ హఠాత్తుగా రాజీనామా చేయడంతో ఆరేళ్ల క్రితం ఆర్‌బీఐ గవర్నర్‌గా శక్తికాంత దాస్ బాధ్యతలు చేపట్టారు. తన పదవీ కాలంలో, కోవిడ్ కారణంగా దేశంలో తలెత్తిన ద్రవ్యోల్బణం సమస్యను నియంత్రించడంలో ఆయన విశేషమైన కృషి చేశారు.




# మహారాష్ట్రకు మంచి నాయకత్వం రావాలి

- **సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు..!**



**ముంబై, నవంబర్ 26 (జనంసాక్షి) :** మహారాష్ట్ర శాసనసభ పదవీకాలం నేటితో ముగియనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే రాజీనామా చేశారు. గవర్నర్ రాజీనామాను ఆమోదించి, కొత్త ముఖ్యమంత్రిని నియమించే వరకు తాత్కాలిక ముఖ్యమంత్రిగా ఏకనాథ్ షిండేను నియమిస్తూ లేఖను అందజేశారు. ప్రమాణస్వీకార కార్యక్రమం వరకు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని గవర్నర్ ఏక్నాథ్ షిండేను ఆదేశించారు. అయితే రాష్ట్రంలో మహాకూటమి ప్రభుత్వం భారీ విజయం సాధించింది. రాష్ట్రంలోని 288 స్థానాల్లో మహాకూటమి 230 సీట్లను గెలుచుకుంది. మహా వికాస్ అఘాడి భారీ ఓటమిని చవిచూసింది. ఈ ఏడాది ఎన్నికల్లో ఎంవియా కేవలం 46 సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఎన్నికల ఫలితాలు వెలువడి మూడు రోజులు గడుస్తున్నా మహాయుతి నుంచి ఎవరు ముఖ్యమంత్రి అవుతారు? అన్నదీ ఇంకా స్పష్టత రాలేదు. అయితే దీనిపై శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) ఎంపీ సంజయ్ రౌత్ స్పష్టమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. నీతి ప్రాతిపదికన దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్యమంత్రి అవుతారని రౌత్ స్పష్టంగా చెప్పారు. మంగళవారం (నవంబర్ 26) ఎంపీ సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడారు. ఈ సమయంలో మహాకూటమిలో ముఖ్యమంత్రి పదవి ఏమిటని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ మెజారిటీకి చేరుకుందన్నారు. అవసరమైతే షిండే-అజిత్ పవార్ పార్టీని కూడా విచ్ఛిన్నం చేయవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కొత్త ముఖ్యమంత్రి ఎవరు అవుతారన్న ఆసక్తి లేదన్నారు సంజయ్ రౌత్. నేటితో నవంబర్ 26వ తేదీతో శాసనసభ పదవీకాలం ముగియనుంది. ఇది ప్రభుత్వ ఏర్పాటుకు చివరి రోజు. మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం అనే పరిస్థితి వచ్చినప్పుడు 26వ తేదీలోగా ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే రాష్ట్రపతి పాలన విధిస్తామంటూ బెదిరింపులకు దిగారు. ఇప్పుడు రాజ్యాంగంలో ఆ నిబంధన లేదని అంటున్నారన్నారు సంజయ్. అంటే రాష్ట్రంలో వారికి భిన్నమైన పాలన, ఇతరులకు భిన్నమైన పాలన అని సంజయ్ రౌత్ ధ్వజమెత్తారు. అలాగే ఈ సాయంత్రానికి మహారాష్ట్ర కొత్త ముఖ్యమంత్రి ఎవరన్న దానిపై క్లారిటీ వస్తుందని ఆశిస్తున్నామన్నారు. రాష్ట్రానికి మంచి నాయకత్వం రావాలన్నారు సంజయ్ రౌత్. ఢిల్లీలో అమిత్ షా, నరేంద్ర మోదీ మహారాష్ట్ర సీఎం ఎవరు అనేది అంతిమంగా నిర్ణయిస్తారన్నారు. బీజేపీకి సొంతంగా మెజారిటీ ఉన్నందున ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే హక్కు తమకే ఉందని భావిస్తోంది. ఈ సమయంలో మహాకూటమిలో చర్చనీయాంశమైన రెండున్నరేళ్ల ఫార్ములాపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మేము చెబుతున్నప్పుడు ఈ ఫార్ములా ఆమోదయోగ్యం కాదన్నారు. ఈ ఫార్ములాను అప్పుడు అంగీకరించి ఉంటే, చాలా సంఘటనలు నివారించి ఉండేవి. కానీ ఉద్ధవ్ ఠాక్రే, శివసేనను ఇబ్బంది పెట్టాలని, పార్టీని చీల్చాలని మాత్రమే ఈ ఫార్ములాను అనుసరించలేదని సంజయ్ రౌత్ ఆరోపించారు. మహారాష్ట్ర అభివృద్ధి జరగాలంటే ఏకనాథ్ షిండే కేంద్ర రాజకీయాల్లోకి తీసుకు రావాలి. షిండే అంగీకరించకపోయినా, బీజేపీకి మెజారిటీ ఉన్నందున ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో ఇబ్బంది ఉండదని' రాందాస్ అథవాలే అన్నారు.

# తెలంగాణ అమరుల కోసం ప్రత్యేక తేదీ కావాలి

- **తెలంగాణ అమరులకు గుర్తింపు ఉండదా?**
- **రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి**
- **అమరుల త్యాగాలు రేపటి తరానికి నాంది**
- **తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సాధన కమిటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇమంది ఉదయ్ కుమార్**



**హైదరాబాద్, నవంబర్ 26 (జనంసాక్షి) :** తెలంగాణ అమరవీరుల త్యాగాల పైన ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ అమరవీరులకు వారి బలిదానాలకు గుర్తింపు లేకుండా పోతున్నదని, అముల కోసం ప్రత్యేక తేదీని ప్రకటించి స్మారకవారోత్సవాలు నిర్వహించాలని తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవ సాధన కమిటీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఇమంది ఉదయ్‌కుమార్ అన్నారు. పోలీసులు అమరుల సంస్మరణ దినోత్సవం, ఫారెస్టు అమరవీరుల దినోత్సవం లాగా రేపటి తరానికి బంగారు భవిష్యత్తును అందించేందుకు తెలంగాణ రాష్ట్రం కోసం జీవితాలను తృణప్రాయంగా త్యాగం చేసిన వారు అమరవీరులు కాదా వారిని గుర్తుంచుకోవడం కోసం రేపటి తరాలకు వారి జీవితాన్ని స్ఫూర్తిగా అందించడం కోసం ప్రత్యేక తేదీ ఉండకూడదా అంటూ ప్రశ్నించారు. తెలంగాణ అమరవీరుల కోసం ఒక ప్రత్యేక తేదీ అంటూ ఉంటే అమరవీరుల కుటుంబాలకు వారి త్యాగాలకు ఒక గుర్తింపు ఉంటుందని, నేటి తరానికి 1969 తొలి దశ తెలంగాణ ఉద్యమానికి సంబంధించిన త్యాగాలైనా, మలిదశ ఉద్యమానికి సంబంధించి జ్ఞాపకాలైన రేపటి తరానికి తెలియాలంటే తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం అనేది ఉంటేనే సాధ్యమవుతుందని, అందుకే మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పిన శ్రీకాంతచారి మరణించిన రోజు డిసెంబర్ 3ను తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా ప్రకటించాలని 2014 తెలంగాణ ఏర్పాటైన నాటినుండే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వేదికగా ఉద్యమాలు ఊపందుకున్నాయని, 2015లో తెలంగాణ అమరవీరుల సంస్కరణ దినోత్సవ సాధన కమిటీగా రిజిస్టర్ కాబడి ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయని, 2015 భద్రాచలంలో జరిగిన గోదావరి పుష్కరాలలో మలిదశ ఉద్యమానికి కారణమైన అమరుడు శ్రీకాంతచారి కుటుంబ సభ్యులు తల్లిదండ్రులు శంకరమ్మ వెంకటాచారి సోదరుడు రవీంద్ర చారి, కుటుంబ సభ్యులందరి ఆధ్వర్యంలో భద్రాచలం గోదావరిలో తెలంగాణ కోసం అమరులైన 1200 మంది అమరవీరులకు పిండ ప్రధాన కార్యక్రమాలు ఈ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారని తెలిపారు. అనంతరం 2016లో జరిగిన కృష్ణా పుష్కరాల్లో సైతం హుజూర్నగర్ మఠంపల్లి కృష్ణా పుష్కర ఘాట్ లో కార్యక్రమాలను నిర్వహించి కృష్ణా పుష్కరాలను సైతం పిండ ప్రధాన కార్యక్రమాలు నిర్వహించారని, తెలంగాణ ప్రభుత్వంలో ఎంతోమందికి తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏర్పాటు చేయాలని వినతి పత్రాలు ఇస్తూ చివరకు నేటి ముఖ్యమంత్రి 2016లో తెలుగుదేశం ముఖ్య నాయకుడైన రేవంత్ రెడ్డికి సైతం తెలంగాణ అమరవీరుల సంస్కరణ దినోత్సవ ఏర్పాటుకై విజ్ఞాపన చేయగా ఈ విషయాన్ని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతేగాకుండా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కు బహిరంగ లేఖను రాసి విడుదల చేస్తూ తెలంగాణ అమరవీరుల జ్ఞాపకార్థం కోసం తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను సైతం తెలిపారు. తమకు అవకాశం వచ్చిన రోజున తప్పనిసరిగా తెలంగాణ అమరవీరుల దినోత్సవాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.. పదేళ్ల తర్వాత అనుకోకుండా శ్రీకాంతాచారి పెట్రోల్ పోసుకున్న నవంబర్ 29 ఎలక్షన్లు జరగడం డిసెంబర్ మూడవ తేదీన శ్రీకాంతాచారి మరణించిన రోజున ఫలితాలు రావడం ఎలక్షన్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం విజయం సాధించింది.. ఎలక్షన్లో ఫలితాలు వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంలో డిసెంబర్ మూడవ తేదీన ఇప్పటికైనా తెలంగాణ అమరవీరుల జ్ఞాపకార్థం కోసం డిసెంబర్ 3ను అమరవీరుల దినోత్సవం గా ప్రకటిస్తారేమోనని ఎదరుచూస్తున్నామని తెలిపారు.

# మహాయుతిలో ముఖ్యమంత్రి పంచాయితీ




**ముంబై, నవంబర్ 26 (జనంసాక్షి) :** మహారాష్ట్ర సీఎం పదవిపై ఢిల్లీ పెద్దల కసరత్తు కొనసాగుతోంది. కానీ ఇప్పటి వరకు సీఎం పదవి కోసం పడిన పీటముడి వీడలేదు. చివరకు ఇది మహాయుతిలో ముసలం పుట్టిస్తుందా అనే అనుమానాలకు కలిగిస్తోంది. బిజెపి- శివసేన మధ్య విభేదాలు వచ్చే అవకాశం ఉన్నదా అనే అనుమానాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటినుంచి ముఖ్యమంత్రిగా ఉన్న శివసేన నేత ఏక్‌నాథ్ షిండే, భాజపా తరఫున గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం కూడా ఉన్న దేవేంద్ర ఫడణవీస్ ఇద్దరూ కూడా ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి కోసం గట్టిగా పోటీపడుతున్నారు. కూటమి చీలికను ఎవ్వరూ కోరుకోవడం లేదు గానీ.. అనివార్యమైన పరిస్థితి వస్తే.. ఆ సంభావ్యతను తోసిపుచ్చలేమని పరిశీలకులు భావిస్తున్నారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో అత్యధికంగా 132 సీట్లలో విజయం సాధించింది. మహాయుతి కూటమిలో కూడా వారి వాటా ఎక్కువ. కాబట్టి వారికే ముఖ్యమంత్రి పదవి దక్కాలనేది పలువురి వాదన. ఏక్‌నాథ్ షిండేకు ఒక అవకాశం ఇచ్చారు గనుక.. ఇప్పుడు ఆయన కూడా అవకాశం బిజెపికి ఇవ్వడానికి సిద్ధంగా ఉండాలని కొందరు అంటున్నారు. రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లే సత్తా ఫడణవీస్ కు ఉన్నదని ఆ పార్టీ వారు గట్టిగా పట్టుపడుతున్నారు. అయితే శివసేన వాదన ఇంకో రకంగా ఉంది. ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా ఉండగా తీసుకున్న నిర్ణయాలు, అందించిన సుపరిపాలన కారణంగానే మహాయుతి కూటమి ఘనవిజయం సాధించిందని, ఆ వియాన్ని తోసిపుచ్చలేమని వారు అంటున్నారు. కాబట్టి షిండేనే కొనసాగించాలనేది వారి వాదన. షిండేని పక్కకు తప్పిస్తే గనుక.. భారతీయ జనతా పార్టీ మిత్ర పక్షాలను వాడుకుని, తాము బలపడిన తర్వాత వారిని కరివేపాకులు వాడుకుని వదిలేస్తుందని అనేక మంది చేసే ఆరోపణలే నిజమౌతాయని వారు చెబుతున్నారు. తద్వారా బిజెపిని డిఫెన్సులోకి నెడుతున్నారు. బలాబలాల ప్రకారంగా చూస్తే భారతీయ జనతా పార్టీకి 132 మంది సభ్యులున్నారు. అదే సమయంలో ఎన్సీపీకి ఉన్న బలం 41 స్థానాలు. శివసేన(షిండే) 57 స్థానాలలో గెలిచింది. పరిస్థితులు వికటిస్తే గనుక.. శివసేన లేకుండా కూడా ఎన్సీపీ మద్దతుతో భాజపా ప్రభుత్వం ఏర్పాటు చేయగలుగుతుంది. అయితే అలాంటి నిర్ణయం భాజపాకు అపరిమితమైన చెడ్డపేరు తెచ్చిపెడుతుంది. వారి విశ్వసనీయత దెబ్బతింటుంది. అందుకే కేంద్రంలోని పెద్దలు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. షిండే, ఫడణవీస్ ఇద్దరూ గట్టిగా పట్టుపడుతున్నందువల్ల.. మంగళవారమే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావల్సి ఉండగా.. ఇంకా నిర్ణయం జరగలేదు. రాజీ కుదరకపోతే మైత్రిలో ముసలం పుడుతుందని కొందరు అంచనా వేస్తున్నారు.

## బంగ్లాదేశ్‌లో చిన్మయ్ దాస్ అరెస్ట్

**న్యూఢిల్లీ, నవంబర్ 26 (జనంసాక్షి) :** హిందూ సంస్థ సమ్మిళిత్ సనాతనీ జోట్ నేత చిన్మయ్ కృష్ణ దాస్ బెయిల్ పిటిషన్‌ను బంగ్లాదేశ్ కోర్టు తిరస్కరించింది. అతన్ని జైలుకు పంపాలని కోర్టు ఆదేశించింది. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన అకృత్యాలను నిరసిస్తూ గతంలో ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణ దాస్ ప్రభుపై చర్యలు తీసుకున్నారు. దేశద్రోహం, మత సామరస్యానికి భంగం కలిగించారన్న ఆరోపణలపై బంగ్లాదేశ్ పోలీసులు ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేశారు. ఆ తర్వాత పలు హిందూ సంఘాలు ఢాకా వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు. పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా ఈ అంశంపై భారత్ స్పందించింది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ చిన్మయ్ దాస్‌ను అరెస్టు చేయడం, బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడంపై ఆందోళన వ్యక్తం చేసింది. హిందువులతో పాటు మైనారిటీలందరికీ శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, భావ ప్రకటనా స్వేచ్ఛతో సహా భద్రత కల్పించాలని అధికారులకు సూచించింది. అక్టోబర్ 30న బంగ్లాదేశ్‌లో జాతీయ జెండాను అవమానించారన్న కారణంతో చిన్మయ్ దాస్ ప్రభుతో సహా 19 మందిపై దేశద్రోహ చట్టం కింద కేసు నమోదైంది. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ సైతం చేశారు. సనాతన్ జాగరణ్ మంచ్ ఎనిమిది అంశాల డిమాండ్లతో చిట్టగాంగ్‌లోని లాల్దిఘి మైదానంలో ర్యాలీ నిర్వహించింది.



## ప్రేమలో పడ్డ మహ్మద్ సిరాజ్..

క్రికెటర్లు సినీ తారలతో ప్రేమాయణం నడపడం సర్వసాధారణ విషయమే. విరాట్ కోహ్లీ, అనుష్క శర్మ వంటి జంటలు అందుకు బెస్ట్ ఎగ్జాంపుల్. ఇందులో కొన్ని ప్రేమ కథలు పెళ్లి వరకు వస్తే మరికొన్ని డేటింగ్ వరకే పరిమితమవుతుంటాయి. ఇప్పుడు నెట్టింట ఓ కొత్త జంట మీద పుట్టుకొచ్చిన రూమర్ ట్రెండింగ్‌గా మారింది. టీమిండియా క్రికెటర్ మహ్మద్ సిరాజ్.. బిగ్ బాస్ 13 ఫేమ్ మహిరా శర్మ మధ్య ఏదో ఉందంటూ సోషల్ మీడియా కోడై కూస్తోంది. వీరిద్దరూ కలిసి ఇప్పటివరకూ ఎక్కడా కనిపించకపోయినా ఒకరినొకరు ఫాలో అవ్వడం.. పోస్టులకు లైకులు కొట్టడం వంటివి చేస్తున్నారు. ఈ మాత్రం దానికే రూమర్స్ అల్లేస్తారా? అంటూ సిరాజ్ ఫ్యాన్స్ మండిపడుతున్నారు. మహిరా శర్మ తరచూ తన అందమైన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ అందరినీ ఆకట్టుకుంటుంది. ఇటీవల కూడా ఈ బిగ్ బాస్ 13 స్టార్ తన ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో కొన్ని పిక్స్ షేర్ చేసింది. ఇందులో ఆమె దేసీ ఔట్ ఫిట్‌లో బ్యాక్ లెస్ టాప్ వేసుకుని ఫొటోలకు ఫోజులిచ్చింది. ఈ ఫొటోలు అందరి దృష్టినీ ఆకర్షించాయి.దీంతో ఈ టీమిండియా క్రికెటర్ త్వరలోనే గుడ్ న్యూస్ చెప్తాడేమోనని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. మహ్మద్ సిరాజ్ ప్రస్తుతం బోర్డర్–గవాస్కర్ ట్రోఫీ కోసం ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నాడు.

# అమ్ముడు పోలే



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరగనున్న ఐపీఎల్ సీజన్‌కు చెందిన ఆటగాళ్ల వేలం ముగిసింది. సౌదీ అరేబియాలోని జెడ్డాలో జరిగిన వేలం ఈవెంట్‌లో 577 ఆటగాళ్లను షార్ట్ లిస్టు చేశారు. కానీ చాలా మంది మేటి క్రికెటర్ల ను.. ఏ ఫ్రాంచైజీ కూడా కొనలేదు. బ్యాటర్లు, బౌలర్లు, ఆల్‌రౌండర్లు, వికెట్ కీపర్లు ఆ జాబితాలో ఉన్నారు. వేలంలో అమ్ముడు పోని బ్యాటర్లలో డేవిడ్ వార్నర్, కేన్ విలియమ్‌సన్, పృథ్వీ షా, మయాంక్ అగర్వాల్ ఉన్నారు. ఈ టాప్ బ్యాటర్లు గతంలో ఓసారి తమ ఫ్రాంచైజీలకు విజయా లను అందించారు. కానీ ఈసారి మాత్రం ఏ జట్టు కూడా ఆసక్తి చూపలేదు.

అమ్ముడుపోని బ్యాటర్ల జాబితాలో వార్నర్, అన్‌మో ల్‌ప్రీత్ సింగ్, యశ్ దుల్, కేన్ విలియమ్‌సన్, మయాంక్ అగర్వాల్, పృథ్వీ షా, సర్ఫరాజ్ ఖాన్, మాధవ్ కౌశిక్, పుక్‌రాజ్ మాన్, ఫిన్ అలెన్, డీవాల్డ్ బ్రెవిస్, బెన్ డకెట్, బ్రాండన్ కింగ్, పాథుమ్ నిస్సంక, స్టీవ్ స్మిత్, సచిన్ దాస్, సల్మాన్ నజర్, లూయిస్ డూ ప్లోయ్, శివాలిక్ శర్మ ఉన్నారు.

ఇక బౌలర్ల జాబితాలో అనేక మంది ఉన్నారు. ఐపీఎల్ టోర్నీలోనే అత్యధిక వికెట్లు తీసిన పీయూష్ చావ్లాను కూడా ఏ జట్టూ కొనలేదు. ముస్తాఫిజుర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, కార్తిక్ త్యాగి, ముజీబ్ ఉర్ రెహ్మాన్ ఉన్నారు. వకార్ సలామ్‌కేలీ, విజయకాంత్ వియాస్‌కాంత్, అకీల్ హుసేన్, అదిల్ రషీద్, కేశవ్ మహారాజ్, సకీబ్ హుస్సేన్, విద్వాత్ కావేరప్ప, రాజన్ కుమార్, ప్రశాంత్ సోలంకి, జాతవేద్ సుబ్రమణియన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, నవీన్ ఉల్ హక్, ఉమేశ్ యాదవ్, రిషాద్ హుస్సేన్, రాఘవ గోయల్, యశ్వంత్, రిచర్డ్ గ్లీసన్, అల్జరీ జోసెఫ్, లూక్ వుడ్, అర్పిత్ గులేరియా, జేసన్ బెహరెండాఫ్, శివం మావి, నవదీప్ సైనీ, దివేశ్ శర్మన్, దిల్షాన్ మధుశంక, ఆడమ్ మిల్నే, రూర్కీ, లాన్స్ మోరిస్, ఓలీ స్టోన్, కైల్ జేమీసన్, క్రిస్ జోర్డన్ ఉన్నారు.

చాలా మంది ఆల్‌రౌండర్లకు కూడా మొండిచెయ్యి చూపించారు. టీ20 క్రికెట్‌లో ప్రస్తుతం ఇంపాక్ట్ ప్లేయర్ రూల్ రావడంతో.. ఆల్‌రౌండర్ పాత్ర తగ్గినట్లు తెలుస్తోంది. శార్దూల్ ఠాకూర్‌ను ఏ జట్టు కూడా కొనలేదు. ఉత్కర్ష్ సింగ్, డారిల్ మిచెల్, రిషి ధావన్, శివం సింగ్, అట్కిన్‌సన్, సికందర్ రాజా, కైల్ మేయర్స్, మాథ్యూ షార్ట్, మైకేల్ బ్రేస్‌వెల్, అబ్దుల్ బాసిత్, ప్రిటోరియస్, రోస్టన్ చేజ్, నాతన్ స్మిత్, సంజయ్ యాదవ్, ఉమంగ్ కుమార్, దిగ్విజయ్ దేశ్‌ముక్ ఉన్నారు. మేటి వికెట్ కీపర్ జానీ బెయిర్‌స్టోను ఈసారి ఏ జట్టు ఖరీదు చేయలేదు. వేలంలో అనేక మంది వికెట్ కీపర్లు కూడా మిస్సయ్యారు. ఉపేంద్ర యాదవ్, శాయ్ హెూప్, కేఎస్ భరత్, అలెక్స్ కేరీ, అరావలీ, హర్విక్ దేశాయ్, జోష్ ఫిలిప్, చేతన్, తేజస్వి దహియా ఆ లిస్టులో ఉన్నారు. అయితే అమ్ముడుపోని ఆటగాళ్లకు చివరకు ఓ ఛాన్స్ ఉంటుంది. ఒకవేళ టోర్నీ సమయంలో ఎవరైనా గాయపడ్డా లేక తప్పుకున్నా.. వారి స్థానంలో ఈ క్రికెటర్లను తీసుకునే అవకాశం ఉంటుంది.

రిషబ్ పంత్ అత్యధికంగా 27 కోట్లకు అమ్ముడుపోయిన విషయం తెలిసిందే. అతన్ని లక్నో జట్టు సొంతం చేసుకున్నది.

## అత్యవసరంగా స్వదేశానికి గంభీర్



పెర్త్: భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతం గంభీర్.. ఆస్ట్రేలియా పర్యటన నుంచి ఆకస్మికంగా స్వదేశానికి బయలుదేరారు. కుటుంబసభ్యులతో కలిసి ఇవాళ ఆయన ఇండియాకు రిటర్న్ అయ్యారు. అత్యవసరమైన వ్యక్తిగత కారణాలతో గంభీర్.. స్వదేశానికి బయలుదేరినట్లు తెలుస్తోంది. డిసెంబర్ 6వ తేదీన అడిలైడ్‌లో జరగనున్న రెండవ టెస్టుకు ముందు.. మళ్లీ గంభీర్ జట్టుతో కలవనున్నట్లు బీసీసీఐ వర్గాల ద్వారా వెల్లడైంది. నవంబర్ 30 నుంచి కేన్‌బెరాలో జరగనున్న వార్మప్ మ్యాచ్‌కు దూరం కానున్నారు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో బుమ్రా నేతృత్వంలోని ఇండియన్ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే బుధవారం ఆ జట్టు పెర్త్ నుంచి కేన్‌బెరా బయలుదేరుతుంది. అక్కడ ఆ దేశ ప్రధాని ఆంథోనీ ఆల్బనీస్ ఇచ్చే ప్రత్యక విందులో భారత జట్టు క్రికెటర్లు పాల్గొంటారు. ఇక రెండవ టెస్టు మ్యాచ్ డే అండ్ నైట్ గేమ్ కావడంతో.. భారత జట్టు ఆ మ్యాచ్ కన్నా ముందే ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆడనున్నది. రెండో టెస్టు కోసం పింక్ కలర్ కోకాబురా బంతిని వాడనున్నారు.

ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టుతో జరిగే మ్యాచ్‌కు భారత్ సిద్ధమైంది. ప్రైమ్ మినిస్టర్స్ లెవన్ జట్టుకు జాక్ ఎడ్వర్డ్స్ నాయకత్వం వహిస్తున్నాడు. ఆ జట్టు పూర్తిగా యువకులతో నిండి ఉన్నది. స్కాట్ బోలాండ్, మాథ్యూ రెన్‌షా కూడా ఆ జట్టులో ఉన్నారు. అనధికార మ్యాచ్ కావడం వల్ల.. రెండు జట్లూ బ్యాటింగ్, బౌలింగ్ చేసే రీతిలో ప్రాక్టీస్ గేమ్ కొనసాగనున్నది.

## సచిన్ తనయుడు కొనుగోలు చేసిన ఎంఐ

### సోషల్ మీడియాలో వెల్లువెత్తిన మీమ్స్..!




ఐపీఎల్–2025 మెగావేలం భారత దిగ్గజ బ్యాట్స్‌మెన్ సచిన్ టెండుల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్‌ను ముంబయి ఇండియన్స్ కొనుగోలు చేసింది. రూ.30లక్షల బేస్ ప్రైజ్‌కు అతన్ని తీసుకుంది. వాస్తవానికి అర్జున్ టెండూల్కర్ అమ్ముడు పోయలేదు. సెకండ్ రౌండ్‌లో అర్జున్ బేస్ ప్రైజ్‌కే తీసుకుంది. అర్జున్‌ని ముంబయి జట్టు కొనుగోలు చేయడంతో సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తుతున్నాయి. అర్జున్‌ని ముంబయి జట్టు యాజమాన్యం కామన్‌గానే తీసుకుందని సచిన్ అభిమా నులు పేర్కొంటున్నారు. అయితే, మరికొందరు ముంబయి ఇండియన్స్ మెంటార్‌గా సచిన్ ఉండడంతో వేలంపై అతని ప్రభావం ఉంటుందని మరికొందరు పేర్కొంటున్నారు. అర్జున్ వరుసగా నాలుగోసారి ముంబయి జట్టులో చేరాడు. ఐపీఎల్‌లో అతని ప్రయాణం 2021లో మొదలైంది. ఆ సమయంలో అర్జున్ బేస్‌ప్రైజ్ రూ.20లక్షలు. అయితే, గాయం కారణంగా ఆ సీజన్‌లో ఆడలేకపోయాడు. అతని స్థానంలో సిమ్రంజిత్‌ను ముంబయి జట్టులోకి తీసుకుంది. తాజాగా వేలంలో అర్జున్‌ని తీసుకోగా.. సోషల్ మీడియాలో మీమ్స్ వెల్లువెత్తాయి. దేవుడి తనయుడు అర్జున్ టెండూల్కర్ వార్షిక పాకెట్ మనీ యోజనలో భాగంగా ముంబయి కొనుగోలు చేసిందని కామెంట్ చేశాడు. ఏ కోడింగ్ నేర్చుకోకుండానే అర్జున్ టెండూల్కర్ ప్రతి సంవత్సరం రూ.30లక్షలు సంపాదిస్తున్నాడని మరో యూజర్ కామెంట్ చేశాడు. 2023 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో అర్జున్ అరంగేట్రం చేశాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై ఐపీఎల్ కెరీర్‌లో తొలి వికెట్ తీశాడు. తొలి వికెట్‌ని భువనేశ్వర్ కుమార్‌ను అర్జున్ అవుట్ చేశాడు. ఆ మ్యాచ్‌లో ముంబయి 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆ సీజన్‌లో అర్జున్ మొత్తం మూడు వికెట్లు తీశాడు.

## పీసీబీ ఓకే అనేలా.. బంపర్ ఆఫర్




ఢిల్లీ: ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాకిస్తాన్‌లో పర్యటించేందుకు భారత్ ససేమిరా అంటోంది. దీంతో ఈ మ్యాచ్ వేదికను తటస్థ వేదికపై ఏర్పాటు చేసేలా పాకిస్తాన్ జట్టును కన్విన్స్ చేసేందుకు ఐసీసీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. తాజాగా హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ ఓకే అనేలా ఐసీసీ కీలక ప్రతిపాదనలు చేసినట్టు తెలుస్తోంది. భారత్ తో జరిగే మ్యాచులను దుబాయ్ వేదికగా నిర్వహించగలిగితే ఆ జట్టుకు ఆర్థిక ప్రోత్సాహకాలు పెంచుతామని చెప్పినట్టు తెలుస్తోంది. 'ఛాంపియన్స్ ట్రోఫీని వచ్చే ఏ ఫార్మాట్‌లో నిర్వహించాలనే దానిపై బోర్డు ప్రతినిధులు వర్చువల్ మీటింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం నాటికి దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది అని ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. ఒకవేళ భారత్ అర్హత సాధిస్తే, భారత్‌తో జరిగే మ్యాచులతో పాటు ఫైనల్ మ్యాచ్‌ను దుబాయ్‌లో నిర్వహించేందుకు అనుమతించాలని అందుకు అదనపు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తామని పీసీబీని కోరుతున్నాం. పీసీబీ కూడా హైబ్రిడ్ మోడల్‌కు అంగీకరించినప్పటికీ, పాకిస్తాన్, ఇండియా మధ్య జరిగే గ్రూప్ (స్టేజ్) మ్యాచ్, ఫైనల్‌ను లాహోర్‌లోనే నిర్వహించాలని కూడా పట్టుబట్టింది. సహజంగానే, భారత క్రికెట్ బోర్డు దీనికి అంగీకరించదు. భారత్ తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లోనే ఆడాలని పట్టుబడుతోంది" అని ఐసీసీకి చెందిన సోర్స్ వెల్లడించింది. షెడ్యూల్‌ను ప్రకటించడంలో జాప్యంపై పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ ఇప్పటివరకు స్పందిచలేదు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీని షెడ్యూల్ ప్రకారం పాకిస్తాన్‌లో నిర్వహించాలని, భారత్ ఆడటం, ఆడకపోవడం ఆ జట్టు ఇష్టమని.. వేరే జట్లకు లేని సమస్య టీమిండియాకు మాత్రమే ఎందుకని పీసీబీ వాదిస్తోంది. "మాకు సంబంధించినంతవరకు, కరాచీ, లాహోర్, రావల్పిండిలోని మూడు స్టేడియంలలో నిర్మాణ పనులతో సహా టోర్నమెంట్ కోసం అన్ని సన్నాహాలు షెడ్యూల్ ప్రకారం కొనసాగుతున్నాయి" అని పీసీబీ అధికారి ఒకరు తెలిపారు.

## అదో చెత్త నిర్ణయం.. పంత్



ముంబై: ఐపీఎల్ మెగా వేలం చరిత్రను తిరగరాసేలా అత్యంత ఖరీదైన ధరకు అమ్ముడుపోయిన రిషభ్ పంత్ రికార్డు క్రియేట్ చేశాడు. ఏకంగా రూ. 27 కోట్లు చెల్లించి ఈ ట్యాలెంటెడ్ క్రికెటర్‌ను లక్నో జ్టుట సొంతం చేసుకుంది. దీంతో తాజాగా పంత్ సోషల్ మీడియా వేదికగా ఓ ఎమోషనల్ పోస్టును పంచుకున్నాడు. ఢిల్లీ జట్టుతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని తలుచుకుంటూ ఓ వీడియోను సైతం షేర్ చేశాడు. అయితే, ఈ పోస్టు కొందరు ఢిల్లీ అభిమానులకు అసహనం కలిగించింది. "ఢిల్లీ క్యాపిటల్స్ తో నా ప్రయాణం అద్భుతంగా ఉంది. ఫీల్డ్ లో నేను చేసిన సాహసాల నుంచి మైదానంలో గడిపిన మధురమైన క్షణాల వరకు ఎన్నో అనుభూతులను పొందాను. నేను ఓ టీనేజర్ గా ఇక్కడకు వచ్చాను. ఊహించని విధంగా ఎదుగుతూ వస్తున్నాను. ఢిల్లీ జట్టుతో నాది తొమ్మిదేళ్ల అనుబంధం. నా జీవితంలో అత్యంత కష్టమైన పరిస్థితుల్లో కూడా అక్కున చేర్చుకుని ప్రోత్సహించింది నా జట్టు. అన్నింటా అభిమానులు నాకు అండగా నిలిచి.. ఈ ప్రయాణాన్ని విలువైనదిగా మార్చారు. ఎప్పుడు ఫీల్డ్ లోకి అడుగుపెట్టినా మిమ్మల్ని సంతోషపెట్టడానికే చూస్తాను" అంటూ తెలిపాడు.

ఇక ఈ పోస్టుపై ఢిల్లీ జట్టును అభిమానించే కొందరు ఘాటుగా స్పందిస్తున్నారు. పంత్ ను వదిలేయడమంత చెత్త నిర్ణయం మరొకటి లేదు.. అంటూ ఒకరు కామెంట్ చేశారు. పంత్ ఎక్కడుంటాడో నేనూ అక్కడే అంటూ మరో యూజర్ తన మద్దతును తెలిపాడు. పంత్ 2016లో ఢిల్లీ క్యాపిటల్స్ లో చేరాడు. ఈ జట్టుకు మంచి విజయాలను అందించాడు. అయితే 2022లో పంత్ రోడ్డు యాక్సిడెంట్ లో గాయపడిన విషయం తెలిసిందే. దీంతో మొత్తం ఆ ఏడాది ఐపీఎల్ సీజన్ కే దూరమయ్యాడు. ఆ తర్వాత వేలం సమయంలోనే భేదాభిప్రాయాలు తలెత్తడంతో పంత్ ను ఢిల్లీ వదిలేసింది. అయితే, అప్పటికే పంత్ కోసం ఎదురుచూస్తున్న లక్నో జట్టు ఈ ఆటగాడిని ఒడిసిపట్టుకుంది.

## పింక్ బాల్ టెస్ట్‌కి రంగం సిద్ధం

### డిసెంబర్ 6 నుంచి జరగనున్న మ్యాచ్‌కి పింక్ బాల్



భారత్ – ఆస్ట్రేలియా మధ్య జరిగిన బోర్డర్–గవాస్కర్ టెస్టు సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్‌లో టీమిండియా విజయం సాధించింది. పెర్త్‌లోని ఆప్టస్ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత జట్టు 295 పరుగుల తేడాతో ఆసీస్‌ను ఓడించి శుభారంభం చేసింది. ఇప్పుడు రెండో టెస్టు మ్యాచ్‌కి ఇరు జట్లు సిద్ధమవుతున్నాయి. బోర్డర్–గవాస్కర్ సిరీస్‌లో రెండో టెస్టు మ్యాచ్ డిసెంబర్ 6 నుంచి ప్రారంభం కానుంది. అడిలైడ్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్ పింక్ బాల్ టెస్ట్. అంటే, ఈ టెస్ట్ మ్యాచ్ డే/నైట్ జరగనుంది. అందుకే ఈ మ్యాచ్‌లో రెడ్ బాల్‌కు బదులు పింక్ బాల్‌ను వినియోగిస్తున్నారు.దీని ప్రకారం డిసెంబర్ 6 నుంచి అడిలైడ్‌లోని ఓవల్ మైదానంలో పింక్ బాల్ టెస్టు మ్యాచ్ జరగనుండగా, ఈ మ్యాచ్‌లో టీమిండియాకు రోహిత్ శర్మ నాయకత్వం వహించనున్నాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టుకు హిట్‌మ్యాన్ అందుబాటులో లేడు. వ్యక్తిగత కారణాలతో రోహిత్ శర్మ తొలి టెస్టుకు దూరమయ్యాడు. జస్ప్రీత్ బుమ్రా తన గైర్హాజరీలో టీమ్ ఇండియాను విజయవంతంగా నడిపించాడు. ఇప్పుడు రోహిత్ శర్మ జట్టులోకి రావడంతో కెప్టెన్ స్థానంతో ప్లేయింగ్ ఎలెవన్‌లో కనిపించనున్నాడు. హిట్ మ్యాన్ రాకతో తొలి మ్యాచ్ ఆడిన దేవదత్ పడిక్కల్ ఔట్ తప్పుకోనున్నాడు.

## మమతలో అరుదైన శస్త్ర చికిత్స





- తక్కువ ఖర్చుతో ఆధునీక వైద్యం
- మనత వైద్యసంస్థల సెక్రటరీ జయశ్రీ, న్యూరో సర్జన్ డాక్టర్ జగదీష్

**ఖమ్మం టౌన్, (జనం సాక్షి):** మమత ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్సలతో పాటు, తక్కువ ఖర్చుతో అధునీక వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నట్లు మమత వైద్య విద్యా సంస్థల సెక్రటరీ పువ్వాడ జయశ్రీ తెలిపారు. మంగళవారం మమక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ 26 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన మమత ఆసుపత్రిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ఒడిశా రాష్ట్రం నుంచి కూడా ఎంతో మంది రోగులు వైద్యం కోసం వచ్చినట్లు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునీక సౌకర్యాలతో అన్ని విభాగాలలో వైద్య సేవలు, శస్త్ర చికిత్సలను తక్కువ ఖర్చుతో అందిస్తున్నట్లు తెలిపాడు. ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలను పేదలకు ఉచితంగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మమత ఫౌండర్ చైర్మన్ పువ్వాడ నాగేశ్వరరావు, చైర్మన్ పువ్వాడ అజయ్‌కుమార్ సారథ్యంలో మనుత ఆసుపత్రికి అవసరమైన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. మనుతలో అందించే వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

**న్యూరో విభాగంలో అరుదైన శస్త్ర చికిత్స: డాక్టర్ జగదీష్**

న్యూరో విభాగంలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ జగదీష్ తెలిపారు. హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు లక్షలకు పైబడి ఖర్చయ్యే శస్త్ర చికిత్సను ఆరోగ్యశ్రీలో విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించినట్లు ఆయన తెలిపారు. చింతకాని మండు ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన 80 సంవత్సరాల జి, వెంకయ్య అనే వ్యక్తి గత కొద్ది సంవత్సరాలుగా తలనొప్పి, కళ్లు తిరగడు, నడుస్తూ తుళ్లిపడటం, ఏ పని చేయకపోవడు, అప్పుడప్పుడు వాంతులు అవ్వడు, కందూల బలహీనత, కంటి చూపు తగ్గడు వంటి సమస్యలతో బాధపడుతూ నవంబర్ ఒకటిన మమత ఆసుపత్రికి వచ్చాడని ఆయన తెలిపారు. వెంకయ్యకు ఎంఆర, సిటీ స్కాన్ ఇతర పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అతని బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఆ ట్యూమర్ కూడా మెదడు నుంచి వెన్నుపూసకు వచ్చే భాగంలో చిన్న మెదడు మేధోకాలదు మధ్యలో ఆ ట్యూమర్ ఏర్పడిందని డాక్టర్ జగదీష్ తెలిపారు. ఈ నెల 15న అతనికి శస్త్ర చికిత్స నిర్వహించామని ఈ శస్త్రచికిత్స కూడా ఎంతో భష్టతరమైందని తెలిపారు. తల వెనక బాగం కండరాల మధ్య నుంచి ఈ శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చిందని ఆయన తెలిపారు.

## కోటి 30 లక్షల విలువ గల 5.2 క్వింటాళ్ల గంజాయి దహనం





**మంచిర్యాల ప్రతినిధి నవంబర్ 26 జనంసాక్షి :**

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలోని, మంచిర్యాల, పెద్దపల్లి రెండు జిల్లాలో 2021 నుండి ఇప్పటి వరకు వివిధ పోలీసు స్టేషన్‌లలో 64 కేసుల్లో నిందితుల నుండి సీజ్ చేసిన ప్రభుత్వ నిషేధిత 5.2 క్వింటాళ్ల గంజాయిని డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో దహనం చేశారు .

64 కేసుల్లో నిందితుల నుండి సీజ్ చేసిన రూ:1,30,38,600 విలువ గల 521.544 కిలోల గంజాయిని, యన్.డి.పి.యస్. చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల ముందు కేసు ప్రాపర్టీని యఫ్.యస్.ఎల్. కొరకు శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో నేడు మంగళవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ వెంకటరమణ ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధ నలను పాటిస్తూ దహనం చేయడం జరిగిందని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ తెలిపారు . కమీషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ సీపీ శ్రీనివాస్, కమిటీ సభ్యులైన రాజు అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామగుండం, గోదావరిఖని ఎసిపి ఎం .రమేష్, జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు, టాస్క్ ఫోర్స్ ఎసిపి మల్లారెడ్డి, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ జి. సతీష్ , మల్లేష్ అడ్మిన్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో గంజాయిని దహనం చేశారు.

ఈ సందర్భంగా సీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ .. యన్.డి.పి.యస్ యాక్ట్ లోని నియమనిబంధనల ప్రకారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేయనడిన కేసులలో నిల్వ ఉన్న గంజాయిని ఈ రోజు దహనం చేయడం జరిగిందని తెలియజేశారు. కొందరు దురుద్దేశ్యంతో అక్రమార్జనలో భాగంగా అక్రమ గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారని అన్నారు.. అసాంఘీక కార్యకలా పాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం స్థానిక, స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టరీత్య కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై మత్తుకు బానిసలై గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించే వారిపై కూడా చట్టపరమైన కేసులు నమోదు చేసి పిడి యాక్ట్‌కు కూడా అమలు చేసి జైలుకు పంపడం జరుగు తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్.డిసిపి అడ్మిన్ సి.రా జు స్పెషల్ బ్రాంచ్ ఏసిపి రాఘవేంద్రరావు, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, జైపూర్ ఎసిపి ఎ.వెంకటేశ్వర్లు, టాస్క్ ఫోర్స్ ఏసిపి మల్లారెడ్డి, ఏ.ఆర్ ఏసిపి సుందర్రావు, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ సతీష్, ఆర్ఐలు దామోదర్ పాల్గొన్నారు

## రాజ్యాంగాన్ని రక్షించుకోవడం ప్రజలందరి కర్తవ్యం కావాలి

**- పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు**

**బోనకల్: (జనం సాక్షి)**



భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవడం ప్రజలందరి కర్తవ్యం కావాలని పల్లెప్రపంచం ఫౌండేషన్ అధ్యక్షులు పల్లా కొండలరావు తెలిపారు. మంగళవారం బోనకల్‌లో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో 75వ రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పల్లా కొండలరావు పూలదండ వేసి నివాళులర్పించారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు నోముల పుల్లయ్య అధ్యక్షతన జరిగిన సభలో పల్లా కొండలరావు మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో భారత రాజ్యాంగానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. దీని వెనుక అంబేద్కర్ కృషి మరువలేనిదన్నారు. సర్వసత్తాక,సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా పౌరులందరికీ సాంఘిక,రాజకీయ, ఆర్థిక సమానత్వం కోసం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 75ఏండ్లయినా భారత రాజ్యాంగం తన విశిష్టత కోల్పోలేదని, చాలా దేశాల్లో ఆయా రాజ్యాంగాలు విఫలమయిన విషయాన్ని గుర్తు చేశారు. రాజ్యాంగ విలువలను ధ్వంసం చేయడానికి పలు రకాలుగా పాలకులు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు, పౌర సంఘాలు, రాజకీయ పార్టీలు సమిష్టిగా ఎదిరించాలన్నారు.

## లారీ డ్రైవర్ ఉరేసుకొని ఆత్మహత్య

**ఖమ్మం, నవంబర్ 26 జనంసాక్షి :**



ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై ఓ లారీ డ్రైవర్ బలవన్మరణా నికి పాల్పడ్డాడు ఈ సంఘటన మంగళవారం ఖమ్మం లారీ ఓనర్స్ యూనియన్ ఆఫీసు లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కామే పల్లి మండలం మర్రిగూడెం గ్రామానికి చెం దిన పొక్కం రామారావు (45) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు అలవాటు పడిన రామారావు ను పెళ్ళైన కొన్నాళ్ళకే భార్య వదిలేసి పుట్టింటికి వెళ్ళింది ఆర్థిక ఇబ్బందులు, మద్యం వ్యసనమే రామారావు ఉరి వేసుకొని చనిపోవడానికి కారణమై ఉండవచ్చని బంధువులు అనుమానిస్తున్నా రు. ఈ ఘటనపై ఖమ్మం త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు



## మంత్రి పొంగులేటిని కలిసిన బిఆర్ నాయుడు

**హైదరాబాద్ నవంబర్ 26 జనంసాక్షి :** తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో తిరుమల తిరుపతి దేవస్థానం నూతన చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి బిఆర్ నాయుడుని శాలువాతో సత్కరించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
27 నవంబర్ 2024



## ఇథనాల్ నిర్మాణాన్ని రద్దు చేయాలని తహసీల్దార్‌కు వినతి

**రాజోలి, నవంబర్ 26 (జనంసాక్షి) :** ఇథనాల్ కంపెనీ నిర్మాణం రద్దు చేయాలని కోరుతూ మంగళవారం రాజోలి మండల కేంద్రంలోని తహసీల్దార్ రామ్మోహన్ కు ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ వ్యతిరేక పోరాట సభ్యులు మాట్లాడుతూ కంపెనీ వ్యర్థాల వల్ల భూమి, నీరు, గాలి కలుషితమై మానవ మనుగడకు మునుముందు ప్రమాదం తప్పదన్నారు. అనంతరం తహసీల్దార్ సానుకులంగా స్పందించి మరోసారి జిల్లా అధికారులతో మాట్లాడి ఫ్యాక్టరీ నిర్మాణాన్ని రద్దు చేసే విధంగా సహకరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ధన్వాడ మాజీ సర్పంచ్ అలెగ్జాండర్, భారస నాయకులు పచ్చర్ల శ్రీనివాసులు, ఫ్యాక్టరీ వ్యతిరేక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఇథనాల్ ఫ్యాక్టరీపై పెల్లుబుకిన ప్రజాగ్రహం



## నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ బంద్.. భారీ రాస్తారోకో

- స్వచ్ఛందంగా తరలివచ్చిన వేలాదిమంది.. స్తంభించిన హైవే
- పిల్లాపాపలతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోడ్డుపైనే..
- కంపెనీ అనుమతులన్నీ రద్దు చేయాలని పట్టుబట్టిన మహిళలు, రైతులు

**నిర్మల్ బ్యూరో, నవంబర్26 (జనంసాక్షి) :** ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా దాదాపు నాలుగు నెలలుగా శాంతియుత పద్ధతుల్లో ఆందోళనలు చేస్తున్న దిలావర్‌పూర్ మంగళవారం ఒక్కసారిగా దద్దరిల్లింది. ప్రభుత్వం, అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజాగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో పిల్లాపాపలతో స్వచ్ఛందంగా తరలివచ్చిన మహిళలు, రైతులు ఆకలిదప్పులు మరిచి జాతీయ రహదారిపైనే బైటాయించారు. 'మా నాయకులు, అధికారులు' కనబడటం లేదంటూ వారి ఫొటోలతో ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు. భైంసా నిర్మల్ జాతీయ రహదారి మార్గంలో రెండువైపులా దాదాపు 20 కిలోమీటర్ల ట్రాఫిక్ స్తంభించడంతో అధికారులు, పోలీసులు తలలు పట్టుకున్నారు. నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా అక్కడి ప్రాంత రైతులు, మహిళలు రోడ్డెక్కారు. ఉదయం 10గంటల నుండి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టి ట్రాఫిక్ వ్యవస్థను స్తంభింపజేశారు. ఆందోళనకారుల రాస్తారోకోతో జాతీయ రహదారిపై కిలో మీటర్ల మేర వాహనాలు వాహనాలు నిలిచి పోయాయి. గత నాలుగు నెలలుగా వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసనలు చేపడుతున్న స్థానికులు ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో మంగళవారం బంద్‌కు పిలుపునివ్వడం, విద్యాసంస్థలు, వాణిజ్య సంస్థలు, హోటళ్లు పూర్తిగా మూసి ఉంచడం గమనార్హం. చంటిపిల్లలతో వచ్చిన మహిళలు, రైతులు వేల సంఖ్యల్లో ఉదయం నుంచి జాతీయ రహదారి మార్గంలోనే బైటాయించారు. సంఘటనా స్థలానికి జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు వచ్చి సముదాయించినా ఆందోళనకారులు తగ్గేదేలేదంటూ రాస్తారోకోను కొనసాగించారు. ప్రజాప్రతినిధులు, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు కనబడటం లేదని ప్లకార్డులు చేతబూని నిరసనలో పాల్గొన్నారు. ఎన్నికల్లో అన్నిరాజకీయ పార్టీలు ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయిస్తామని హామీలు ఇచ్చినప్పటికి ఎన్నికలు గడిచాక ఏ రాజకీయ పార్టీల నాయకులూ మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇథనాల్ పరిశ్రమపై ఆందోళన మొదలైనప్పటి నుంచి స్థానిక బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీహరి రావు కనబడుట లేదంటు చిత్రపటాలను ప్రదర్శించారు.



### కాలుష్యం బారినపడ్డా పట్టదా..?

తమ గ్రామాలు నాశనమవుతాయని చెబుతున్నా అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో ఇటీవలకాలంలో దిలావర్‌పూర్‌లో ధర్నాలు, నిరసనలు తీవ్రతరం చేశారు. టెంటు వేసుకుని ప్రతిరోజూ తమ నిరసన చేపడుతున్నారు. తాజాగా మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద జాతీయ రహదారిని దిగ్బందం చేశారు. ఈ నిరసనలో ఇతర గ్రామాల ప్రజలు, చిన్నపిల్లలు, వృద్ధులు మహిళలు సైతం పాల్గొన్నారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో జాతీయ రహదారిపై ధర్నాతో భారీగా వాహనాల రాకపోకలు స్తంభించాయి. పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసి దిలావర్‌పూర్ మండలంలోని పంట పొలాలను, పర్యావరణాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. లేదంటే ఫ్యాక్టరీ ఏర్పాటు రద్దు అయ్యేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు.

# సోలార్ విద్యుత్ సద్వినియోగానికి బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ వ్యవస్థ!

- సోలార్ విద్యుత్తును నిలువ ఉంచడమే లక్ష్యం
- పైలెట్ ప్రాజెక్ట్‌గా ఒక మెగావాట్ ప్లాంట్
- దీని ద్వారా ఏడాదికి రూ.1.6 కోట్ల విలువైన సోలార్ సద్వినియోగం
- ప్రయోగాత్మకంగా మందమర్రి సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు
- ప్రయోగం సఫలమైతే మరో 2 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ఏర్పాటు.
- తద్వారా మొత్తం రూ.4.8 కోట్ల లబ్ధి
- సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ వెల్లడి

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)



సోలార్ విద్యుత్ సద్వినియోగం, పొదుపు చర్యల్లో భాగంగా సింగరేణి సంస్థ మరో వినూత్న ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. మందమర్రి సోలార్ ప్లాంట్ లో పగటిపూట ఉత్పత్తి జరిగి, వినియోగం తర్వాత ఇంకా మిగిలిన సోలార్ విద్యుత్ ను వృథాగా పోనీయకుండా బ్యాటరీలో నిలువ చేసే "బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంను" పైలెట్ ప్రాజెక్ట్ గా ఏర్పాటు చేస్తోంది. సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ శ్రీ ఎన్.బలరామ్ ఈ వినూత్న పద్ధతికి సంబంధించిన వివరాలను ఒక ప్రకటనలో తెలియజేశారు. మందమర్రి ఏరియాలోని 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ లో పైలెట్ ప్రాజెక్ట్ గా చేపడుతున్న ఒక మెగా వాట్ నిలువ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ పద్ధతి వల్ల నెలకు రూ. 13 లక్షల విలువైన(ఏడాదికి రూ. 1.6 కోట్ల) సోలార్ విద్యుత్ వృథా కాకుండా సద్వినియోగం కానున్నదని తెలియజేశారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్ విజయవంతం అయితే మరో రెండు మెగా వాట్ల సామర్థ్యం గల సిస్టమ్ లను ఇక్కడ ఏర్పాటు చేయనున్నామని, తద్వారా నెలకు దాదాపు 40 లక్షల రూపాయల(ఏడాదికి రూ. 4.8 కోట్ల) విలువైన సోలార్ విద్యుత్ సద్వినియోగం అవుతుందని ఆయన పేర్కొన్నారు. మందమర్రిలో సింగరేణి సంస్థ తన గనుల విద్యుత్ అవసరాల నిమిత్తం 28 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ను 2021 లో ఏర్పాటు చేసుకుంది. సొంత అవసరాల కోసం ఏర్పాటు చేశారు కనుక దీనిని "ఇన్ హౌస్ క్యాప్టివ్ ప్లాంట్" గా పేర్కొనడం జరుగుతుంది. ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తును మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలలో ఉన్న మొత్తం 11 భూ గర్భ గనులు, 4 ఓపెన్ కాస్ట్ గనులు, తదితర పారిశ్రామిక అవసరాలకు వినియోగిస్తూ వస్తున్నారు. ఈ ప్లాంట్ ద్వారా రోజుకు సగటున ఒక లక్ష 34 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుండగా దీనిలో సుమారు ఒక లక్ష 14 వేల యూనిట్ల విద్యుత్ ను కంపెనీ వినియోగిస్తుంది. కానీ ఇంకా మిగిలి ఉన్న సుమారు 20 వేల యూనిట్ల విద్యుత్ ను మాత్రం వినియోగించలేకపోతుంది. మధ్యాహ్నం వేళ కార్మికులకు భోజన విరామ సమయం ఉండడం, యంత్రాలు కూడా విశ్రాంతిలో ఉండటం వలన ఈ విద్యుత్ ను వాడలేకపోతున్నారు. ఫలితంగా ఈ విద్యుత్ స్థానిక సబ్ స్టేషన్ ద్వారా తెలంగాణ ఉత్తర విద్యుత్



పంపిణీ సంస్థ (టీజీఎన్పీడీసీఎల్) కు ఉచితంగా అందజేయాల్సి వస్తుంది. ఇన్ హౌస్ క్యాప్టివ్ పవర్ ప్లాంట్ ద్వారా ఈ మిగులు విద్యుత్ రాష్ట్ర విద్యుత్ శాఖ లైన్లలో కలుస్తుంది. కనుక దీనికి డిస్కమ్ వారు ఎటువంటి ఛార్జీలు చెల్లించకుండా ఉచిత విద్యుత్తుగా పరిగణిస్తూ వాడుకుంటున్నారు. ఈ విధంగా గ్రిడ్కు ఉచితంగా వెళ్లిపోతున్న 20 వేల యూనిట్ల సోలార్ విద్యుత్ ను సద్వినియోగం చేయాలన్న ఉద్దేశంతో సింగరేణి సంస్థ దీనిని నిలువ ఉంచుకొని, తిరిగి అవసరమైనప్పుడు వినియోగించుకునే బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం (బి.ఈ.ఎస్.ఎస్.) ను ఇక్కడ ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక చొరవతో ఈ సిస్టం ఏర్పాటులో అనుభవం ఉన్న కంపెనీలను ఆహ్వానించడం జరిగింది. వీటిలో కాన్పూర్ కు చెందిన మెస్సర్స్ మార్స్ ఇండియా యాంటేనాస్ అండ్ ఆర్ ఎఫ్ సిస్టమ్స్ అనే ప్రైవేటు కంపెనీకి పైలెట్ ప్రాజెక్ట్ గా ఒక మెగావాట్ సామర్థ్యం గల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ఏర్పాటు పనిని అప్పగించారు. మరి కొద్ది రోజుల్లో ఈ సిస్టం ఇక్కడ ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఇది ఏర్పాటైతే మధ్యాహ్నం పూట వృథా అవుతున్న సోలార్ విద్యుత్ లో ఒక మెగావాట్ సామర్థ్యం గల విద్యుత్ ను బ్యాటరీ ఎనర్జీ సిస్టంలో నిలువ ఉంచి, రాత్రివేళ సింగరేణి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ విధంగా నెలకు రూ. 1 3 లక్షల విలువైన సోలార్ విద్యుత్ ను సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. ఇది విజయవంతం అయితే మరో రెండు మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను ఇక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఒక మెగావాట్ (బి.ఈ.ఎస్.ఎస్.)కు దాదాపు 2.5 కోట్లు ఖర్చు అవుతుండగా.. మూడు మెగావాట్ల ప్లాంట్లకు అయ్యే వ్యయం దాదాపు రూ. 7.5 కోట్లుగా అంచనా. సోలార్ విద్యుత్ సద్వినియోగం ద్వారా ఈ ఖర్చు రెండు సంవత్సరాల లోపే తీరనున్నది.

### సొంత సోలార్ ప్లాంట్ తో నెలకు నాలుగు కోట్ల రూపాయలు ఆదా

మందమర్రి ఏరియాలో సింగరేణి సంస్థ సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయక ముందు శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలలో గల 15 గనుల అవసరాలకు నెలకు 13 కోట్ల రూపాయల విలువైన విద్యుత్ ను రాష్ట్ర విద్యుత్ శాఖ నుండి కొనుగోలు చేస్తుండేది. కాగా 2021 ఏప్రిల్ 17 తేదీన 28 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసిన తరువాత నుండి నెలకు కేవలం 9 కోట్ల రూపాయల కరెంటు బిల్లులు మాత్రమే చెల్లిస్తుంది. అంటే సోలార్ ప్లాంట్ వల్ల నెలకు నాలుగు కోట్ల రూపాయల ఆదా చేకూరింది. ఇప్పుడు ఈ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం విజయవంతం అయితే మరో రూ. 4.8 కోట్ల ఆదా చేకూరనుంది. సోలార్ విద్యుత్ సద్వినియోగానికి, పొదుపుకు సంస్థ ఛైర్మన్ తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలనిస్తున్నాయి.

# రాజ్యాంగం ద్వారానే స్వేచ్ఛ, సమానత్వం

- సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, నవంబర్ 26 (జనంసాక్షి) :** రాజ్యాంగం ద్వారానే దేశ పౌరులకు న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం లభించిందని సుడా ఛైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం నగర కాంగ్రెస్ ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తా లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల వేసి మాట్లాడారు. రాజ్యాంగాన్ని ఆమోదించి నేటికి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా జిల్లావాసులకు భారత రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ... భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మార్గనిర్దేశనంలో అందించిన రాజ్యాంగ ఫలాలు ప్రజలందరికీ అందాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పమని అన్నారు. 1949 నవంబర్ 26 న రాజ్యాంగాన్ని ఆమోదిస్తూ తీసుకున్న నిర్ణయంతో భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశంగా పరిఢవిల్లుతోందని తెలిపారు. దేశాన్ని సమున్నతంగా నిలబెట్టిన రాజ్యాంగ నిర్మాతలను సంవిధాన్ దివస్ రోజున స్మరించుకోవడమే కాకుండా రాజ్యాంగ విలువలు కాపాడుతూ ఆ మహాశయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ నిరంతరం పనిచేయాలని ఆకాంక్షించారు. ప్రతినిత్యం మన హక్కులు, బాధ్యతలను గుర్తుచేస్తూ అందరికీ సమానావకాశాలతో ప్రగతిపథంలో బాటలు వేయడానికి నిత్యస్ఫూర్తిగా నిలిచే మూలస్తంభం మన రాజ్యాంగమని పేర్కొన్నారు.

# మాటలు తక్కువ.. చేతలు ఎక్కువ నా సిద్ధాంతం!

- చిల్లర గాళ్ల మాటలను పట్టించుకోవద్దు!
- అభివృద్ధి పనుల శంకుస్థాపనలో మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** మాటలు తక్కువ చేతలు ఎక్కువ తన సిద్ధాంతమని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం తన సొంత నియోజకవర్గం మంథనిలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా సిఆర్ఆర్ నిధులు 7 కోట్ల తో నిర్మించబోతున్న పిడబ్ల్యుబి రోడ్డు ఖానాపూర్ నుండి ఎల్ మడుగు వరకు డబల్ రోడ్డు పనులకు, నాగారం గ్రామంలో 20 లక్షల తో నిర్మించబోతున్న హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి మంత్రి శ్రీధర్ బాబు శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మంథని నియోజక వర్గంలో కొంతమంది చిల్లర వ్యక్తులు చిల్లర మాటలు మాట్లాడుతున్నారని వారి మాటలను పట్టించుకోవద్దని అన్నారు. వారి మాటలకు అభివృద్ధి, సంక్షేమ పనులతో సమాధానం చెబుదామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో పాటు పలు శాఖల జిల్లా అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంథనిలో కలకలం

- ప్రభుత్వ హాస్టల్‌లో విద్యార్థినితో నగ్నపూజ?

**మంథని, (జనంసాక్షి) :** మూఢనమ్మకాల ముసుగు లో బాలికల హాస్టల్ వసతి గృహంలో దారుణానికి ఒడిగట్టారు. కనక వర్షం కురుస్తుందని, డబ్బు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుతుందని ఏకంగా విద్యార్థినితో నగ్న పూజలకు ఒడిగట్టారు. హాస్టల్‌లో వంట పని చేసే వంట మనిషి ఈ దారుణా నికి పాల్పడటం ఇంకా విడ్డూరం. ఈ దారుణ ఘటన పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బాలికల వసతి గృహంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే.. పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో పొరుగు జిల్లాకు చెందిన ఓ విద్యార్థిని, తన సోదరితో కలిసి ఉంటుంది. బాలిక తల్లిదండ్రులు పేదవారు కావడంతో ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ అక్కచె ల్లెల్లు చదువుకుంటున్నారు. వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న హాస్టల్‌లో పనిచేసే ఓ వంట మనిషి దారుణానికి ఒడిగట్టింది. ఆ ఇద్దరు బాలికలను చేరదీసినట్టుగా నటిస్తూ పెద్ద కుట్రకు తెరదించింది. వారిలో పెద్దమ్మాయికి మాయ మాటలు చెప్పి.. నగ్న పూజలు చేస్తే కనకవర్షం కురుస్తుందని నమ్మించింది. ఆ డబ్బుతో మీ కుటుంబం అంతా సంతోషంగా ఉండవచ్చని నమ్మబలికింది. వంట మనిషి మాయ మాటలు నమ్మిన బాలిక ఆమె చెప్పినట్లు చేయ డానికి అంగీకరించింది. ఈ క్రమంలో వారం క్రితం వంట మనిషి ఉండే గదికి ఓ వ్యక్తిని తీసుకువచ్చింది. అక్కడకి బాలికను పిలిపించి అతని ముందర నగ్నంగా ఉండాలని చెప్పింది. అప్పుడు అతడు ప్రత్యేక పూజలు చేస్తాడని, అప్పుడు డబ్బు బంగారం రాశులు కురుస్తాయని చెప్పింది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన ఆ విద్యార్థిని భయంతో అక్కడి నుంచి పారిపోయింది. మంథని పట్టణంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లి 4 రోజులుగా అక్కడే తలదాచుకుంది. అనంతరం అసలు విషయం బాలిక తల్లిదండ్రులకు విషయం తెలియడంతో స్థానికంగా కలకలం రేగింది. బాలిక తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు, బంధువులు హాస్టల్ వద్దకు చేరుకుని సదరు వంట మనిషిని నిలదీశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న సీఐ రాజు, ఎస్ఐ రమేశ్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సర్దుమనిగేలా చర్యలు చేపట్టారు. బాలికను ప్రలోభ పెట్టిన మహిళను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు చేయడంతో.. పోలీసులు కేసు నమోదు చేసినట్టు మంథని ఎస్ఐ తెలిపారు. దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు.






Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370